

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

వెల (Price) : Rs. 6.50
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 352

శుక్రవారం | 27-2-2026 | పేజీలు: 14

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: ఏకాదశి రా.10:33 తదుపరి ద్వాదశి, నక్షత్రం: ఆర్ద్ర ఉ.10:49 తదుపరి పునర్వసు, వర్జ్యం: రా.10:12-11:43, దుర్ముహూర్తం: ఉ.8:58-9:44, మ.12:51-1:37, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: ఉ.10:30-12:00, సూర్యోదయం:6:38, సూర్యాస్తమయం: 6:17 | గుంటూరు సిటీ

Capgemini

విశాఖకు క్యాప్‌జెమినీ! 14

భూముల పరిశీలనకు వచ్చిన కంపెనీ ప్రతినిధులు

మధురవాడ ఐటీ పార్కు సహా 4 ప్రాంతాల సందర్శన

ఇంకేం ఇంకేం కావాలే..

మూడుముళ్ల బంధంతో ఒక్కటైన

విజయ్ దేవరకొండ, రష్మిక

ఉదయ్‌పూర్‌లో అంగరంగ వైభవంగా వివాహ వేడుక

తెలుగు, కొడవ సంప్రదాయాల్లో ఘనంగా పెళ్లి

వివాహ వేడుక ఫొటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన కొత్త జంట 11

అభిమానులు, ప్రముఖుల నుంచి శుభాకాంక్షల వెల్లువ



వీర బాదుడు!

సూర్యసేన ధనాధన్ బ్యాటింగ్

20 ఓవర్లలో 256 పరుగుల వరద

చెలరేగిన అభిషేక్, హార్దిక్ పాండ్యా

తిలక్ వర్మ సూపర్ ఇన్నింగ్స్

జింబాబ్వే గౌరవ ప్రదమైన స్కోర్

అర్షదీప్ సింగ్‌కు మూడు వికెట్లు

సెమీఫైనల్ ఆశలు సజీవం



10

గంగా, కావేరి నదుల అనుసంధానం జరగాలన్నదే నా ప్రగాఢ ఆకాంక్ష. ఈ భూమినే ఒక జలాశయంగా మార్చాల్సిన అవసరం ఉంది. గతంలో వాజపేయి ప్రధానిగా ఉన్న సమయంలో నా అభ్యర్థనపై కేంద్ర మంత్రి సురేశ్ ప్రభు అధ్యక్షతన నదీ జలాల అనుసంధానంపై టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు.

- సీఎం చంద్రబాబు



ప్రతి ఎకరాకూ సాగునీరు

ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు త్వరలో బ్లూప్రింట్

నల్లమల సాగర్‌తో 2 రాష్ట్రాలకు ప్రయోజనం

దీనికి అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదు

కాళేశ్వరం ప్రాజెక్టుకు మేమెప్పుడూ అడ్డుచెప్పలేదు

4 నెలల్లో వెలిగొండ తొలి దశ పూర్తిచేసి నీళ్లిస్తాం

గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం తొలి దశ పూర్తి

ఉత్తరాంధ్రలో 11 ప్రాజెక్టులూ ఈ టర్మ్‌లోనే పూర్తిచేస్తాం

గంగా, కావేరి నదుల అనుసంధానం నా ప్రగాఢ ఆకాంక్ష

అసెంబ్లీలో సాగునీటి ప్రాజెక్టులపై చర్చలో సీఎం చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): తెలుగు తల్లికి జలహారతి ఇచ్చేలా ప్రతి ఎకరాకూ సాగునీరు అందించాలన్న సంకల్పాన్ని నెరవేరుస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. నిర్దిష్ట సమయంలో ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు త్వరలోనే బ్లూప్రింట్ సిద్ధం చేసి అమలు చేస్తామని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులపై గురువారం

మిగతా 13వ పేజీలో...

రాయలసీమ ద్రోహి జగనే

వెలిగొండ పూర్తికాకుండానే జాతికి అంకితం 12

ఇప్పుడు అదే ప్రాజెక్టుకు నిధులు అడుగుతున్నారు

మంత్రి నిమ్మల మండిపాటు

మండలిలో తొండి!



చైర్మన్ వైఖరిపై టీడీపీ మండిపాటు

ఏకపక్షంగా చేశారని ఆరోపణ

కల్తీ నెయ్యిపై 'చర్చ'లో రచ్చ రచ్చ

వైసీపీ ఇవ్వని నోటీసు ఇచ్చారనే 'భావన'

లఘు చర్చ ప్రారంభించేందుకు అవకాశం

నోటీసు ఇవ్వలేదని అధికారుల ధ్రువీకరణ

ప్రభుత్వం వైపు ప్రకటనకు నిరాకరించిన చైర్మన్

లేఖ చూపించినా.. అది 'రాంగ్' అని తోసివేత

తనకు తెలియకుండా జారీ అయ్యిందని వెల్లడి

మండలిలో అధికార, విపక్షాల వాదోపవాదాలు

అరుపులు, కేకల హోరుతో దద్దరిల్లిన మండలి

ఎలాంటి చర్చా లేకుండానే నేటికి వాయిదా

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'కల్తీ నెయ్యి'పై ప్రభుత్వం తరపున దేవదాయ మంత్రి ప్రకటన చేయడమా? లేక... వైసీపీ వైపు నుంచి లఘు చర్చకు అనుమతించడమా? ఏది ముందు జరగాలి? దీనిపై గురువారం శాసన మండలిలో హోరాహోరీగా వాదనలు జరిగాయి. మండలి చైర్మన్ మోషేన్ రాజు ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారని, సభా నియమాలను పక్కకు తోసేసి వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారని తెలుగుదేశం సభ్యులు మండిపడుతున్నారు. చైర్మన్ మోషేన్‌రాజు వైసీపీ సభ్యులు ఇవ్వని నోటీసును ఇచ్చినట్లుగా భావించడం... ప్రభుత్వం ప్రకటన చేసేందుకు అనుగుణంగా సభ్యులకు సమాచారం అందించాలని అసెంబ్లీ సెక్రటేరియట్ జారీ చేసిన పత్రాన్ని 'నో... అది రాంగ్. నా అనుమతి లేదు' అని కరాఖండీగా తేల్చేయడం వివాదాస్పదమైంది. గురువారం శాసన మండలిలో 'కల్తీ నెయ్యి' అంశంపై స్వల్పకాలిక చర్చకు చైర్మన్ మోషేన్ రాజు అనుమతించారు. వైసీపీ సభ్యుడు పి.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడేందుకు అవకాశమిచ్చారు. అయితే... స్వల్పకాలిక చర్చలో ఏ అంశంపై మాట్లాడాలన్నా ముందుగా నోటీసు ఇవ్వాలి. దీనిపై వైసీపీ నోటీసు ఇవ్వలేదని అసెంబ్లీ సెక్రటేరియట్ వర్గాలు తెలిపాయి. అయినప్పటికీ... వైసీపీ నోటీసు ఇచ్చినట్లుగానే భావించి, ఆ పార్టీ సభ్యుడికి మాట్లాడే అవకాశమివ్వడంపై టీడీపీ తీవ్రంగా స్పందించింది. ఇది అంతటితో ఆగలేదు. ఇక్కడ మరో నాటకీయ

మిగతా 12వ పేజీలో...

మీరెళ్తారా.. నన్ను వెళ్లమంటారా?

మీరు క్షేత్రస్థాయి పర్యటనలు చేయకుంటే నేనే ఆకస్మిక తనిఖీలు చేస్తా

గదుల్లో కూర్చుంటే వాస్తవాలు తెలియవు

అధికారులైనా, నేతలైనా ఫీల్డుకెళ్లాల్సిందే

ప్రజలతో మాట్లాడినప్పుడే సమస్యలు తెలుస్తాయి

కల్తీ పాలు, డయేరియాలపై ఉదాసీనత వద్దు

బాధితులకు అత్యుత్తమ వైద్య సేవలందించండి

ఘటన జరగక ముందే పర్యవేక్షణ ముఖ్యం: సీఎం

శ్రీకాకుళం, తూ.గో అధికారులతో సమీక్ష



శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి/రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): 'మీరు క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్తారా? లేక మీ బదులు నేను వెళ్లడం మొదలు పెట్టమంటారా?' అని సీఎం చంద్రబాబు అధికారులను ప్రశ్నించారు. మీరు ఫీల్డుకు వెళ్లకుంటే.. తాను వెళ్లి ఆకస్మిక తనిఖీలు చేయడం మొదలు పెడతానని స్పష్టం చేశారు. ఆకస్మిక తనిఖీలు, క్షేత్రస్థాయి పర్యటనలను పూర్తిగా విస్మరించారని, గదుల్లో కూర్చుంటే వాస్తవాలు తెలియవని వ్యాఖ్యానించారు. అధికారులైనా, ప్రజాప్రతినిధులైనా క్షేత్రస్థాయికి వెళ్లాలని.. ప్రజలను కలిసి మాట్లాడినప్పుడే సమస్యలు తెలుస్తాయని స్పష్టం చేశారు. అలాంటి పర్యటనల ద్వారా మంచి ఫలితాలు

మిగతా 14వ పేజీలో...



డబ్ల్యూఈఎఫ్ అధ్యక్షుడికి

ఎప్‌స్టీన్ దెబ్బ!

వివాదంతో పదవి వీడిన బార్జ్ బ్రెండే

ఎప్‌స్టీన్-బార్జ్ సంబంధాలపై డబ్ల్యూఈఎఫ్ స్వతంత్ర దర్యాప్తు

జెనీవా, ఫిబ్రవరి 26: ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో తన పేరు బయటికి రావడంతో ప్రపంచ ఆర్థిక సమాఖ్య(డబ్ల్యూఈఎఫ్) అధ్యక్షుడు, సీఈవో బార్జ్ బ్రెండే పదవి నుంచి వైదొలిగారు. హైప్రొఫైల్ సెక్స్ కుంభకోణం నిందితుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో తనకు ఉన్న సంబంధాలపై దర్యాప్తు ప్రారంభమైన నేపథ్యంలో పదవిని వీడుతున్నట్టు గురువారం ఆయన ప్రకటించారు. ఎప్‌స్టీన్‌తో కలిసి మూడు బిజినెస్ డిన్నర్‌లలో బార్జ్ పాల్గొన్నట్టు, మెయిల్‌లు, టెక్స్ట్ మెసేజ్‌ల ద్వారా

మిగతా 2వ పేజీలో...

న్యాయ వ్యవస్థపై

తుపాకీ పేల్చారు!

నెత్తురోడుతోంది.. సీజేఐ సూర్యకాంత్ తీవ్ర ఆవేదన

ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకంపై సంపూర్ణ నిషేధం

భౌతిక, డిజిటల్ ప్రతులన్నీ సీజ్ చేయాలి

దీని వెనుక లోతైన కుట్ర కనిపిస్తోంది

బాధ్యులపై వేటు పడక తప్పదు: సీజేఐ

ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌కు షోకాజ్ నోటీసులు

కేంద్ర పాఠశాల విద్య కార్యదర్శికి కూడా..

తదుపరి విచారణ మార్చి 11కి వాయిదా

ఎన్‌సీఈఆర్‌టీ తీరుపై మోదీ అసంతృప్తి

బాధ్యులను శిక్షించాల్సిందేనని స్పష్టీకరణ!

దీనిపై బాధ పడుతున్నాం.. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం: ధర్మేంద్ర ప్రధాన్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): 'న్యాయవ్యవస్థలో అవినీతి' పాఠ్యాంశాన్ని 8వ తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్య పుస్తకంలో చేర్చిన జాతీయ విద్యాపరిశోధన-శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ)పై సుప్రీంకోర్టు మరోసారి మండిపడింది. న్యాయవ్యవస్థపై తుపాకీ పేల్చారని.. అది రక్తమోడుతోందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్

మిగతా 2వ పేజీలో...



భారతీయ వస్త్రధారణలో ఉన్న నెతన్యాహుతో మోదీ

మానవత్వం బతకాలి 2

ఘర్షణలకు బాధితురాలు కారాదు: మోదీ

నెతన్యాహుతో ద్వైపాక్షిక చర్చలు

త్వరలో భారత్-ఇజ్రాయెల్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని నిర్ణయం

6 ఫైటర్ జెట్ రీఫ్యూయలింగ్ ట్యాంకర్ల కొనుగోలుకు ఇజ్రాయెల్‌తో ఒప్పందం

వ్యూహకర్త అతనే



లిక్కర్ స్కామ్‌లో ముప్పిడి అవినాశ్ రెడ్డి కీలకం

తోడల్లుడు రాజ్‌కసిరెడ్డితో కలిసి దందా

ముడుపులిచ్చిన బ్రాండ్లకే ఆర్డర్లు

ఎక్సైజ్ అధికారులకు ఆదేశాలు

ఒక్కో కేసుపై రూ.150-160 వసూలు

సొమ్ము మళ్లింపునకు నకిలీ ఇన్వాయిస్‌లు

బోగస్ బిల్లులతో 221 కోట్లు మళ్లింపు

సిట్ ఏర్పాటయ్యాక విదేశాలకు పరార్

రిమాండ్ రిపోర్టులో సిట్ వెల్లడి

సుప్రీం ఆదేశాలతో లొంగుబాటు.. అరెస్ట్

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణంలో ముప్పిడి అవినాశ్ రెడ్డి(ఏ-7) పాత్ర కీలకమని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) కోర్టుకు తెలిపింది. సుప్రీం కోర్టు ఆదేశాలతో గురువారం లొంగిపోయిన అవినాశ్ రెడ్డిని సిట్ అధికారులు అరెస్టు చేశారు. ఈ కేసులో ఆయన పాత్రను

మిగతా 14వ పేజీలో...

సునీల్ నాయక్‌పై **వారెంట్**

గుంటూరు మొబైల్ మెజిస్ట్రేట్ కోర్టు జారీ

రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసులో ఏ-7 14

సెన్సార్ బోర్డు బుర్ర పెట్టి సినిమా చూసినట్టు లేదు!

తన నిబంధనలను తానే స్వయంగా ఉల్లంఘించింది 2

కేరళ స్టోరీ-2కి సెన్సార్ సర్టిఫికెట్ జారీపై కేరళ హైకోర్టు ఆగ్రహం

విడుదలపై 2 వారాల స్టే.. కేంద్రం నిర్ణయం తీసుకోవాలని ఆదేశాలు

రాష్ట్రం మత సామరస్యంతో ఉంది.. చిచ్చుపెట్టొద్దని హితవు



'ఆపరేషన్ చిన్నారి తల్లి' 11

లైంగిక నేరగాళ్లకు చెక్ పెట్టడమే లక్ష్యం

బాలికలు, తల్లులకు అవగాహన కార్యక్రమాలు

గంజాయి బ్యాచ్‌పైనా నిఘా.. కౌన్సెలింగ్

సురక్షిత బాల్యంతోనే సుస్థిర అభివృద్ధి: డీజీపీ

డ్రైవింగ్ లైసెన్సుల్లో గ్రేడ్లు!

మంచి డ్రైవింగ్‌కు ప్రోత్సాహం.. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే పాయింట్లలో కోత

పాయింట్లు మొత్తం పోతే లైసెన్స్ రద్దు.. త్వరలోనే కొత్త విధానం: గడ్కరీ 2

48 గంటల్లోపు అదనపు చార్జీలు ఉండవు

విమాన టికెట్ల మార్పు, రద్దుకు అవకాశం

రైల్వే రిజర్వేషన్ టికెట్‌పై

పేరు మార్చుకోవచ్చు!

రైలు బయల్దేరడానికి 24 గంటల ముందు చాన్స్

48 గంటల్లోపు అదనపు చార్జీలు ఉండవు

» విమాన టికెట్ల మార్పు, రద్దుకు అవకాశం

» రిఫండ్ నిబంధనల్లో మార్పులు చేసిన డీజీసీఏ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: టికెట్లు రద్దు, మార్పు విషయంలో విమాన ప్రయాణికులకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) వెసులుబాటు కల్పించింది. టికెట్ బుక్ చేసుకున్న 48 గంటల్లోపు ఆ టికెట్‌లో మార్పులు చేయాలన్నా, రద్దు చేసుకున్నా కూడా అదనపు చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. దీని కోసం టికెట్ రిఫండ్ నిబంధనలను సవరించింది. అయితే టికెట్ బుక్ చేసుకున్న 7 రోజుల లోపు దేశీయ ప్రయాణం, టికెట్ బుక్ చేసుకున్న 15 రోజుల్లోపు అంతర్జాతీయ ప్రయాణం ఉంటే ఈ సదుపాయం వర్తించదని డీజీసీఏ స్పష్టం చేసింది. అలాగే పేరులో తప్పును గుర్తించి 24 గంటల్లోపు ప్రయాణికుడు తెలియజేస్తే, ఆ మార్పునకు ఏవిధమైన చార్జీలు వసూలు చేయకూడదని విమాన సంస్థలకు ఆదేశాలిచ్చింది. ఏజెంట్లు, పోర్టల్ ద్వారా కొన్న టికెట్ డబ్బులను వాపసు చేయాల్సి వస్తే 14 రోజుల్లో ఆ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేసింది. టికెట్ రద్దు, డబ్బు వాపస్ విషయంలో వచ్చిన ఫిర్యాదులతో సివిల్ ఏవియేషన్ రిక్వయిర్‌మెంట్స్ (సీఏఆర్) నిబంధనల్లో మార్పులు చేశారు.

రైల్వేలో రిజర్వేషన్ టికెట్‌ను వేరొకరికి మార్చొచ్చు!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: ఏదైనా పనిమీద ఒకట్రెండు రోజుల్లో ప్రయాణం ఉందనగా.. రైల్వే టికెట్ కన్ఫమ్ అవడం అంటే చాలా కష్టం! రిజర్వేషన్ దొరికితే.. అబ్బా చాలా అదృష్టమని భావిస్తారు!! అయితే ఇదే సమయంలో అతడు/ఆమె ప్రయాణానికి వెళ్లలేని పరిస్థితుల్లో.. ఆ రిజర్వేషన్ టికెట్‌ను వేరొకరిని బదిలీ చేయవచ్చు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో, ప్రత్యేక షరతుల కింద టికెట్‌ను వేరే వారి పేరుపై బదిలీ చేయవచ్చని, ఆ కన్ఫమ్ టికెట్‌పై అదే రైలుకు, అదే సమయానికి వేరొకరు ప్రయాణం చేయవచ్చని రైల్వే అధికారులు చెబుతున్నారు. అయితే దీనికి సంబంధిత అధీకృత రైల్వే అధికారుల ముందస్తు ఆమోదం తప్పనిసరి. ఈ సదుపాయం ఎంపిక చేసిన పరిస్థితుల్లో మాత్రమే.. అది కూడా ఆ వ్యక్తి కుటుంబంలోని వారికి, అర్హులైన గ్రూపు క్యాటగిరీల సభ్యులకు మాత్రమే బదిలీ చేసేందుకు అవకాశం ఉంటుంది. క్యాటగిరీని బట్టి రిజర్వేషన్ టికెట్‌పై పేరు మార్పునకు రైలు బయలుదేరే 24 లేదా 48 గంటల ముందుగా రైల్వే అధికారులకు రాతపూర్వకంగా దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.

ట్రంప్‌కి మరో ఎదురుదెబ్బ

» అక్రమ వలసదారులను అమెరికా నుంచి వారి స్వదేశానికి కాకుండా మరో దేశానికి పంపడం చట్టవిరుద్ధమన్న కోర్టు


న్యూయార్క్, ఫిబ్రవరి 26: సుంకాలపై ఇటీవలే ఎదురుదెబ్బ తిన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు కోర్టులో మరో వ్యతిరేక తీర్పు వచ్చింది. అక్రమ వలసదారులను అమెరికా నుంచి వారి స్వదేశాలకు కాకుండా మూడో దేశానికి డీపోర్ట్ చేయడం (మూడో దేశానికి బహిష్కరణ) చట్టవిరుద్ధమని యూఎస్ ఫెడరల్ జడ్జి బ్రియాన్ మర్ఫీ బుధవారం తీర్పునిచ్చారు. అయితే, దీనిపై ట్రంప్ సర్కారు సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకోవడానికి వీలుగా తన ఆదేశాల అమలును 15 రోజులపాటు నిలిపివేస్తూ ఆయన నిర్ణయం తీసుకున్నారు. వలసదారుల ను మూడో దేశానికి పంపడంపై మానవహక్కుల సంఘాలు కోర్టును ఆశ్రయించాయి. కేసు విచారణలో భాగంగా.. జడ్జి పైవిధంగా తీర్పిచ్చారు.

ప్రియాంక నాపై అలిగింది

» రోజంతా నాతో మాట్లాడలేదు.. విమానంలోనూ అంతే!

» కానీ వయనాడ్‌లో దిగగానే మాట్లాడడం మొదలెట్టింది

» అదే ఈ నేల మహిమ.. రాహుల్ సరదా వ్యాఖ్యలు



వయనాడ్, ఫిబ్రవరి 26: అధికార పక్షంపై ఆరోపణలు, విమర్శలతో విరుచుకుపడే విపక్ష నేత రాహుల్ గాంధీ.. తన చెల్లెలు ప్రియాంక తనపై అలిగిందంటూ గురువారం కాసేపు సరదాగా మాట్లాడారు! ఒక రోజంతా తనతో మాట్లాడని ఆమె.. వయనాడ్‌లో అడుగుపెట్టగానే తనతో మాట్లాడడం మొదలుపెట్టారని.. అదే వయనాడ్ మహిమ అని మెచ్చుకున్నారు!! 2024లో వయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడిన ఘటనలో సర్వస్వం కోల్పోయినవారి కోసం కాంగ్రెస్ చేపట్టిన ఇళ్ల నిర్మాణాలకు గురువారం శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి వచ్చిన రాహుల్.. ఈ సరదా విషయం గురించి చెప్పారు. "సాధారణంగా అన్నాచెల్లెళ్లు చిన్న చిన్న విషయాలకు కూడా ఎలా గొడవ పడుతుంటారో మీకందరికీ తెలుసు. నిన్న నేను అలాగే ఏదో ఒక సిల్లీ విషయం చెప్పడంతో నా చెల్లికి కోపం వచ్చింది. దీంతో ఆమె నిన్నంతా నాతో మాట్లాడలేదు. తర్వాత మా అమ్మను కలిసినప్పుడు, చెల్లెలు ఎలా ఉంది? అని అడిగారు. ఆమె కోపంగా ఉందని, నాతో మాట్లాడటం లేదని.. కానీ, తనను బుట్టలో వేశానని చెప్పాను. తను వయనాడ్ వస్తోందని.. ఇక నాతో ఎంతమాత్రం కోపంగా ఉండలేదని కూడా చెప్పాను. విమానంలో 'హలో' అని పలకరించాను. అప్పుడు కూడా ప్రియాంక కోపంగానే కనిపించింది. కానీ, వయనాడ్‌లో ల్యాండవగానే నాతో నవ్వుతూ మాట్లాడటం ప్రారంభించింది." అని రాహుల్ వివరించారు. "అర్థంచేసుకోండి.. అదే వయనాడ్ మ్యాజిక్" అన్నారు.

ట్రైబ్యునళ్లు భారంగా మారాయ్: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: దేశంలో ట్రైబ్యునళ్ల పనితీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ట్రైబ్యునళ్లు అస్తవ్యస్తంగా, ఎలాంటి జవాబుదారీతనం లేకుండా భారంగా మారాయని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఒక ఆర్థిక ట్రైబ్యునల్‌కు చెందిన సాంకేతిక సభ్యులు తీర్పును కూడా ఔట్‌సోర్సింగ్ ద్వారా రాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ట్రైబ్యునల్ సంస్కరణల చట్టం-2021ని గత ఏడాది కొట్టివేసిన నేపథ్యంలో చైర్‌పర్సన్లతో సహా ట్రైబ్యునల్ సభ్యుల పదవీకాలాన్ని పొడిగించాలంటూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ట్రైబ్యునళ్లు ప్రభుత్వం సృష్టించినవని, ఎవరికీ జవాబుదారీగా లేకుండా, ఎవరి నియంత్రణలోనూ లేనివిగా పని చేస్తున్నాయని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం.పంచోలీల ధర్మాసనం గురువారం వ్యాఖ్యానించింది. ట్రైబ్యునళ్లలో ఖాళీల భర్తీకి అత్యవసరంగా చర్యలు తీసుకోవాలని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణిని ఆదేశించింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. టీడీశాట్ చైర్‌పర్సన్ పదవీ విరమణ చేసిన తర్వాత ట్రైబ్యునల్ సాంకేతిక సభ్యుడు తాత్కాలిక చైర్‌పర్సన్ అవుతారని ధర్మాసనం పేర్కొంది. ఈ నిబంధనను ధర్మాసనం తప్పుపట్టింది. టీడీశాట్ లాంటి ముఖ్యమైన ట్రైబ్యునళ్లలో పాలనాపరమైన సంక్షోభాలు తలెత్తకుండా చూసుకోవాలని ఏజీకి సూచించింది. "మిస్టర్ అటార్నీ జనరల్, ట్రైబ్యునళ్లు మీ (కేంద్రం) సృష్టి. అవి క్రమంగా తలనొప్పిగా మారాయి. మీకు తలనొప్పిగా, మాకు భారంగా మారాయి. ట్రైబ్యునళ్లు జారీ చేసే ఆదేశాల కారణంగా మాకు భారంగా మారుతున్నాయి. అవి పనిచేస్తున్న విధానం మాకు సవాలుగా మారుతోంది" అని సీజేఐ అన్నారు.

డబ్ల్యూఈఎఫ్ అధ్యక్షుడికి ఎప్‌స్టీన్ దెబ్బ!

(మొదటిపేజీ తరువాయి)

అతనితో సంప్రదింపులు నెరపినట్టు ఇటీవల అమెరికా న్యాయశాఖ విడుదల చేసిన పత్రాల్లో వెల్లడైంది. 'బాగా ఆలోచించాకే డబ్ల్యూఈఎఫ్ అధ్యక్ష పదవి నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నాను. ఈ పదవిలో ఎనిమిదిన్నరేళ్లు ఫలవంతంగా పనిచేసినందుకు గర్వంగా ఉంది. ఇంత కాలం నాకు అద్భుతమైన సహకారం అందించిన సహచరులు, భాగస్వాములకు కృతజ్ఞతలు. ఇక ఎటువంటి అడ్డంకులు లేకుండా ఫోరం ముఖ్యమైన కార్యకలాపాలు కొనసాగిస్తుందని భావిస్తున్నాను' అని బార్జ్ పేర్కొన్నారు. ఎప్‌స్టీన్‌తో బార్జ్‌కు ఉన్న సంబంధాలపై ఈనెల మొదట్లోనే డబ్ల్యూఈఎఫ్ స్వతంత్ర దర్యాప్తు ప్రారంభించింది. బార్జ్ రాజీనామా నేపథ్యంలో అలోయిస్ జ్విన్‌గి తాత్కాలిక అధ్యక్షుడు, సీఈవోగా కొనసాగుతారని డబ్ల్యూఈఎఫ్ ఒక ప్రకటనలో వెల్లడించింది. నాయకత్వ మార్పును, అలాగే, శాశ్వత అధ్యక్షుడి నియామక ప్రక్రియను ఫోరం ట్రస్టీల బోర్డు పర్యవేక్షిస్తుందని తెలిపింది. డబ్ల్యూఈఎఫ్ అధ్యక్ష పదవికి ముందు నార్వే ప్రభుత్వంలో సీనియర్ మంత్రిగా బార్జ్ పనిచేశారు.

న్యాయవ్యవస్థపై తుపాకీ పేల్చారు!

(మొదటిపేజీ తరువాయి)



తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. 'ఎక్స్‌ప్లోరింగ్ సొసైటీ: ఇండియా అండ్ బియాండ్ (పార్ట్2)' పేరుతో ఉన్న సదరు పాఠ్యపుస్తకాన్ని సంపూర్ణంగా, సమగ్రంగా నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. దాని భౌతిక, డిజిటల్ ప్రతులను సీజ్ చేయాలని ఆదేశించారు. పుస్తకాన్ని మళ్లీ ప్రచురించడం గానీ, ముద్రించడం గానీ చేయరాదని.. డిజిటల్‌గానూ పంపిణీ చేయరాదని స్పష్టంచేశారు. ఇంత వివాదాస్పద అంశాన్ని పాఠ్యపుస్తకంలో చేర్చిన వారిపై ఎందుకు కోర్టు ధిక్కార చర్యలు తీసుకోకూడదో చెప్పాలంటూ ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌కు, కేంద్ర పాఠశాల విద్య కార్యదర్శికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వీ బుధవారం.. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం.పంచోలితో కూడిన ధర్మాసనం ముందు ఈ అంశాన్ని ప్రస్తావించగా.. దీనిని సుమోటోగా తీసుకుని ఇప్పటికే ఆదేశాలిచ్చానని చీఫ్ జస్టిస్ చెప్పడం తెలిసిందే. గురువారం త్రిసభ్య ధర్మాసనం సుమోటోగా విచారణ చేపట్టింది. ఈ అధ్యాయంలో అవమానకర అంశాలున్నాయని.. దీని వెనుక చాలా లోతైన కుట్ర కనిపిస్తోందని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. వ్యవస్థ గౌరవ ప్రతిష్ఠలను దెబ్బతీసే ఉద్దేశపూర్వక చర్యగా భావిస్తున్నామని చెప్పారు. 'బాధ్యులపై వేటు పడక తప్పదు. లోతైన దర్యాప్తు జరపాలనుకుంటున్నాం' అని తెలిపారు.

> 'న్యాయవ్యవస్థలో అవినీతి' అన్న పాఠం చేర్చడాన్ని.. వ్యవస్థ గౌరవ ప్రతిష్ఠలను దెబ్బతీసే ఉద్దేశపూర్వక చర్యగా భావిస్తున్నాం. న్యాయవ్యవస్థ అధిపతిగా దీని వెనుక ఎవరున్నారో కనుగొనే బాధ్యత నాపై ఉంది. బాధ్యులపై చర్యలు తప్పవు. లోతైన దర్యాప్తు జరపాలనుకుంటున్నాం.
>
> - చీఫ్ జస్టిస్ సూర్యకాంత్

డైరెక్టర్ నిర్లక్ష్య స్పందన..!

'న్యాయవ్యవస్థలో అవినీతి'పై 8వ తరగతి పాఠ్య పుస్తకంలో ఓ అధ్యాయం ఉందని ఓ దినపత్రికలో వచ్చిన వ్యాసం చూసి షాకయ్యామని ధర్మాసనం పేర్కొంది. దీనిని ప్రచురించింది ఎన్‌సీఈఆర్‌టీ యేనా అనేది వాకబు చేయాలని సుప్రీంకోర్టు సెక్రటరీ జనరల్‌ను ఆదేశించామని తెలిపింది. పూర్తి నిర్లక్ష్యంగా, బాధ్యత లేకుండా.. ధిక్కారపూర్వకంగా..దురుద్దేశపూరితంగా పుస్తకంలో రాసి.. ఆత్మపరిశీలన చేసుకోకపోగా.. ఆయా అంశాలను సమర్థిస్తూ ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ నిర్లక్ష్యంగా వివరణ ఇచ్చారని ఆక్షేపించింది. 'పుస్తకంలోని విషయాన్ని ప్రాథమికంగా పరిశీలించాక.. డైరెక్టర్ స్పందన చూశాక.. న్యాయవ్యవస్థ అధికారాన్ని, దాని గౌరవాన్ని దెబ్బతీసే ఉద్దేశపూర్వక చర్యగా పరిగణించాం. దీనిని ఇలాగే వదిలేస్తే న్యాయవ్యవస్థ పవిత్రతను దెబ్బతీస్తుంది. దానిపై ప్రజల్లో ఉన్న భారీ అంచనాలను.. మరీ ప్రధానంగా యువత మనసులపై ప్రభావం చూపుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణకు న్యాయవ్యవస్థ చేసిన కృషి.. సత్వర న్యాయాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి సుప్రీంకోర్టు తీసుకున్న చర్యలు.. చేపట్టిన పరివర్తనా కార్యక్రమాలపై ఆ పుస్తకంలో ప్రస్తావనే లేదు. అవినీతి, మోసపూరిత కార్యకలాపాలు, ప్రజాధనం మళ్లింపు వంటి అంశాల్లో ఎందరో ఉన్నత స్థాయి అధికారులను ఇదే కోర్టు తీవ్రంగా అభిశంసించింది. దీనిపై పుస్తకంలో మౌనం వహించడం చాలా ఘోరం' అని వ్యాఖ్యానించింది. ఆ పుస్తకంలోని అంశాల వల్ల న్యాయవ్యవస్థ స్వయంప్రతిపత్తి, స్వాతంత్ర్యంపై శాశ్వతంగా చూపే తీవ్ర ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించింది. ఈ పుస్తక ప్రచురణ దుష్ప్రవర్తనతో పాటు కోర్టు ధిక్కారాల చట్టం(1971)లోని సెక్షన్ 2సీ కింద క్రిమినల్ ధిక్కారం కిందకు వస్తుందని స్పష్టం చేసింది. పుస్తకాన్ని పునఃప్రచురణ, పునర్ముద్రణ చేయరాదని, డిజిటల్‌గానూ వ్యాప్తిచేయరాదని తేల్చిచెప్పింది. తమ ఉత్తర్వుల అమలుపై రెండు వారాల్లో జవాబివ్వాలని అన్ని రాష్ట్రాల విద్యాశాఖల ముఖ్య కార్యదర్శులను ఆదేశించింది. వారి నివేదికలను, ఇతర వివరాలను పరిశీలించాక.. బాధ్యులను నిర్ధారించడానికి ఓ ప్యానెల్‌ను ఏర్పాటుచేసే అవకాశం ఉందని సీజేఐ తెలిపారు. ఈ వ్యవహారంలో చర్యలు తీసుకోవాలంటూ వందలకొద్దీ ఫోన్‌కాల్స్ తనకు వచ్చాయన్నారు. తదుపరి విచారణను మార్చి 11వ తేదీకి వాయిదావేశారు.

మీడియాకు సీజేఐ ధన్యవాదాలు

ఈ అంశాన్ని హైలైట్ చేసినందుకు చీఫ్ జస్టిస్ మీడియాకు ధన్యవాదాలు తెలియజేశారు. ప్రధాన స్రవంతి మీడియా ఎప్పుడూ బాధ్యతగానే ఉంటుందని సొలిసిటర్ జనరల్ అన్నారు. టాబ్లాయిడ్లు, డిజిటల్ ప్లాట్‌ఫాంలు బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతుంటాయని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు జోక్యాన్ని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వికాస్‌సింగ్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్‌పర్సన్, సీనియర్ న్యాయవాది మనన్‌కుమార్ మిశ్రా స్వాగతించారు.

ప్రధాని అసంతృప్తి..

న్యాయవ్యవస్థలో అవినీతి అంశాన్ని ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకంలో అధ్యాయంగా చేర్చడంపై ప్రధాని మోదీ అసంతృప్తి వ్యక్తంచేసినట్లు తెలిసింది. బాధ్యులపై తప్పనిసరిగా చర్యలు తీసుకోవలసిందేనని తేల్చిచెప్పినట్లు సమాచారం. ప్రస్తుతం ఇజ్రాయెల్‌లో ఉన్న ఆయన.. 'ఈ వ్యవహారం ఎవరు చూస్తున్నారు' అని ప్రశ్నించినట్లు పీఎంవో వర్గాలు తెలిపాయి. మరోవైపు.. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా దీనిపై స్పందించారు. బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. 'జరిగినదానికి బాధపడుతున్నాను. విచారణ జరిపి.. ఆ చాప్టర్ రాసినవారిపై చర్యలు తీసుకుంటాం. ఆ పాఠ్యపుస్తకాల పంపిణీ ఆపేశాం. ప్రజాస్వామ్య భారతంలో న్యాయవ్యవస్థ సర్వోన్నతమైనది. కోర్టు ఆదేశాలను అమలుచేస్తాం' అని జంషెడ్‌పూర్‌లో వెల్లడించారు.

ఆ ప్రకటనలో క్షమాపణ ఊసేదీ?

తొలుత ఈ వ్యవహారంపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సర్వోన్నత న్యాయస్థానానికి కేంద్ర పాఠశాల విద్యాశాఖ తరఫున బేషరతుగా క్షమాపణలు చెప్పారు. విచారణ ప్రారంభం కాగానే.. ఆ పాఠ్యపుస్తకంలోని అధ్యాయాన్ని ఎన్‌సీఈఆర్‌టీ ఉపసంహరించుకుందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. చేసిన తప్పునకు క్షమాపణ చెప్పిందన్నారు. అయితే ఎన్‌సీఈఆర్‌టీ విడుదల చేసిన ప్రకటనలో క్షమాపణకు సంబంధించి ఒక్క మాట కూడా లేదని చీఫ్ జస్టిస్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై ఆరా తీయాలని సుప్రీం కోర్టు సెక్రటరీ జనరల్‌ను తాను కోరితే.. ఎన్‌సీఈఆర్‌టీ ఆ అధ్యాయాన్ని సమర్థించుకుందని చెప్పారు. ఈ అధ్యాయాన్ని సమర్థించినవారు భవిష్యత్‌లో ఎన్‌సీఈఆర్‌టీలో గానీ, ఏ ప్రభుత్వ శాఖలో గానీ ఉండరని మెహతా హామీ ఇచ్చారు. సీజేఐ స్పందిస్తూ.. 'అప్పుడు వారికి మరింత తేలికవుతుంది. బాధ్యత నుంచి తప్పించుకుంటారు. వారు తుపాకీ పేల్చారు.. ఇవాళ న్యాయవ్యవస్థ నెత్తురోడుతోంది. మాపై దండయాత్ర చేస్తే.. సమతుల్యత ఎలా పాటించాలో మాకు తెలుసు. ఆ పుస్తకం ప్రతులు ఇప్పటికే మార్కెట్లో ఉన్నాయి' అని అని అన్నారు. మార్కెట్లోకి 32 కాపీలు మాత్రమే వెళ్లాయని.. వాటిని వెనక్కి తెప్పిస్తామని మెహతా తెలిపారు. సదరు అధ్యాయం మొత్తాన్నీ కొత్త బృందం పునఃసమీక్షిస్తుందని.. దానిని తిరిగి ప్రచురిస్తారని చెప్పారు. ఈ ఒక్క అధ్యాయమే కాదని.. అందులో 'న్యాయం ఆలస్యమైతే.. న్యాయాన్ని నిరాకరించడమే' అన్న శీర్షికతో మరో సమస్యాత్మక చాప్టర్ ఉందని.. అందులో అన్నీ తప్పులతడక గణాంకాలు ఉన్నాయని ఆయన తెలిపారు. అయితే దీని ప్రచురణకు బాధ్యులెవరో తేల్చాల్సిన అవసరం ఉందని సీజేఐ పునరుద్ఘాటించారు. వారెవరో తెలియాలని.. వారిపై వేటు పడక తప్పదని.. విచారణను తాను మూసివేసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

లోకం తీరు



30 రోజులు జైల్లో ఉంటే అంతే..!

» ప్రధాని, సీఎం, కేంద్ర, రాష్ట్ర మంత్రులు పదవిని కోల్పోయినట్లే

» జేపీసీ పరిశీలనలో బిల్లు

» త్వరలో తెలంగాణ, కర్ణాటకలో జేపీసీ పర్యటన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఎవరైనా 30 రోజుల పాటు జైల్లో ఉంటే పదవిని కోల్పోవడం తప్పనిసరి చేస్తూ రూపొందించిన రాజ్యాంగ సవరణ బిల్లును పరిశీలిస్తున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) త్వరలో తెలంగాణ, కర్ణాటకల్లో పర్యటించనుంది. ఐదేళ్ల కంటే ఎక్కువ కాలం జైలు శిక్ష పడే నేరాల్లో నిందితులైన, వరుసగా 30 రోజుల పాటు జైల్లో ఉన్న ప్రధాని, సీఎం, కేంద్ర, రాష్ట్ర మంత్రులను తొలగించేందుకు ఈ బిల్లును ఉద్దేశించారు. మంత్రులను తొలగించే విషయంలో ప్రధాని సలహాపై రాష్ట్రపతి; ముఖ్యమంత్రి సలహాపై గవర్నర్ నిర్ణయం తీసుకుంటారు. ప్రధాని, సీఎం జైలుపాలైన తర్వాత 30 రోజుల్లోపు రాజీనామా చేయకపోతే 31వ రోజు పదవిని కోల్పోతారు. సాధ్యమైనంత త్వరలోనే ఎన్డీయేకు చెందిన పార్టీల ప్రభుత్వాలను సంప్రదించాలనుకుంటున్నట్లు జేపీసీ చైర్మన్, బీజేపీ ఎంపీ అపరాజితా సారంగి తెలిపారు. గత ఏడాది ఆగస్టులో ఈ బిల్లును హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రవేశపెట్టిన తర్వాత జేపీసీకి నివేదించారు. జేపీసీలో బీజేపీ ఎంపీలు లక్ష్మణ్, డీకే అరుణ, జనసేన ఎంపీ బాలశౌరి, వైసీపీ ఎంపీ నిరంజన్‌రెడ్డి సభ్యులుగా ఉన్నారు. ఎన్డీయే ఎంపీలు, బీజేపీ పాలిత రాష్ట్రాలు ఈ బిల్లుకు అంగీకారం తెలపగా, ప్రతిపక్షాలు జేపీసీ సమావేశాన్ని బహిష్కరించాయి. ఈ బిల్లులో మౌలిక లోపాలున్నాయని ఎన్‌సీపీ నేత సుప్రియా సూలే, మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వాదించారు.

డ్రైవింగ్ లైసెన్సులో గ్రేడ్లు..!

» త్వరలోనే కొత్త విధానం: గడ్కరీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: బాధ్యతాయుత డ్రైవింగ్‌ను ప్రోత్సహించడానికి, రోడ్డు ప్రమాదాల నివారణకు కేంద్రం కొత్త ఆలోచన చేసింది. గ్రేడ్ ఆధారిత డ్రైవింగ్ లైసెన్సులు ఇవ్వడానికి సిద్ధమవుతోంది. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారి లైసెన్సు రద్దుతో పాటు ఇతర కఠిన నిబంధనలు ప్రవేశపెట్టనుంది. ఢిల్లీలో సీఐఐ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో పాల్గొన్న సందర్భంగా కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ.. డ్రైవింగ్ లైసెన్సుల్లో గ్రేడింగ్ పాయింట్ల వ్యవస్థను తీసుకొస్తున్నామన్నారు. ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడితే కొన్ని పాయింట్లు కోల్పోతారని, అన్ని పాయింట్లు కోల్పోతే డ్రైవింగ్ లైసెన్సు 6 నెలలు సస్పెండ్ అవుతుందని తెలిపారు. తప్పులు పునరావృతమైతే లైసెన్సు పూర్తిగా రద్దు చేస్తామని, త్వరలోనే ఈ వ్యవస్థను ప్రవేశపెడతామన్నారు.

లొంగిపోతానన్నాడని కొట్టిచంపిన మావోయిస్టులు!

» తోటి మావోయిస్టును హత్య చేసి.. పూడ్చివేత

చర్ల, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పోలీసులకు లొంగిపోతానన్న సహచరుడిని తోటి మావోయిస్టులు ఆగ్రహంతో కొట్టిచంపారు. తర్వాత అడవిలోనే పూడ్చిపెట్టారు. ఒడిశాలోని కంధమాల్ జిల్లా అడవుల్లో జనవరి 29న ఈ ఘటన జరిగింది. లొంగిపోయిన ఇతర మావోయిస్టుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు.. మృతదేహాన్ని వెలికితీశారు. కంధమాల్ ఎస్పీ బీసీ హరీష ఈ వివరాలు వెల్లడించారు. సుకుమా జిల్లా చెందిన అన్వేష్ మావోయిస్టు పార్టీ ఒడిశా రాష్ట్ర కమిటీలో కమాండర్‌గా ఉన్నారు. ఆపరేషన్ కగార్ ఉధృతమైన నేపథ్యంలో పలువురు తోటి మావోయిస్టులతో కలిసి దరింగిబాడి పోలీస్ స్టేషన్ పరిధిలో లొంగిపోయేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలిసిన మావోయిస్టు పార్టీ ఒడిశా రాష్ట్ర జోనల్ కమిటీ సభ్యుడు శుక్రు, ఇతర మావోయిస్టులు అన్వేష్‌ను అడ్డుకుని, కొట్టిచంపారు. అనంతరం అడవిలో పూడ్చిపెట్టారు. లొంగిపోయిన మావోయిస్టుల ద్వారా ఈ విషయం తెలుసుకుని, అన్వేష్ మృతదేహాన్ని వెలికితీసి పంచనామా కోసం తరలించామని ఎస్పీ హరీష చెప్పారు. మావోయిస్టు అన్వేష్‌ను హత్యచేసిన వారిలో శుక్రు ప్రధాన నిందితుడు కాగా, శీల, జగేష్ సహకరించారని పేర్కొన్నారు. ఈ నెల 22న జరిగిన ఎన్‌కౌంటర్‌లో జగేష్ మృతి చెందాడని తెలిపారు.

ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఇంద్రావతి జాతీయ పార్క్ పరిధిలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. వారిని భైరంగఢ్ ఏరియా కమిటీ సభ్యులు ముద్దా హిమాచి, పొడియం మనికి (మహిళ)గా నిర్ధారించామని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలంలో మూడు తుపాకులు, మావోయిస్టుల వస్తువులు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. కాగా, నారాయణపూర్ జిల్లా కుమురాడి అడవుల్లో కూంబింగ్ చేపట్టిన ఐటీబీపీ బలగాలు.. మావోయిస్టుల డంప్‌ను గుర్తించాయి. అందులోని పేలుడు పదార్థాలు, బీజీఎల్ లాంచర్లు, టాబ్లెట్లు, తుపాకులు, కత్తులు, గొడ్డళ్ల, రోజువారీ వినియోగించే వస్తువులను స్వాధీనం చేసుకున్నాయి.

మానవత్వం బతకాలి

ఘర్షణలకు మానవత్వం బాధితురాలు కారాదు: మోదీ

» ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో ద్వైపాక్షిక చర్చలు

జెరూసలేం, ఫిబ్రవరి 26: ఘర్షణలకు మానవత్వం బాధితురాలు కారాదని భారత ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. యుద్ధం కారణంగా పూర్తిగా ధ్వంసమైన గాజాలో శాంతి ప్రణాళికకు భారత్ సంపూర్ణ మద్దతిస్తుందని ప్రకటించారు. ఇజ్రాయెల్ పర్యటనలో భాగంగా రెండోరోజు గురువారం ఆయన ఆ దేశ ప్రధాని నెతన్యాహుతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం ఇద్దరు నేతలు సంయుక్త మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... ఉగ్రవాదాన్ని, దానికి మద్దతిచ్చేవారిని కట్టడి చేసేందుకు తాము ఇజ్రాయెల్‌తో కలిసి పనిచేస్తామని ప్రకటించారు.

త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం


భారత్, ఇజ్రాయెల్ మధ్య త్వరలోనే పరస్పరం ప్రయోజనం కలిగించే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని (ఎఫ్‌టీఏ) కుదుర్చుకోవాలని నిర్ణయించినట్లు మోదీ తెలిపారు. 'రక్షణ రంగంలో కీలక హార్డ్‌వేర్‌ను సంయుక్తంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. రక్షణ రంగంలో ఇప్పటికే ఉన్న సహకారాన్ని మరింత బలోపేతం చేసుకుంటాం. ఏఐ, వ్యవసాయం, సైబర్ స్పేస్, టెక్నాలజీ, వాణిజ్యం, డిజిటల్ పేమెంట్స్, నీటి నిర్వహణ తదితర రంగాల్లో కలిసి పని చేస్తాం. ఇజ్రాయెల్‌తో ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకుంటాం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్, క్రిటికల్ మినరల్స్ విభాగాల్లో సహకారానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఇజ్రాయెల్‌లో యూపీఐని వినియోగించేందుకు ఒప్పందం చేసుకున్నాం. ఇండియా-ఇజ్రాయెల్-యూఏఈ-యూఎస్ఏ (ఐ2యూ2) ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా ఇండియా మిడిల్ ఈస్ట్ యూరప్ ఎకనమిక్ కారిడార్ (ఐఎంఈసీ) ఏర్పాటుపైనా చర్చలు జరిపాం' అని మోదీ వెల్లడించారు.

ఆరు విమాన ట్యాంకర్ల కొనుగోలు!

భారత వాయుసేన యుద్ధ విమానాలు గాల్లోనే ఇంధనం నింపుకొనేందు కోసం ఇజ్రాయెల్ నుంచి ఆరు విమాన ట్యాంకర్లను కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. బోయింగ్ 767 ప్యాసింజర్ జెట్ సెకండ్ హ్యాండ్ విమానాలను ఆయిల్ ట్యాంకర్లుగా మార్చి అందజేసే ఈ డీల్ విలువ రూ.8 వేల కోట్లు అని వెల్లడించాయి.

మోదీ ప్రసంగంపై నెతన్యాహు ప్రశంసలు

మోదీపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రశంసలు కురిపించారు. నెస్సెట్‌లో మోదీ ప్రసంగం విని కళ్లు చెమర్చని వాళ్లు తమ దేశంలో లేరని తెలిపారు. 'మీ పర్యటన అద్భుతం.. పర్యటన ముగింపు కూడా అద్భుతం' అని కొనియాడారు. కాగా, 'నేను సారాతో తొలిసారి డేట్‌కు వెళ్లింది టెల్ అవీవ్‌లోని భారతీయ రెస్టారెంట్‌కే. అక్కడ నేను రుచి చూసిన భారతీయ వంటకం అద్భుతంగా ఉంది' అని నెతన్యాహు గుర్తు చేసుకున్నారు.



ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు దంపతులతో మోదీ

భారతీయంలో నెతన్యాహు

మోదీ పర్యటన సందర్భంగా ఇజ్రాయెల్ ప్రధాని భారతీయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. బుధవారం మోదీకి విందు ఇచ్చిన సమయంలో భారతీయ సంప్రదాయ వస్త్రాలు ధరించిన విషయాన్ని నెతన్యాహు గురువారం ఎక్స్‌లో వెల్లడించారు. 'విందుకు ముందు నేను భారతీయ సంప్రదాయ వస్త్రాలు ధరించి నా మిత్రుడికి ఆశ్చర్యం కలిగించాను' అని తెలిపారు. అందుకు మోదీ స్పందిస్తూ.. 'అద్భుతం. మీరు భారతీయ వస్త్రధారణలో కనిపించటం.. మా సంస్కృతి, సంప్రదాయాలపై మీకున్న గౌరవానికి నిదర్శనం' అని కొనియాడారు. కాగా, రెండు రోజుల పర్యటన ముగించుకొని ప్రధాని మోదీ గురువారం రాత్రి తిరిగి భారత్‌కు చేరుకున్నారు.

ఇన్‌స్టాలో మోదీ రికార్డు

» 10 కోట్లకు చేరిన ప్రధాని ఫాలోవర్లు

» ప్రపంచ రాజకీయ నేతల్లో అగ్రస్థానం


న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: సోషల్ మీడియాలో ప్రధాని మోదీ దూసుకుపోతున్నారు. గురువారం నాటికి ఇన్‌స్టాగ్రామ్‌లో మోదీ ఫాలోవర్ల సంఖ్య 10 కోట్లకు చేరింది. ప్రపంచ దేశాల్లోని రాజకీయ నేతల్లో 100 మిలియన్ల ఫాలోవర్లు సాధించిన తొలి నేతగా ఆయన రికార్డు సృష్టించారు. మోదీ తర్వాత రెండో స్థానంలో ఉన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ఇన్‌స్టాలో 4.35 కోట్ల ఫాలోవర్లు ఉన్నారు. మిగతా ప్రపంచ నేతలంతా కూడా మోదీ కన్నా చాలా వెనకబడి ఉన్నారు. ఇక స్వదేశీ ప్రజల మద్దతు విషయంలోనూ ప్రపంచవ్యాప్తంగా మోదీ ప్రథమ స్థానంలో ఉన్నారు. స్టాటిస్టా అనే సంస్థ నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది.

సెన్సార్‌బోర్డు బుర్ర పెట్టి సినిమా చూసినట్టు లేదు!

» కేరళ స్టోరీ-2కు సెన్సార్ సర్టిఫికెట్ జారీపై కేరళ హైకోర్టు ఆగ్రహం



కొచి, ఫిబ్రవరి 26: 'ది కేరళ స్టోరీ 2-గోస్ బియాండ్' సినిమా విడుదలపై కేరళ హైకోర్టు రెండు వారాలపాటు తాత్కాలిక స్టే విధించింది. దీంతో శుక్రవారం విడుదల కావాల్సి ఉన్న ఆ సినిమా నిలిచిపోయింది. ఈ సినిమాకు సర్టిఫికెట్ జారీ చేసిన సెన్సార్ బోర్డు.. సినిమాను బుర్ర పెట్టి చూసినట్టు లేదని హైకోర్టు వ్యాఖ్యానించింది. కేరళ స్టోరీ-2కి సెన్సార్ సర్టిఫికెట్ జారీ చేయటాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల మీద జస్టిస్ బెచు కురియన్ థామస్ గురువారం విచారణ జరిపారు. సెన్సార్ బోర్డు మీద ఘాటైన వ్యాఖ్యలు చేశారు. దేశంలో విడుదలయ్యే సినిమాలు సామాజిక సామరస్యాన్ని దెబ్బతీయకూడదన్న సెన్సార్ మార్గదర్శకాలను స్వయంగా సెన్సార్‌బోర్డే (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేట్- సీబీఎఫ్‌సీ) పక్కనపెట్టిందని పేర్కొన్నారు. సమాజంలో అశాంతిని రేకెత్తించి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(ఎ) పేర్కొనే భావవ్యక్తీకరణ స్వేచ్ఛ పరిధిలోకి రావని స్పష్టం చేశారు. వేర్వేరు మతాలకు చెందిన ప్రజలతో కేరళలో పూర్తి సామరస్య వాతావరణం నెలకొని ఉందని, అటువంటి కేరళను నెగెటివ్‌గా చూపించి భావోద్రేకాలు రెచ్చగొట్టవద్దని హితవు పలికారు. సాధారణంగా.. సినిమాల విడుదలపై తాము జోక్యం చేసుకోమని, కానీ, కేరళ స్టోరీ-2 వల్ల సమాజంలో మతకల్లోలాలు చెలరేగే ప్రమాదం ఉందన్న పిటిషనర్ల ఆందోళన నేపథ్యంలోనే తాము ముందుకు వచ్చామని న్యాయమూర్తి పేర్కొన్నారు. కేరళ స్టోరీ-2 సినిమాకు సెన్సార్ సర్టిఫికెట్ జారీ చేయటాన్ని సవాల్ చేస్తూ శ్రీదేవ్ నంబూద్రి దాఖలు చేసిన రివిజన్ పిటిషన్ మీద రెండు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని కేంద్రప్రభుత్వాన్ని జస్టిస్ కురియన్ థామస్ ఆదేశించారు. శ్రీదేవ్ నంబూద్రి, సెన్సార్‌బోర్డు, సినిమా నిర్మాత విపుల్ అమృత్‌లాల్ షా ల వాదనలు విని సదరు నిర్ణయం తీసుకోవాలని కేంద్రానికి సూచించారు. అప్పటి వరకూ సినిమా విడుదల చేయటానికి వీల్లేదని, ఈ మేరకు స్టే విధిస్తున్నామంటూ ఆదేశాలు జారీ చేశారు. శ్రీదేవ్ నంబూద్రి, ఫ్రెడ్డీ ఫ్రాన్సిస్, అతుల్ రాయ్ పిటిషన్లు దాఖలు చేయగా.. రాయ్ పిటిషన్‌ను కొట్టివేసిన న్యాయమూర్తి మిగిలిన ఇద్దరి పిటిషన్ల మీద విచారణ జరిపారు. కాగా, సింగిల్ జడ్జి ఇచ్చిన స్టేను సవాల్ చేస్తూ.. కేరళ స్టోరీ-2 నిర్మాతలు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ పరిగణనలోకి తీసుకుంది.



శ్రీవారి పుష్కరిణిలో తెప్పపై విహరిస్తున్న సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత శ్రీరామచంద్రమూర్తి

వైభవంగా శ్రీవారి తెప్పోత్సవాలు ప్రారంభం

తిరుమల, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు గురువారం సాయంత్రం వైభవంగా ప్రారంభమయ్యాయి. విద్యుద్దీపాలు, పుష్పాలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన తెప్పపై తొలిరోజు సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేతంగా శ్రీరామచంద్రమూర్తి దర్శనమిచ్చారు. ముందుగా సాయంత్రం 6 గంటలకు ఊరేగింపుగా బయలుదేరిన ఉత్సమూర్తులు మాడవీధుల గుండా పుష్కరిణి వద్దకు చేరుకుని, అప్పటికే సిద్ధం చేసిన తెప్పపైకి వేంచేశారు. అనంతరం మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలు, గోవింద నామస్మరణ నడుమ తెప్పపై శ్రీరామచంద్రమూర్తి పుష్కరిణిలో మూడుసార్లు తిరిగి భక్తులకు దర్శనమిచ్చారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో నేవీ వైస్ అడ్మిరల్



తిరుమల శ్రీవారిని నేవీ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా గురువారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

\- ఆంధ్రజ్యోతి, తిరుమల





బాపట్ల జిల్లా కొల్లూరు మండలం క్రాప గ్రామంలో నిర్మించిన ఆలయంలో శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' డైరెక్టర్లు కోగంటి భానుప్రకాశ్, అనూష దంపతులు, వ్యాపారవేత్త కోగంటి ఈశ్వర్‌చంద్, కృష్ణకుమారి దంపతులు

క్రాపలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

శ్రీరామభట్టాచార్యులు ఆధ్వర్యంలో క్రతువు

- పాల్గొన్న 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' డైరెక్టర్లు కోగంటి భానుప్రకాశ్, అనూష దంపతులు

బాపట్ల, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా కొల్లూరు మండలం క్రాప గ్రామంలో నూతనంగా నిర్మితమైన ఆలయంలో శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం కనులపండువగా జరిగింది. రొంపిచర్ల శ్రీరామభట్టాచార్యులు ఆధ్వర్యంలో ఈ క్రతువు నిర్వహించారు. సీతారామ, లక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 10.08 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఈ మహోత్సవంలో వ్యాపారవేత్త కోగంటి ఈశ్వర్‌చంద్, కృష్ణకుమారి దంపతులు, 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' డైరెక్టర్లు కోగంటి భానుప్రకాశ్, అనూష దంపతులు, తోటకూర శ్రీనివాస్, సంధ్య, జొన్నలగడ్డ మోహన బసవపున్నయ్య, నిర్మల దంపతులు పాల్గొన్నారు. అనంతరం సుబ్రహ్మణ్యస్వామి, కనకదుర్గ ఆలయాల్లో యంత్రస్థాపన, రామాలయం, కనకదుర్గ ఆలయాలపైన కలశ స్థాపన చేశారు.

రేపు రాష్ట్రానికి సీజేఐ

- రెండు రోజులు పర్యటించనున్న జస్టిస్ సూర్యకాంత్
- తిరుపతి, అమరావతిలో పలు కార్యక్రమాలకు హాజరు
- జ్యుడీషియల్ అకాడమీ, హైకోర్టు గెస్ట్‌హౌస్‌కు శంకుస్థాపన
- న్యాయమూర్తుల నివాస సముదాయానికి ప్రారంభోత్సవం
- బెజవాడలో మధ్యవర్తిత్వంపై సింపోజియం



అమరావతి/విజయవాడ/గుంటూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ రెండు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రానికి రానున్నారు. శనివారం సాయంత్రం ఆయన నేరుగా తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకుంటారు. తిరుపతిలో నిర్మించనున్న 16 కోర్టుల భవన నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేస్తారు. అక్కడి నుంచి విజయవాడకు వస్తారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు రాజధాని అమరావతికి చేరుకొని ఏపీ జ్యుడీషియల్ అకాడమీ, హైకోర్టు గెస్ట్‌హౌస్‌లకు శంకుస్థాపన చేస్తారు. హైకోర్టు వద్ద నూతనంగా నిర్మించిన న్యాయమూర్తుల నివాస సముదాయాన్ని ప్రారంభిస్తారు. ఆ తర్వాత అక్కడ నిర్వహించే సభలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబుతో కలిసి పాల్గొంటారు. ఆదివారం సాయంత్రం విజయవాడ పటమటలోని అంత్ర లగ్జె కన్వెన్షన్ సెంటర్‌లో మధ్యవర్తిత్వంపై నిర్వహించే సదస్సులో సీజేఐ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తారు. రాత్రికి ఢిల్లీకి తిరుగుప్రయాణమవుతారు. సీజేఐ పర్యటన ఏర్పాట్లపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ గురువారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ దక్షిణ భారతంలోనే తొలిసారిగా అత్యంత ప్రతిష్టాత్మకంగా మధ్యవర్తిత్వంపై జరగనున్న సింపోజియంకు సీజేఐతోపాటు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, హైకోర్టు న్యాయమూర్తులు, అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని వివరించారు. అతిథులకు అవసరమైన వసతితోపాటు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, పటిష్ఠ భద్రతపైనా దృష్టిసారించామని తెలిపారు. కార్యక్రమంలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయడంలో సమన్వయ శాఖల అధికారులు భాగస్వాములు కావాలని కోరారు.

మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌గా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకారం



కాకుమాను శ్రీనివాసరావు

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌గా కాకుమాను శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. గురువారం మధ్యాహ్నం గుంటూరు నగరం చుట్టుగుంటలోని మార్కెటింగ్ కమిషనరేట్‌లో ఆయన విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రథమ డైరెక్టర్‌గా ఛార్జ్ తీసుకొన్నారు. ఇప్పటివరకు ఈ పోస్టును కమిషనర్ నిర్వర్తిస్తున్నారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ చట్టంలో సవరణలు చేసి డైరెక్టర్ పోస్టు మంజూరు చేసింది. రీజనల్ జాయింట్ డైరెక్టర్లలో సీనియర్ అయిన శ్రీనివాసరావును ఆ పోస్టులోకి నియమించింది. ఈ ఏడాది డిసెంబరు వరకు ఆయన డైరెక్టర్ హోదాలో కొనసాగుతారు.

ఎస్సీ వర్గీకరణ వల్లే పదోన్నతులు: మంద కృష్ణ మాదిగ



శ్రీనివాసరావును అభినందిస్తున్న మంద కృష్ణ మాదిగ

ముఖ్యమంత్రి చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ చేయడం వల్లే ప్రభుత్వ ఉద్యోగాల్లో మాదిగ సామాజికవర్గానికి చెందిన ఉద్యోగులు ఉన్నత స్థానాలకు చేరుకొంటున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. గురువారం ఆయన మార్కెటింగ్ కమిషనరేట్‌లో డైరెక్టర్ శ్రీనివాసరావును కలిసి అభినందించారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ చేయడం వలన అప్పట్లో చాలామందికి ప్రమోషన్లు లభించాయని చెప్పారు. ఆ తర్వాత ఆ ప్రక్రియ నిలిచిపోగా చాలా మందికి అన్యాయం జరిగిందన్నారు. ఈ విషయంలో అనేకసార్లు మాజీ సీఎం జగన్‌ని కలిసినప్పటికీ ఉపయోగం లేకుండా పోయిందని తెలిపారు. 20 ఏళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ ఎస్సీ వర్గీకరణ అమలు చేయడం వలన శ్రీనివాసరావుకు మార్కెటింగ్ శాఖలో ఉన్నతమైన డైరెక్టర్ పోస్టు చేపట్టే అవకాశం లభించిందన్నారు. సీఎం చంద్రబాబు చేసిన సాయాన్ని మాదిగలు ఎల్లప్పుడూ గుర్తుంచుకొంటారని మంద కృష్ణ చెప్పారు.

కాలేజీకి వెళ్లి శవంగా మారాడు!

- గడేకల్లు వద్ద కర్ణాటక యువకుడి దారుణ హత్య



కిరణ్ కుమార్

విడపనకల్లు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం డొనేకల్లు సమీపంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. కర్ణాటకలోని రాయచూరు జిల్లా సింధనూరుకు చెందిన పంపన గౌడ్, శైలజ కుమారుడు కిరణ్ కుమార్(23) బళ్లారి టీపీఎం కాలేజీలో బి-ఫార్మసీ చదువుతున్నాడు. మొదటి సంవత్సరంలో కొన్ని సబ్జెక్టులు మిగిలి ఉండటంతో పరీక్ష ఫీజు చెల్లించేందుకు బుధవారం బళ్లారికి వచ్చాడు. మేనమామ మంజు వద్ద బైక్ తీసుకుని కాలేజీకి వెళ్లాడు. సాయంత్రం వరకూ ఇంటికి రాకపోవడంతో మేనమామ ఫోన్ చేయగా గంటలో వస్తానని తెలిపాడు. తిరిగి రాత్రి 8.30 సమయంలో ఫోన్ చేయగా, మరో గంట పడుతుందని చెప్పాడు. రాత్రి 10.30 సమయంలో ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. గురువారం ఏపీ-కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టుకు కిలోమీటర్ దూరంలో రోడ్డు పక్కన ద్విచక్ర వాహనం, కిరణ్‌కుమార్ మృతదేహం పడి ఉన్నాయి. దుండగులు అతని ముఖాన్ని బండరాళ్లతో మోది, ఛిద్రం చేశారు. గురువారం ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు మృతదేహాన్ని గమనించి విడపనకల్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసులు, ఉరవకొండ సీఐ మహానంది, విడపనకల్లు ఎస్ఐ హుస్సేన్, కర్ణాటక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. యువకుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కుంభమేళా తరహాలో గోదారి పుష్కరాలు

10 కోట్లకుపైగా భక్తులు వస్తారని అంచనా.. ఆరు జిల్లాల్లో మొత్తం 369 స్నానఘాట్ల ఏర్పాటు

- ముందస్తు ఏర్పాట్లకు బడ్జెట్‌లో రూ.60 కోట్లు కేటాయింపు
- భక్తుల వసతికి టెంట్ సిటీలు, హోమ్ స్టేలు
- మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం



గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి. చిత్రంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవి, బీసీ జనార్దన్‌రెడ్డి, కందుల దుర్గేశ్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, పి.నారాయణ

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాకుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు నిర్వహించాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకుంది. గురువారం సచివాలయంలో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన గోదావరి పుష్కరాలపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ అయ్యి, ప్రధానంగా ఐదు అంశాలపై సుదీర్ఘ చర్చ జరిపింది. పుష్కరాల ఏర్పాట్లపై ఆయా జిల్లాల కలెక్టర్లు, శాఖలు రూపొందించిన పీపీటీలు, మంత్రుల సలహాలు, సూచనలు తదితరాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పుష్కరాలకు ఈసారి 10 కోట్లకుపైగా భక్తులు వస్తారని అంచనా వేశారు. 2027 జూన్ 26వ తేదీ నుంచి జూలై 7వ తేదీ వరకూ గోదావరి పుష్కరాలను ఆరు జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. తూర్పుగోదావరిలో 102, పశ్చిమగోదావరిలో 40, కోనసీమలో 175, ఏలూరులో 36, కాకినాడలో 5, పోలవరం జిల్లాలో 11 స్నానాల ఘాట్లను నిర్వహించాలని, మొత్తంగా 369 ఘాట్లను భక్తులకు అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. పుష్కరాలకు వచ్చే భక్తులు రెండు, మూడు రోజులు అక్కడే ఉండేలా టెంట్ సిటీలు, హోమ్ స్టేలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. రాజమండ్రి, కొవ్వూరు ఘాట్లకు ఎక్కువ మంది వస్తారని మంత్రి రాంనారాయణ రెడ్డి అభిప్రాయపడ్డారు. పుష్కరాలకు వచ్చే భక్తులు దైవదర్శనాలు చేసుకుంటారని, 391 ఆలయాల్లో మైనర్ రిపేర్లతో పాటు 43 ఆలయాల్లో నవీకరణ పనులు చేస్తున్నామని వివరించారు. పుష్కరాలకు తగినంత సమయం ఉన్నందున ముందుగానే ఘాట్ల మరమ్మతులు, నిర్మాణాలు పూర్తి చేయాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. మహిళా భక్తులకు కల్పించే సౌకర్యాలు, వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పుష్కరాల ముందస్తు ఏర్పాట్లకు బడ్జెట్‌లో రూ.60 కోట్లు కేటాయించామని మంత్రి దుర్గేశ్ తెలిపారు. పుష్కరాలు జరిగే ప్రాంతాల్లో 4800 రూమ్ లు అందుబాటులో ఉన్నాయని, పర్యాటక సర్క్యూట్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ఏ ఘాట్‌లో స్నానం చేసినా ఒకటే పుణ్యఫలం వస్తుందని ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావుతో ప్రజలకు అవగాహన కల్పిస్తే బాగుంటుందని మంత్రులు అభిప్రాయం వ్యక్తం చేశారు. సమావేశంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, సత్యకుమార్ యాదవ్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా ఎస్పీ కుటుంబ సభ్యులపై భూ కబ్జా ఆరోపణలు

- భాకరాపేట మాజీ సర్పంచ్ కుటుంబ ఆధీనంలో 11.71 ఎకరాల భూములు
- విచారణకు ఆదేశించిన ప్రభుత్వం.. ఆక్రమణదారులకు నోటీసులు
- 2న సంబంధిత డాక్యుమెంట్లతో హాజరు కావాలని ఆదేశం
- మాజీ సర్పంచ్ భర్త టీడీపీ నేత.. కుమారుడు బాపట్ల జిల్లా ఎస్పీ



దేవరకొండలో ఆక్రమిత భూమికి కంచె వేసిన దృశ్యం

తిరుపతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ గ్రామంలో 11.71 ఎకరాల ప్రభుత్వ, అటవీ భూములు కబ్జాకు గురయ్యాయి. భాకరాపేట మాజీ సర్పంచ్ కుటుంబం ఆధీనంలో ఈ భూములున్నాయని ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. వాటిపై స్పందించిన ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. దీంతో భూములు సర్వే చేసిన అధికారులు కబ్జా వాస్తవమేనని తేల్చారు. మాజీ సర్పంచ్ కుటుంబానికి నోటీసులు జారీ చేశారు. దేవరకొండలోని ప్రభుత్వ, అటవీ భూములను భాకరాపేటకు చెందిన బోరుగడ్డ నాగమ్మ కుటుంబం ఆక్రమించుకుని కంచె వేసుకుందని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కృష్ణమూర్తి, పలువురు రైతులు మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న నాగమ్మ 2009-14 మధ్యకాలంలో భాకరాపేట సర్పంచ్‌గా పనిచేశారని విచారణలో వెల్లడైంది. ఆమె భర్త చిన్నయ్య టీడీపీ నాయకుడు కాగా, ఆమె కుమారుడు ఓ జిల్లాకు ఎస్పీగా పనిచేస్తున్నట్టు తెలిసింది. అయినా పార్టీ కార్యాలయానికి అందిన ఫిర్యాదులపై ప్రభుత్వం స్పందించింది. ఫిర్యాదులను తిరుపతి జిల్లా కలెక్టర్‌కు పంపి విచారించాలని ఆదేశించింది. కలెక్టర్ ఆదేశాలతో చిన్నగొట్టిగల్లు తహసీల్దారు భాగ్యలక్ష్మి సిబ్బందితో కలసి రికార్డులు పరిశీలించడంతో పాటు సంబంధిత భూములను సర్వే చేయించారు. మొత్తం 11.71 ఎకరాల ప్రభుత్వ, అటవీ భూములు నాగమ్మ ఆక్రమణలో ఉన్నట్టు తేల్చారు. ఆ భూముల్లో మామిడి తోట అభివృద్ధి చేసుకుని చుట్టూ కంచె వేశారని నిర్ధారించారు. సంబంధిత భూములను స్వాధీనం చేసుకునేందుకు నాగమ్మకు తహసీల్దారు నోటీసు జారీ చేశారు. ఆ భూములకు సంబంధించిన రికార్డులు, డాక్యుమెంట్లతో మార్చి 2న హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు.

హైకోర్టులో పిటిషన్.. కౌంటర్ దాఖలుకు ఆదేశం

అమరావతి: తిరుపతి జిల్లా, చిన్నగొట్టిగల్లు మండలం, దేవరకొండ గ్రామంలోని వివిధ సర్వే నంబర్లలో ఉన్న ప్రభుత్వ భూమిని బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ కుటుంబ సభ్యులు ఆక్రమించారంటూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. దీనిపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి, తిరుపతి జిల్లా కలెక్టర్, ఆర్డీవో, చిన్నగొట్టిగల్లు తహశీల్దార్, ఉమామహేశ్వర్ తల్లి నాగమ్మకు నోటీసులు జారీ చేసింది. విచారణను మార్చి 30కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ ఉత్తర్వులు ఇచ్చారు. దేవరకొండలో మొత్తం 15.96 ఎకరాల్లో ఉన్న ఆక్రమణలు తొలగించేలా రెవెన్యూ అధికారులను ఆదేశించాలని కోరుతూ బాపట్ల జిల్లా చుండూరు గ్రామానికి చెందిన గుడేటి బాలకోటిరెడ్డి పిటిషన్ దాఖలు చేశారు.

నెల్లూరు మేయర్‌గా సుజాత

- ఎన్నికకు దూరంగా వైసీపీ సభ్యులు



జేసీ వెంకటేశ్వర్లు నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న సుజాత

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర మేయర్‌గా దేవర కొండ సుజాత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతేడాది నవంబరులో అప్పటి మేయర్ పొట్లూరి స్రవంతి తన పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. నగరపాలక సంస్థ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మేయర్‌ను ఎన్నుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఇటీవల ఆదేశించడంతో గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన సమావేశం జరిగింది. టీడీపీ బలపరిచిన 53వ డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ సుజాతను మేయర్ అభ్యర్థిగా ప్రతిపాదిస్తున్నట్టు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ తెలిపారు. వెంటనే బుజబుజనెల్లూరుకు చెందిన కార్పొరేటర్ బద్దేపూడి నరసింహగిరి బలపరుస్తున్నట్టు వెల్లడించారు. పోటీ లేకపోవడంతో సుజాతను ఏకగ్రీవంగా మేయర్‌గా ఎంపిక చేస్తున్నట్టు జేసీ ప్రకటించారు. వైసీపీ సభ్యులెవరూ ఈ ప్రత్యేక సమావేశానికి హాజరుకాకపోవడం గమనార్హం.

అమరావతిలో ఫైవ్‌స్టార్ హోటల్, కన్వెన్షన్ సెంటర్

- సీఆర్డీఏతో ఓం శ్రీ భవన సాయి అసోసియేట్ ఎల్ఎల్‌పీ సంస్థ ఒప్పందం



ఫైవ్‌స్టార్ హోటల్ ఒప్పంద ఏర్పాటు పత్రాలను అందజేస్తున్న సీఆర్డీఏ జాయింట్ డైరెక్టర్

తుళ్లూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ఓం శ్రీ భవన సాయి అసోసియేట్ ఎల్ఎల్ పీ సంస్థ కన్వెన్షన్ సెంటర్, ఫైవ్ స్టార్ హోటల్ (హయత్ రీజెన్సీ హోటల్) ఏర్పాటుకు సంబంధించిన అగ్రిమెంట్ పూర్తయ్యింది. 200 గదులతో హోటల్, 10,500 మంది కూర్చునేందుకు వీలుగా కన్వెన్షన్ సెంటర్ నిర్మించేందుకు ఆ సంస్థకు ఏపీ సీఆర్డీఏకి మధ్య గురువారం ఒప్పందం కుదిరింది. వీటి నిర్మాణానికి ఏపీ సీఆర్డీఏ తుళ్లూరులో 6.05 ఎకరాల స్థలాన్ని గతంలో కేటాయించింది. ఈ మేరకు ఒప్పందపత్రాలను సీఆర్డీఏ జాయింట్ డైరెక్టర్ (ఎస్టేట్) జుబిన్‌రాయ్, ఓంశ్రీ భావనసాయి అసోసియేట్స్ ఎల్ఎల్‌పీ సంస్థ ప్రతినిధులకు గురువారం అందజేశారు. అమరావతిలో ఈ సంస్థ సుమారు రూ.1200 కోట్ల పెట్టుబడితో కన్వెన్షన్ సెంటర్, ఫైవ్ స్టార్ హోటల్ నిర్మించేందుకు గతేడాది నవంబరులో విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సమ్మిట్‌లో రాష్ట్ర ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకుంది. గురువారం అగ్రిమెంట్ పూర్తి కావడంతో రాజధాని అమరావతిలో కన్వెన్షన్ సెంటర్, ఫైవ్ స్టార్ హోటల్ నిర్మించి ఆతిథ్యం అందించే దిశగా కీలకమైన ముందడుగు పడింది.

కూతురిని బైక్‌పై ఎక్కించుకుని కాల్వలోకి దూకేశాడు!

- మద్యం మత్తులో ఓ తండ్రి ఘాతుకం
- చిన్నారి మృతి.. తండ్రిపై హత్యకేసు



చిన్నారి లేస్, పాప మృతదేహాన్ని ఎత్తుకుని రోదిస్తున్న తల్లి

జగ్గంపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కూతురి పాలిట కన్న తండ్రే కాలయముడయ్యాడు. భార్యతో గొడవపడి.. మద్యం మత్తులో 16 నెలల పాపను బైక్‌పై ఎక్కించుకుని వేగంగా వెళ్లి పోలవరం కాల్వలో దూకేశాడు. స్థానికులు వెంటనే బయటకు తీసేసరికే చిన్నారి మృతిచెందగా.. తండ్రి ప్రాణాలతో బయటపడ్డాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం గుర్రంపాలేనికి చెందిన ఓడిబోయిన మణికంఠ, సాయమ్మ దంపతులకు 16 నెలల చిన్నారి లేస్ ఉంది. ఇద్దరూ ఇటీవల తరచూ గొడవ పడుతున్నారు. గురువారం మద్యం మత్తులో ఉన్న మణికంఠ భార్యను కొట్టి, గదిలో బంధించాడు. కూతురిని బైక్‌పై ఎక్కించుకుని నేరుగా గుర్రంపాలెంరోడ్‌లోని పోలవరం కాల్వలోకి మోటార్‌సైకిల్‌తో సహా దూకేశాడు. మణికంఠను జగ్గంపేట పోలీసులు అరెస్టు చేసి హత్య కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

కోస్తాలో చెదురుమదురు వర్షాలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కర్ణాటక నుంచి మరట్వాడా వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. బంగాళాఖాతంలో కొనసాగుతున్న అధిక పీడనం ప్రభావంతో భూఉపరితలంపైకి తేమగాలులు వీస్తున్నాయి. గురువారం కోస్తా, సీమల్లో అక్కడక్కడా వర్షాలు కురిశాయి. మిగిలిన చోట్ల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. అనంతపురంలో 36.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తాలో ఒకటి, రెండుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని, మిగిలిన చోట్ల ఎండ తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మేధాసాహసి రాజాజీ

వలసపాలన నుంచి దశాబ్దాల క్రితమే స్వాతంత్ర్యాన్ని పొందిన మనం వలసవాద ఆలోచనా రీతుల నుంచి కూడా పూర్తిగా విముక్తమవ్వాలనే ఆరాటం ప్రబలమవుతున్న ప్రస్తుత తరుణంలో మొన్న సోమవారం నాడు రాష్ట్రపతి భవన్ ప్రాంగణంలో ఆ సౌధ వాస్తుశిల్పి ఎడ్వర్డ్ లుట్యెన్స్ ప్రతిమను తొలగించి ఆ స్థానంలో రాజాజీగా జగద్విఖ్యాతుడైన చక్రవర్తుల రాజగోపాలాచారి కాంస్య విగ్రహాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆవిష్కరించారు. తన 94 ఏళ్ల జీవన ప్రస్థానంలో మహా మేధావి, విద్యాధికుడు, న్యాయవాది, దేశ భక్తుడు, సంఘ సంస్కర్త, రాజనీతివేత్త, పరిపాలనాదక్షుడు, మానవతావాది, ప్రపంచ శాంతికాముకుడుగా రాజాజీ ప్రభాసించారు.

నియంత్రణలు అతి తక్కువగా ఉండే ఆర్థిక వ్యవస్థ ఏర్పాటు లక్ష్యంతో తాను నెలకొల్పిన స్వతంత్ర పార్టీ విధానాలే భవిష్యత్తులో ప్రభుత్వ విధానాలు అవుతాయని 1971లో ఇందిరాగాంధీ ప్రభంజనంలో ఘోర పరాజయం సంభవించిన కొద్ది రోజులకే ప్రకటించిన ధీర రాజనీతిజ్ఞుడు రాజాజీ. ఆయన మాట సత్యవాక్కు అయింది. 1990 దశకం తొలినాళ్లలో ఆరంభమయిన ఆర్థిక సంస్కరణలకు పితామహుడుగా ఆయన్ని గౌరవించడం సద్వివేకమవుతుంది. సోషలిస్టు తరహా సమాజాన్ని నిర్మిస్తామని 1950ల్లో కాంగ్రెస్ నాయకులు చమ్కీ ఉపన్యాసాలు చేస్తున్నప్పుడు వారు తీసుకువచ్చేది పర్మిట్–లైసెన్స్–కోటా రాజ్ మినహా మరేమీ కాదని ఘాటుగా విమర్శించి ప్రత్యామ్నాయ రాజకీయపథాన్ని దేశ ప్రజలకు సూచించిన వివేకశీలి రాజాజీ. స్వాతంత్ర్యోద్యమ కాలంలో ముస్లింల పాకిస్థాన్ ఆరాటాన్ని ఆమోదించడమే శ్రేయస్కరమని కాంగ్రెస్‌కు నచ్చచెప్పేందుకు ప్రయత్నించిన ఏకైక కాంగ్రెస్ వాది ఈ దక్షిణాత్య దార్శనికుడు. ఇది చరిత్ర. భావి తరాలకూ, వారి సమస్యల సందర్భంలో వివేకశీలతను అలవరిచే చరిత్ర. ఈ సమాంతర చరిత్రను నేటి నవీన తరం విపులంగా తెలుసుకోవలిసిన అవసరమున్నది. రాష్ట్రపతి భవన్ ప్రాంగణంలో రాజాజీ కాంస్య విగ్రహావిష్కరణ ఆ ఉదాత్తుని చరిత్రపై నేటి యువతరంలో జిజ్ఞాసను పురిగొల్పాలి. విశిష్ట గుణసంపన్నుడైన రాజాజీలో మనకు ప్రధానంగా ప్రస్ఫుటమయ్యేది మేధా ధైర్యం. తన భావాల సమంజసత్వంలో పరిపూర్ణ విశ్వాసంతో అవసరమైతే సహచరులనూ, సమాజాన్నీ ధిక్కరించేందుకు ఒక ఆలోచనాపరుడిని సాహసింపజేసేది మేధా ధైర్యం. పాకిస్థాన్ ఏర్పాటు అనివార్యమని గుర్తించి, ఆ విషయాన్ని స్పష్టంగా చెప్పేందుకు రాజాజీ వెనుకాడలేదు. క్విట్ ఇండియా ఉద్యమ సంకల్పం అసంబద్ధమని ఎలుగెత్తి, గాంధీజీతో విభేదించి కాంగ్రెస్‌కు దూరం కావడానికి సిద్ధమయిన సాహసి. ఆర్థిక విధానాల విషయంలో నెహ్రూను వ్యతిరేకించి రాజాజీ ప్రతిపాదించినవే ఇప్పుడు అనుసరిస్తున్న మార్గాలుగా ఉన్నాయి. ఇవన్నీ ఆయన మేధా ధైర్యానికి విశిష్ట తార్కాణాలు.

వలసపాలకులు మన జ్ఞాన వ్యవస్థలను కించపరిచారు. మన అంతర్గత విశ్వాసాలను ప్రభావితం చేశారు. మనలో మేధా, సాంస్కృతిక న్యూనతలను సృష్టించారు.. అయితే రాజా రామ మోహన్‌రాయ్ నుంచి మానవేంద్రనాథ్‌రాయ్ వరకు మన కవులు, తాత్వికులు, విద్వజ్జులు, సాంస్కృతిక కృషీవలులు ఎందరో పాశ్చాత్య అనుచిత ఆధిపత్యాలను తోసిపుచ్చి అవసరమైన ఆలోచనలు తీసుకుని మన మేధా సంస్కృతి విశిష్టతను కాపాడి నిలబెట్టారు, సమున్నతపరిచారు. ఈ కృషి ఎప్పటికీ కొనసాగాలి. ఏ నాగరికతా ఒక ద్వీపం లాంటిది కాదు. వివిధ నాగరికతలతో పరస్పర ఆదానప్రదానాలు లేనిదే ఎవరికీ పురోగతి ఉండదు. మరి వలసపాలనలో మనలను ప్రభావితం చేసిన ఆధునిక ప్రజాస్వామ్యం, ఆధునిక విజ్ఞానశాస్త్రం, నవీన ఆర్థిక జీవన పద్ధతులలో ఆ పథనిర్దేశకుల కంటే మనమే అన్నివిధాల మెరుగ్గా, అగ్రగాములుగా ఉండడమే వలసవాద మానసిక ధోరణుల నుంచి విముక్తి ఆరాటాల లక్ష్యంగా ఉండడం హేతుబద్ధమవుతుంది. వివేకాన్ని మేల్కొల పని విగ్రహపూజ మన సంప్రదాయాలలో ఉంది. వలసవాద ఆలోచనా రీతుల నుంచి విముక్తికై మోదీ సర్కార్ చేస్తున్న కృషి –పేర్ల మార్పు, పాత విగ్రహాల స్థానంలో కొత్త విగ్రహాల స్థాపన, కొత్త కట్టడాలు ఇత్యాదులు– ఆ దారిలో నడవకుండా ఉండాలి.

రాజాజీ మేధా నైశిత్యం, నైతిక నిబద్ధతల విషయమై తమిళేతరులలో ఉన్న ప్రతికూల అభిప్రాయాలు తక్కువేమీ కాదు. ఒకనాడు తమిళులతో కలిసి ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఆంధ్రులలో ఆయన పట్ల ఒక విధమైన నిరసన ఉన్నది. అదొక మూసభావనగా రూపొంది ఇప్పటికీ పరిఢవిల్లుతూనే ఉన్నది. ఆ కాలంలో నదులపై ప్రాజెక్టుల విషయంలో ఆయన ప్రతిపాదనలు అంగీకరించి ఉంటే నేడు రాయలసీమలో సాగునీటి సదుపాయాలు చాలా మెరుగ్గా ఉండేవేమో?! ఈ విషయమై ఆంధ్రులు ఇప్పటికైనా నిష్పాక్షికంగా తర్కించుకోవాలి. గతంలో రాజకీయ, ప్రాంతీయ, భావజాలపరమైన భావోద్వేగాలు వివేకశీల ఆలోచనలు, నిర్ణయాలకు అడ్డుపడ్డాయి. మన ప్రజాస్వామ్య యుగంలో అశుభాలను ఎదుర్కొని శుభాలు సమకూర్చుకోవడంలో ప్రజల ప్రాజ్ఞత కీలకమైనది. మరి జనంలో అటువంటి ప్రాజ్ఞత వికసించి వర్థిల్లేందుకు రాజాజీ లాంటి ప్రజాస్వామ్య వివేకశీలి నుంచి స్ఫూర్తిని పొందడం చాలా ముఖ్యం.

పాపం ఒకరిది... ప్రాయశ్చిత్తం మరొకరిది!

చేదు అనుభవాలు నేర్పిన గుణపాఠాలు భవిష్యత్తులో మంచి అడుగులు వేయటానికి తోడ్పడాలని అనుకుంటాం. ఆ అవసరం లేనట్లుగా ఒక వ్యక్తి వ్యవహరిస్తే జరిగే నష్టం పరిమితంగానే ఉంటుంది. కానీ ఒక దేశం అలా వ్యవహరిస్తే జరిగే నష్టం ఇంతా అంతా అని చెప్పలేం. అందులోనూ అమెరికాలాంటి అగ్రరాజ్యమే అలా ప్రవర్తిస్తే చెల్లించే మూల్యం భారీగా ఉంటుంది. ఇరాన్‌పై దాడిచేయటానికి, బాంబులు కురిపించటానికి ఆ దేశం చేస్తున్న ప్రయత్నాలు కార్యరూపం దాల్చితే జరిగేది అదే! ఏదో ఒక నెపంతో, ఆధిపత్య దాహంతో యుద్ధాలు చేయటం తన హక్కుగా భావిస్తూ జననష్టం, వనరుల విధ్వంసం, సౌకర్యాల విచ్ఛిన్నం... అనేవి తనకు సంబంధం లేనట్లుగా వ్యవహరించటం అమెరికాకు కొత్తకాదు. వియత్నాం, అఫ్ఘానిస్థాన్, ఇరాక్‌ల్లో ఒకనాడు జరిగింది అదే! ఇప్పుడు ఇరాన్ వంతువచ్చింది అంతే!

మధ్యప్రాచ్యంలో 1979 నుంచీ ఇరాన్ అమెరికాకు కొరుకరాని కొయ్యగానే ఉంది. అప్పటి నుంచి సందర్భం వచ్చినప్పుడల్లా తిరుగుబాట్లను ఉసిగొల్పటానికి చేయాల్సినదంతా చేసింది. ఇరాన్‌లో ప్రభుత్వాన్ని కూల్చాల్సిన అవసరం వచ్చిందంటూ అగ్రరాజ్యం ఇప్పుడు మళ్లీ బహిరంగంగా ప్రకటించటమే గాక అందుకు పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తామని అక్కడి ఆందోళనకారులకు భరోసానూ ఇచ్చింది. ఇజ్రాయెల్‌తో కలిసి బహిరంగంగా, రహస్యంగా పావులన్నీ కదిపినా ఆశించిన ఫలితం కనపడలేదు. ఇరానీయుల అసంతృప్తి, ఆగ్రహం అక్కడి ప్రభుత్వాన్ని కూలదోసే స్థాయిలో సంఘటితం కాలేదు. అందుకే అణురాగంలో మాటలు తీవ్రమయ్యాయి. తమతో, తమకు నచ్చిన రీతిలో అణు ఒప్పందం చేసుకోకపోతే విధ్వంసం తప్పదనే హెచ్చరికలు ముమ్మరమయ్యాయి. అసలు ఎలాంటి ఒప్పందం కావాలో, దాంట్లో ఏం ఉండాలో ఇంతవరకూ అమెరికా స్పష్టం చేయలేదు. గతంలో చేసుకున్న ఒప్పందంలో లోపాలేమిటో నిర్దిష్టంగా చెప్పనూలేదు. అమెరికాతో సహా చైనా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీలకు ఆమోదయోగ్యమైన 2015 నాటి ఒప్పందం పనికిరాదంటూ దాన్నుంచి ఏకపక్షంగా వైదొలగుతూ ఆదేశాలు జారీచేసిన డొనాల్డ్ ట్రంప్.. ఇప్పుడు కొత్తదానికి ఇరాన్ ముందుకు రావటం లేదంటూ సైనికదాడికి సర్వసన్నాహాలు చేస్తున్నారు.

2003లో ఇరాక్‌పై దాడి చేసినట్టే ఇప్పుడు ఇరాన్‌పైనా చేస్తే ఫలితాలు ఇంకా దారుణంగా ఉండే అవకాశమే ఎక్కువ. ఒకవేళ సైన్యాన్ని ఇరాన్‌లోకి ప్రత్యక్షంగా నడిపించకుండా అక్కడి మతనాయకత్వాన్ని హతమార్చితే అది ఎటు దారితీస్తుందో ఊహించలేం. షియా ముస్లింల ప్రతిస్పందన ఎట్లా ఉంటుందో, అది ఏ మలుపులు తిరుగుతుందో కచ్చితంగా ఇప్పుడే చెప్పనూలేం. ఇరాక్‌లో సున్నీలు అధిక సంఖ్యాకులు కారు. కానీ దశాబ్దాలు అధికారంలో వాళ్లే ఉన్నారు. అమెరికా దాడితో ప్రభుత్వ, సైనిక పదవులను కోల్పోయిన సున్నీలను మతప్రాతిపదిక

> **ఇరాక్‌లో ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని కూల్చి తొలిపాపానికి పాల్పడింది అమెరికానే. అణు ఒప్పందం నుంచి ఏకపక్షంగా వైదొలగి మలిపాపానికి పాల్పడిందీ అమెరికానే. కానీ ప్రాయశ్చిత్తాన్ని ఇరాన్ భరించాలనటమే అమెరికా అతినేర్పరితనం!**

మీద సంఘటితం చేసి ఇస్లామిక్ స్టేట్ పేరుతో కొనసాగిన ప్రతిఘటన ఎన్నో జీవితాలను బలితీసుకుంది. ఒకవేళ ఇరాన్‌లో అలాంటి కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా షియాలనే అందులో కూర్చోపెట్టాలి. ఇరాక్‌లోలాగా అధికార పీఠాలపైకి సున్నీల స్థానంలో షియాలు వచ్చినట్లు ఇరాన్‌లో మరోవర్గం వచ్చే అవకాశం లేదు. ఇక ఇరాన్‌లో అత్యున్నత పదవిలో ఉన్న అలీ ఖమేనేయిని భౌతికంగా



లేకుండా చేయటానికి అమెరికా చేసే ఏ ప్రయత్నమైనా మతపరమైన అజెండాతో హింసాత్మక ప్రతిఘటనకు దారితీసే అవకాశం ఉంది. అది ఇరాన్‌కే పరిమితం కాదు. షియాలు గణనీయసంఖ్యలో ఉన్న అన్ని ప్రాంతాలకూ వ్యాపించే ప్రమాదం ఉంది. ఇరాక్‌లోనూ, అజర్‌బైజాన్‌లోనూ అలజడులు చెలరేగుతాయి. భారత్, పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్‌లో కూడా షియాలు గణనీయసంఖ్యలోనే ఉన్నారు. ఇతర దేశాలను కూడా కలుపుకొంటే షియాలు 20 నుంచి 25 కోట్ల వరకూ ఉంటారు. బలమైన షియా ఆధిక్య దేశంగా ఇరాన్‌కు ఎప్పటి నుంచో గుర్తింపు ఉంది. అందుకే ఇరాన్‌లో ఏం జరిగినా దాని ప్రభావం షియా ప్రజలందరిపైనా ప్రగాఢంగానే ఉండొచ్చు.

అగ్రరాజ్యం చేసే యుద్ధానికి కనీసంగానైనా ఏదో ఒక సమర్థనను తయారుచేసుకోవటం గతంలో ఎంతో కొంత ఉండేది. బిన్‌లాడెన్‌కు ఆశ్రయం ఇచ్చారని అఫ్ఘానిస్థాన్‌పై యుద్ధం మొదలుపెట్టింది. భారీ జనవిధ్వంసక ఆయుధాలను కలిగి ఉన్నదంటూ ఇరాక్‌పై సేనలను నడిపించారు. ట్రంప్ వచ్చిన తర్వాత సైనిక యుద్ధాలకూ, వాణిజ్య యుద్ధాలకూ ఎటువంటి సమర్థనల అవసరం ఉండటం లేదు. 2015 నాటి అణు ఒప్పందానికి (జాయింట్ కాంప్రిహెన్సివ్ ప్లాన్ ఆఫ్ యాక్షన్) అంగీకరించి దానిలోని షరతులను కచ్చితంగా అమలుచేస్తామని ఇరాన్ హామీ ఇచ్చింది. హామీని ఉల్లంఘిస్తే చర్యలు ఎంత కఠినంగా ఉంటాయో ఇరాన్‌కూ తెలుసు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలోని అయిదు దేశాలతో పాటు జర్మనీ కూడా ఒప్పందంలో భాగస్వామిగా ఉంది. 'అణ్వాయుధాలను తయారుచేయటానికి, సంపాదించటానికి ఎటువంటి పరిస్థితుల్లోనూ ప్రయత్నించబోనని ఇరాన్ పునరుద్ఘాటిస్తోంది' అన్న హామీ ఒప్పందం మొదటి పేరాలోనే స్పష్టంగా ఉంది. 15 ఏళ్ల కాలంలో యురేనియం నిల్వలను 98శాతం తగ్గించాలని కూడా ఒప్పందంలో విపులంగా పేర్కొన్నారు. అందులో భాగంగా కొన్ని నిల్వలను ఇరాన్ రష్యాకు తరలించింది. యురేనియం శుద్ధి స్థాయిని 3.67శాతానికి అంగీకరించింది. వైద్య అవసరాలకు ఉపయోగించటానికి కూడా ఈ శాతానికి కొంత మించే యురేనియాన్ని శుద్ధి చేయాలి. యురేనియం శుద్ధి సామర్థ్యాన్ని ఈ స్థాయికి తగ్గించుకున్నాక మళ్లీ మనసు మార్చుకుని అణ్వస్త్రాలు తయారుచేసే మేరకు దాన్ని తీసుకెళ్లాలంటే ఎక్కువ సమయమే పడుతుంది. ఆ లోగానే వ్యవహారాలను పసిగట్టి ఇరాన్‌ను దారిలోకి తీసుకువచ్చే సామర్థ్యం అగ్రరాజ్యాలకు ఉందని కూడా అప్పట్లో భావించారు. అనుకున్న విధంగా ఒప్పందం అమలుకు వేగంగా అడుగులు పడుతున్న నేపథ్యంలో ఇరాన్‌పై ఆంక్షలను ఎత్తివేసే క్రమం మొదలైంది. ఆంక్షలతో అన్ని విధాలుగా ఇరాన్ అప్పటికే విపరీతంగా కుంగిపోయింది. వందల బిలియన్ డాలర్ల ఆదాయాన్నీ కోల్పోయింది. 2012–2015 మధ్యలో ఒక్క చమురుపైనే 160 బిలియన్ డాలర్ల రెవెన్యూనీ పోగొట్టుకుంది. ఖాతాలను స్తంభింపచేయటంతో 100 బిలియన్ డాలర్లు విదేశాల్లోనే ఉండిపోయాయి.



■ రాహుల్ కుమార్

ఇరాన్‌తో అమెరికా అణు ఒప్పందం కుదుర్చుకోవటం ఇజ్రాయెల్‌కు ఏ మాత్రం ఇష్టం లేదు. ఆ ఒప్పందాన్ని చరిత్రాత్మక తప్పిదంగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతాన్యాహు అప్పట్లోనే వ్యాఖ్యానించారు. 2016లో ట్రంప్ మొదటిసారి అధికారంలోకి రావటంతో ఒప్పందం నుంచి వైదొలగటానికి సన్నాహాలు మొదలుపెట్టారు. మధ్యప్రాచ్య వ్యవహారాల్లో ఇజ్రాయెల్ చెప్పినదానికి తలాడించటమే ట్రంప్ సారథ్యంలోని అమెరికాకు అలవాటుగా మారిపోయింది. 2018 మే 9న ఒప్పందం నుంచి వైదొలగుతున్నట్లు ట్రంప్ ప్రకటించారు. చైనా, రష్యా, ఫ్రాన్స్, బ్రిటన్ జర్మనీలతో పాటు మొత్తం యూరోపియన్ యూనియన్, టర్కీ కూడా ఇది సరైన పనికాదని విమర్శించాయి. అయినా అమెరికా లెక్కచేయలేదు. ఏడాదిపాటు ఇరాన్ వేచిచూసింది. ఒప్పందాన్ని కాపాడటానికి యూరోపియన్ యూనియన్ ప్రయత్నాలు ఫలిస్తాయేమోనని ఆశపడింది. అది ఫలించక పోగా అమెరికా ఆంక్షలను మళ్లీ విధించింది. యురేనియం శుద్ధిస్థాయిని 20శాతానికి పెంచుతామని 2019 జూన్‌లో ఇరాన్ ప్రకటించటంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ఆ తర్వాత దాన్ని క్రమేపీ ఇంకా పెంచుతున్నట్లుగా ప్రకటనలు వచ్చాయి. అణ్వస్త్రాలను తయారుచేసే స్థాయికి ఇరాన్ యురేనియం శుద్ధి కార్యక్రమం చేరుకుందనే నెపంతో కిందటి ఏడాది జూన్‌లో అమెరికా భారీ బాంబులను ప్రయోగించింది. ఇరాన్ యురేనియం శుద్ధి కర్మాగారాలన్నిటినీ దారుణంగా దెబ్బతీశామని ఘనంగానూ ప్రకటించుకుంది. అంతకుముందుగా ఇరాన్ కీలకనేతలనూ, అధికారులనూ, శాస్త్రవేత్తలనూ డ్రోన్లను ఉపయోగించీ ఇతరత్రానూ మట్టుబెట్టారు.

ఒకప్పుడు మధ్యప్రాచ్యంలోనే అమెరికాకు చాలా ఇష్టమైన దేశం ఇరాన్. మహమ్మదు రెజాషా ఇరాన్ పాలకుడిగా ఉండగా అణుకర్మాగారాల స్థాపనకు అమెరికా తోడ్పడింది. అత్యాధునిక ఆయుధాలనూ, విమానాలనూ అమ్మి మధ్యప్రాచ్యంలోనే ఇరాన్‌ను సైనికంగా బలపడేటట్టు చేసింది. అమెరికా అనుకూల విధానాలతో పాటే అణచివేతను కూడా రెజాషా అమలుచేశారు. రాజకీయ స్వేచ్ఛను లేకుండా చేశారు. పౌరహక్కులను అణచివేశారు. 10 శాతం జనాభాకు మాత్రమే లాభం చేసే విధానాలను అమలుచేయటంతో అసంతృప్తులు పెరిగిపోయాయి. అసలు 1950ల మొదట్లోనే ఇరాన్‌లో అమెరికా వ్యతిరేక బీజాలు బలపడ్డాయి. అప్పట్లో రెజాషా అధికారాలు పరిమితంగా ఉండేవి. పార్లమెంట్ (మజ్లిస్) సర్వోన్నతంగా ఉండేది. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు కోసం ఎక్కువ నిధులను అందించటానికి ఆంగ్లో–ఇరానియన్ ఆయిల్ కంపెనీ నిరాకరించటంతో మొత్తం చమురు పరిశ్రమను జాతీయం చేశారు. ఆ చర్యతో రగిలిపోయిన బ్రిటన్, అమెరికాలు ఏకమై ఇరాన్‌లోని ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదోశాయి. అప్పటి నుంచి అమెరికా వ్యతిరేకత ఇరాన్‌లో పాతుకుపోయింది. అమెరికా అండతో ఆ తర్వాత చెలరేగిపోయిన రెజాషాకు వ్యతిరేకంగా ఇరాన్‌లో అన్ని రాజకీయపక్షాలు ఏకమయ్యాయి. అయతుల్లా ఖొమైనీ నాయకత్వంలో సాగిన ఉద్యమం వల్ల 1979లో రెజాషా ప్రభుత్వం కూలిపోయింది.

యురేనియం శుద్ధి కార్యక్రమాలను ఆపినంత మాత్రాన ఇరాన్‌ను తనమానాన తనని ఉండనిస్తారా? అన్నది ఇప్పటికీ సందేహమే. అమెరికా, ఇజ్రాయెల్ ప్రాబల్యానికి ఎదురీది నిలబడి మధ్యప్రాచ్యంలో తన ప్రభావాన్ని పెంచుకోటానికి ఇరాన్ ప్రయత్నించింది. అంతటితో ఆగలేదు. వీలైనప్పుడల్లా ఆ రెండు దేశాల ప్రయోజనాలను దెబ్బతీయటానికి పావులనూ కదిపింది. చర్యకు ప్రతిచర్యగా దాన్ని ఇరాన్ పాలకులు సమర్థించుకున్నా అంతిమంగా నష్టపోయింది మాత్రం ప్రజలే. బాహ్య శత్రువులను చూపి అంతర్గతంగా ప్రజాస్వామ్యాన్ని లేకుండా ఇరాన్ పాలకులు చేయగలిగారు. ఆర్థిక సమస్యల ఆధారంగా రాజకీయాలు బలపడకుండా ఉండటానికి మతోన్మాదాన్ని అంతకంతకూ పెంచటానికే ప్రయత్నించారు తప్ప నిజమైన ప్రజాస్వామ్యం వైపు మొగ్గలేదు. అవసరమైన ఆర్థిక, రాజకీయ సంస్కరణలనూ చేపట్టలేదు. అన్ని నిరసనలనూ అమెరికా, ఇజ్రాయెల్ ప్రేరితాలుగా ఆరోపిస్తూ కాలం గడిపారు. అమెరికా జోక్యం పెరిగినప్పుడూ, బెదిరింపులకు పాల్పడినప్పుడూ, ఇజ్రాయెల్‌తో బాంబు దాడులు చేయించినప్పుడూ ఇరాన్ ప్రజలు ప్రదర్శించే సంఘటిత శక్తి మతనాయకులకే అనుకూలిస్తోంది.

పాలకులపై తీవ్ర అసంతృప్తితో ఉన్నప్పటికీ తమ దేశ అస్తిత్వం ప్రమాదంలో పడిందన్న భావనను ఇరాన్ ప్రజలు భరించలేరు. సుదీర్ఘచరిత్రనూ, గతంలోని సామ్రాజ్య ఘనతనూ, పర్షియన్ నాగరికత దేశదేశాల్లో ప్రసరించిన వెలుగునూ నిరంతరం గుర్తుచేసుకునే ఆలోచనాపరులూ, ప్రజలనూ కలిగిన దేశాన్ని లొంగదీయటం అంత తేలిక కాదు. ఇరాక్‌తో సహా అనేక మధ్యప్రాచ్యదేశాలు వందేళ్లకు

> **పాలకులపై తీవ్ర అసంతృప్తితో ఉన్నప్పటికీ తమ దేశ అస్తిత్వం ప్రమాదంలో పడిందన్న భావనను ఇరాన్ ప్రజలు భరించలేరు. సుదీర్ఘ చరిత్రనూ, గతంలోని సామ్రాజ్య ఘనతనూ, పర్షియన్ నాగరికత దేశదేశాల్లో ప్రసరించిన వెలుగునూ నిరంతరం గుర్తుచేసుకునే ఆలోచనాపరులూ, ప్రజలనూ కలిగిన దేశాన్ని లొంగదీయటం అంత తేలికకాదు. శతాబ్దాల ఉనికి ఉన్న దేశాన్ని బాంబులతో కాకుండా బంధాలతో గెలవగలిగితే మధ్యప్రాచ్యంలో శాంతిదీపం వెలుగుతుంది. 2015 నాటి అణు ఒప్పందాన్ని పునరుద్ధరిస్తే అందరూ ఆశించే బంధాలు కొంతైనా బలపడతాయి.**

ముందు ఉనికిలోనే లేవు. బ్రిటిషు సామ్రాజ్యవాదులు తమకు ఇష్టం వచ్చినట్లు గీసిన పటాల (మ్యాప్‌లు) ప్రకారం అవి ఏర్పడ్డాయి. ఇరాన్ ఆ కోవలోది కాదు. పర్షియాగా దాని అస్తిత్వం అవిచ్ఛిన్నమైనది. పదికోట్లకు చేరుతున్న జనాభాతో, విస్తృత భూభాగంతో, పోరాటాల చరిత్రతో.. శతాబ్దాల ఉనికి ఉన్న దేశాన్ని బాంబులతో కాకుండా బంధాలతో గెలవగలిగితే మధ్యప్రాచ్యంలో శాంతిదీపం వెలుగుతుంది. 2015 నాటి అణు ఒప్పందాన్ని పునరుద్ధరిస్తే అందరూ ఆశించే బంధాలు కొంతైనా బలపడతాయి. ఒకనాడు అక్కడి ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని కూల్చి తొలిపాపానికి పాల్పడింది అమెరికానే. అణు ఒప్పందం నుంచి ఏకపక్షంగా వైదొలగి మలిపాపానికి పాల్పడిందీ అమెరికానే. కానీ ప్రాయశ్చిత్తాన్ని ఇరాన్ భరించాలనటమే అమెరికా అతినేర్పరితనం!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

శాస్త్రీయ విజ్ఞానంతోనే సమాజానికి వెలుగు

కలకత్తాలోని ఇండియన్ అసోసియేషన్ ఫర్ ది కల్టివేషన్ ఆఫ్ సైన్స్‌లో 'రామన్ ఎఫెక్ట్'ను 1928 ఫిబ్రవరి 28న డాక్టర్ సి.వి.రామన్ ఆవిష్కరించారు. అంటే, కాంతి పదార్థం గుండా వెళ్ళేటప్పుడు దాని తరంగదైర్ఘ్యం మారుతుందని నిరూపించారు. క్యాన్సర్ నిర్ధారణ, మందుల నాణ్యతను పరీక్షించి నకిలీ మందులను గుర్తింపు, రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను కొలవడం, బంగారం, వజ్రాల నాణ్యతను గుర్తించడం, నీటి కాలుష్యాన్ని గుర్తించడం, ఇంటర్నెట్ వేగాన్ని పెంచడం... వంటి వాటికి ఈ ఆవిష్కరణ ఉపయోగపడింది. ఈ ఆవిష్కరణకు గానూ 1930లో సర్ సి.వి.రామన్‌కు భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. ఈ బహుమతి పొందిన మొదటి ఆసియా శాస్త్రవేత్త, మొదటి భారత శాస్త్రవేత్త ఆయనే.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51A (h) ప్రకారం, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవడం ప్రతి పౌరుడి మౌలిక విధి. జాతీయ సైన్స్ దినోత్సవం ఈ విధిని గుర్తుచేస్తుంది. దేశం సుస్థిర అభివృద్ధి సాధించడంలో సైన్స్ కీలకపాత్ర పోషిస్తుంది. వాతావరణ మార్పులు, నీటి కొరత, ఆహార భద్రత వంటి సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలు అవసరం. భారతదేశంలో విజ్ఞానశాస్త్ర పురోగతిలో భాగంగానే భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో), రక్షణ పరిశోధన–అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ), శాస్త్రీయ–పారిశ్రామిక పరిశోధనా మండలి, భారతీయ విజ్ఞాన సంస్థ, బాబా అణు పరిశోధన కేంద్రం వంటి సంస్థలు పుట్టుకొచ్చాయి. ఈ సంస్థలు అనేక పరిశోధనల్లో విజయాలు సాధించాయి. 2023లో



చంద్రయాన్–3 చంద్రుని దక్షిణ ధ్రువంపై విజయవంతంగా ల్యాండ్ కావడం, అదే సంవత్సరం ఆదిత్య–L1 సౌర పరిశీలన మిషన్, అంతకు ముందు కోవిడ్–19 వ్యాక్సిన్ పరిశోధన కోవాక్జిన్ అభివృద్ధి, 5G సాంకేతిక పరిజ్ఞానం... వంటివన్నీ ఈ సంస్థల కృషివల్లే భారత ప్రజలకు మరింత చేరువయ్యాయి.

కానీ సైన్స్ పరిశోధనలు, విజ్ఞానం పెంపుపై మన ప్రభుత్వాలు తగినంత శ్రద్ధ చూపడం లేదు. మన జీడీపీలో పరిశోధనల అభివృద్ధికి 0.7శాతం మాత్రమే నిధులు కేటాయిస్తున్నారు (అభివృద్ధి చెందిన దేశాలలో ఇది కనీసం 2–3 శాతంగా ఉంది). మరోవైపు, మన దేశంలో అవకాశాల్లేక నిపుణులైన శాస్త్రవేత్తలు ఇతర దేశాలకు వలస వెళ్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో శాస్త్రీయ విద్యా బోధన కరువైంది. మహిళా శాస్త్రవేత్తలు తక్కువ సంఖ్యలో ఉన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం కేవలం ఒక శాస్త్రవేత్తను స్మరించడానికి మాత్రమే కాదు, ఇది భారత సమాజంలో శాస్త్రీయ ఆలోచనలను పెంపొందింపజేయడానికి ఒక అవకాశం.

సి.వి.రామన్ ఇచ్చిన 'కష్టపడి పనిచేయండి, ఆలోచించండి, కొత్తవి కనుగొనండి' అనే సందేశాన్ని నేటి యువత ఆచరణలో పెట్టాలి. విజ్ఞాన శాస్త్రం ద్వారా మాత్రమే సుస్థిర, సమతుల్య అభివృద్ధి సాధ్యం. ఫండింగ్ కొరత, డిజిటల్ డివైడ్, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహనలేకపోవడం... వంటివి కూడా సైన్స్ రంగం అభివృద్ధికి ప్రధాన ఆటంకాలుగా ఉన్నాయి.

సామాజికపరంగా కొన్ని అంశాలను పరిశీలిస్తే, మార్క్సిజం సైన్స్‌ను సమాజ మార్పునకు సాధనంగా చూసింది. కానీ, బూర్జువా రాజకీయ ఆధిపత్యం సైన్స్‌ను రోజురోజుకూ దెబ్బతీస్తున్నది. కార్పొరేట్ పెట్టుబడిదారీ వ్యవస్థ తన లాభం కోసం ప్రకృతిని నాశనం చేస్తోంది. ఈ వినాశనం సైన్స్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఔషధ పరిశోధనకు కీలకమైన వృక్ష సంపద కూడా నానాటికీ కనుమరుగవుతోంది.

సైన్స్ మరింతగా వృద్ధి చెందాలంటే, విద్యార్థులకు హ్యాండ్స్–ఆన్ ప్రాజెక్టులు, ల్యాబ్ సదుపాయాలు పెంచాలి. పర్యావరణం, ఆరోగ్యం వంటి స్థానిక సమస్యలపై దృష్టి పెట్టి పరిశోధనలను ప్రోత్సహించాలి. స్టూడెంట్ యూనియన్ల భాగస్వామ్యంతో సైన్స్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించడానికి ప్రభుత్వం కృషి చేయాలి. నేటి సమాజంలో మూఢత్వం రోజురోజుకూ పెరిగిపోతోంది. సైన్స్‌తో ఆ మూఢత్వాన్ని జయించడమే నేడు మన ముందున్న కర్తవ్యం.

• బి.వీరభద్రం

(రేపు జాతీయ సైన్స్ దినోత్సవం)

రూపు మారుతున్న గ్రామీణ భారతం

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఇటీవల మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి, దాని స్థానంలో వీబీ జీ రామ్ జీని తెచ్చింది. దీనిపై పెద్దఎత్తున అనుకూల, వ్యతిరేక చర్చలు సాగుతున్నాయి.

భారతదేశ గ్రామీణ సంక్షోభం అనేది వివాదం లేని అంశం. ఇది– వ్యవసాయం, ఉపాధి, అప్పులు, వలసలు, విద్య, ఆరోగ్యం, సామాజిక అసమానతలు వంటి అనేక అంశాల కలయికతో ఏర్పడిన బహుముఖ సమస్య.

భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయమే వెన్నెముక. ఇక్కడ చిన్న, సన్నకారు రైతులు అంటే– రెండు హెక్టార్లలోపు భూమి ఉన్నవారే అధికం. వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కానీ, పండించిన పంటలకు కనీస మద్దతు ధర మాత్రం లభించడం లేదు. దీనికి తోడు మార్కెట్‌లో ధరల అస్థిరత, వర్షాధార వ్యవసాయం, వాతావరణ మార్పుల ప్రభావం వంటి కారణాలు రైతుల అప్పులు పెరగడానికి, ఆత్మహత్యలకు దారి తీస్తున్నాయి. 1991 తరువాత మన దేశంలో అమలవుతున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాల నేపథ్యంలో, 2014 తరువాత వ్యవసాయ రంగంపై ప్రభుత్వ పెట్టుబడులు భారీగా తగ్గాయి. ప్రభుత్వ రుణపరపతి తగ్గుతూ వచ్చింది. ప్రైవేట్ వడ్డీ, మార్కెట్ ఆధారిత విధానాలు పెరిగాయి. రైతులు గ్లోబల్ ధరల ప్రభావానికి గురవుతున్నారు. వీటితో రైతుల అప్పులు, యువత వలస, సామాజిక అసమానతలు వంటివి చోటుచేసుకుంటున్నాయి.

ఈ కాలంలోనే భూసంబంధాలలో అనేక మార్పులు జరిగాయి. కొద్దిమంది వద్ద భూమి కేంద్రీకృతమవడం, ఎక్కువ మందికి భూమి లేకపోవడం అతిపెద్ద మార్పు. 2018–19 నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ నివేదిక ప్రకారం, గ్రామీణ ప్రాంతంలో 20శాతం ధనికుల వద్ద 76శాతానికి పైగా భూమి ఉంది. 41శాతం కుటుంబాలకు ఎటువంటి భూమీ లేదు. సెంటు భూమి కూడా లేని కుటుంబాలు దేశంలోనే అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లో 54.4 శాతం, తెలంగాణలో 42.5శాతం ఉన్నాయి. ఇదే నివేదిక ప్రకారం సామాజిక అసమానతలు కూడా బాగా పెరుగుతున్నాయి. 57.3శాతం మంది దళితులు, 32.8శాతం ఆదివాసీలు, 53.1శాతం ముస్లింలు భూమిలేని పేదలుగా ఉన్నారు. 'ఫౌండేషన్ ఫర్ అగ్రేరియన్ స్టడీస్' అనే సంస్థ సర్వే ప్రకారం, గ్రామీణ ప్రాంతంలో కేవలం 5శాతం సంపన్నులు 60శాతం సంపదను కలిగి ఉన్నారు. సీలింగ్ భూములలో కూడా నేటికీ 18 లక్షల ఎకరాల భూమి వీరి నుంచి సేకరించలేదు. అలాగే 60 లక్షల ఎకరాల బంజరు భూమి అందుబాటులో ఉన్నా, అర్హులకు పంచలేదు. 5 లక్షల ఎకరాల భూదాన భూముల పంపకం ప్రశ్నార్థకంగా మిగిలింది. అందులో 1.4 లక్షల ఎకరాలు ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఉన్నాయి. అటవీ హక్కుల చట్టం–2006కు అనుగుణంగా జూన్ 2025 నాటికి 51.2 లక్షల అర్జీలు రాగా, 25.1 లక్షలు అంటే సగం పరిష్కారం కాలేదు. వీటికి తోడు వివిధ ప్రాజెక్టుల పేరున పెద్దఎత్తున జరుగుతున్న భూసేకరణ, ల్యాండ్ పూలింగ్ ద్వారా అనేక మంది చిన్న, సన్నకారు రైతులు ఉన్న కొద్దిపాటి భూమినీ కోల్పోతున్నారు. క్రమంగా వ్యవసాయేతర కూలీలుగా మారిన వీరికి ఇస్తున్న వేతనాలు కూడా చాలా తక్కువ. 'లేబర్ బ్యూరో' జూన్ 2025 నివేదిక ప్రకారం, పురుషులకు రోజు కూలి రూ.418, మహిళలకు రూ.334 మాత్రమే ఉంది. అంటే, గ్రామీణ పేదరికం మరింతగా పెరుగుతోంది.

> **శ్రామికులకు ఏ హక్కులూ లేకుండా చేసి, కార్పొరేట్ సంస్థలకు బానిసలుగా మార్చడమే నయా ఉదారవాద ఆర్థిక విధానాల సారం. దానికనుగుణంగానే లేబర్ కోడ్‌లు, గ్రామీణ ఉపాధి హామీ రద్దు వంటివి. ఈ విధానాలు దేశాన్ని మరింత సంక్షోభంలోకి నెడతాయి.**



ఒకప్పుడు ప్రభుత్వ నియంత్రణలో ఉండే వ్యవసాయం ఇప్పుడు మార్కెట్ ఆధారితం అయింది. విత్తనాలు, ఎరువులు, యంత్రాలు వంటివి కార్పొరేట్ సంస్థల నియంత్రణలోకి వెళ్లాయి. రైతు ఉత్పత్తిదారుడు అయినా, లాభం ఎక్కువగా మధ్యవర్తులు, కంపెనీలకే వెళ్తోంది. చిన్న ఉత్పత్తిదారులు అప్పుల వల్ల భూమి కోల్పోతూ కూలీలవుతున్నారు. ఫలితంగా గ్రామీణ ప్రాంతంలో చిన్న రైతుల శ్రామిక వర్గీకరణ ఏర్పడింది. రైతు శ్రమ ద్వారా సృష్టించిన విలువలో సింహభాగాన్ని మార్కెట్, వడ్డీ వ్యాపారస్థులు, వాణిజ్య కంపెనీలు తీసుకుంటాయి. ఇది ప్రత్యక్షంగా కాకపోయినా, పరోక్ష దోపిడీ రూపం. అందువల్ల గ్రామీణ సంక్షోభం అనేది 'నయా ఉదారవాద అభివృద్ధి విధానం' సృష్టించిన అంతర్గత వైరుధ్యం. గ్రామీణ ప్రాంతంలోని ఈ విధానాల వల్ల 1997–2022 మధ్య అధికారిక లెక్కల ప్రకారమే మూడు లక్షలకు పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు.

ఉదారవాద విధానాల కాలంలో కార్పొరేట్ సంస్థలు వ్యవసాయ పరిశోధనలు, విత్తనాల తయారీ, ఎరువుల అమ్మకం, ఫ్యూచర్ ట్రేడింగ్ వంటి వ్యవసాయ రంగాలలో ప్రవేశించడం, ప్రభుత్వం క్రమేణా వాటన్నింటి నుంచీ వైదొలగడంతో కార్పొరేట్ వ్యవసాయ ప్రోత్సాహం, కాంట్రాక్ట్ ఫార్మింగ్ వంటివి రైతును మార్కెట్ ఆధీనంలోకి మరింతగా నెట్టాయి. 2014 తరువాత ప్రభుత్వ రంగంలో ఎరువుల తయారీ తగ్గి, దిగుమతులపై ఆధారపడడంతో ఈ సంక్షోభం మరింత పెరిగింది.

2014లో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం రైతుల కష్టాలను మరింత పెంచింది. 2013 భూసేకరణ చట్టాన్ని సవరించడానికి శత విధాలా ప్రయత్నించి, అది సాధ్యం కాకపోవడంతో, అనేక విధాలుగా తూట్లు పొడుస్తోంది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల కనుగుణంగా కనీస మద్దతు ధరను ఇవ్వడానికి నిరాకరిస్తూ, మరో పక్క కార్పొరేట్ సంస్థలను ప్రోత్సహించేలా మూడు నల్ల చట్టాలను చేసింది. రైతుల సుదీర్ఘ పోరాటంతో వాటిని వెనక్కు తీసుకుంటున్నట్లు ప్రకటించినా, ఆచరణలో అవే విధానాలను కొనసాగిస్తోంది. ఈ పోరాటం బలంగా సాగిన దేశ ఉత్తర, పశ్చిమ ప్రాంతాలలో 2024 పార్లమెంటు ఎన్నికలలో మోదీ ప్రభుత్వం భారీ మూల్యమే చెల్లించుకోవలసి వచ్చింది.

శ్రామికులకు ఏ హక్కులూ లేకుండా చేసి, కార్పొరేట్ సంస్థలకు బానిసలుగా మార్చడమే నయా ఉదారవాద ఆర్థిక విధానాల సారం. దానికనుగుణంగానే లేబర్ కోడ్‌లు, గ్రామీణ ఉపాధి హామీ రద్దు వంటివి. ఈ విధానాలు దేశాన్ని మరింత సంక్షోభంలోకి నెడతాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ సంక్షోభానికి పరిష్కారంగా సమాన భూ పంపిణీ, పంటలకు మద్దతు ధర హామీ, నీటి పారుదల విస్తరణ, గ్రామీణ పరిశ్రమల అభివృద్ధి, సహకార వ్యవస్థ బలోపేతం, విద్య, వైద్య రంగాలలో ప్రభుత్వ పెట్టుబడులు పెంచడం, ఉపాధి గ్యారంటీ వంటి చర్యల ద్వారా మాత్రమే నవ భారత్ నిర్మాణం సాధ్యం.

■ ఎ. అజశర్మ

ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

గడువు గండం!



నత్తనడకన ఫార్మర్ యూనిక్ ఐడీ నమోదు

- జిల్లాలో 19,218 మంది పెండింగ్
- ఓటీపీ, భూ రికార్డులు, రైతుల గైర్హాజరు
- తలపట్టుకుంటున్న వ్యవసాయ శాఖ

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

గుంటూరు జిల్లాలో ఫార్మర్ యూనిక్ ఐడీ (రైతు గుర్తింపు సంఖ్య)నమోదు కార్యక్రమం అనేక అవరోధాల నడుమ నత్తనడకన కొన సాగుతోంది. ప్రక్రియ చివరి దశకు చేరుకున్నప్పటికీ.. ఈ నెల 26 వరకు ఉన్న అధికారిక గణాంకాల ప్రకారం జిల్లాలో మొత్తం 1,17,587 నమోదులు పూర్తయ్యాయి. ఇంకా 19,218 మంది పీఎంకే (ప్రధాన మంత్రి కిసాన్ యోజన)లబ్ధిదారుల నమోదు పెండింగ్‌లోనే ఉంది. ఈ నెల 28న గడువు సమీపిస్తున్నప్పటికీ నమోదు వేగం గణనీయంగా మందగించింది. జిల్లా వ్యాప్తంగా రోజుకు 4,805 మంది నమోదు లక్ష్యంగా నిర్ణయించినప్పటికీ.. గత మూడు రోజులను పరిశీలిస్తే.. 24న 370, 25న 380, 26న మధ్యాహ్నం వరకు కేవలం 127 మాత్రమే నమోదవడం ప్రక్రియ ఎంత నత్తనడకన సాగుతుందో కళ్లకు కడుతోంది. ఈ వేగంతో లక్ష్యం చేరుకోవడం అసాధ్యమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అదే పెద్ద అడ్డంకి

పలు గ్రామాల రైతులు వలస వెళ్లడంతో వారిని ప్రత్యక్షంగా సంప్రదించడం సిబ్బందికి కష్టతరంగా మారింది. కొందరు పట్టణాలకు మారిపోవడంతో మొబైల్ ద్వారా మాత్రమే సంప్రదింపులు జరపాల్సి వస్తోంది. ఫోన్ కాల్స్‌కు స్పందించకపోవడం, సరైన సమాచారం ఇవ్వకపోవడం వంటి సమస్యలు నమోదుకు ఆటంకంగా మారుతున్నాయి.

భారీగా పెండింగ్

మండలాల వారీగా పరిశీలిస్తే తాడికొండలో 1,831, ఫిరంగిపురంలో 1,785, దుగ్గిరాలలో 1,652, పొన్నూరులో 1,515, కొల్లిపరలో 1,457 మంది రైతుల నమోదు ఇంకా పూర్తి కాలేదు. కాకుమాను, చేబ్రోలు, మేడికొండూరు, మంగళగిరి, పెదనందిపాడు తదితర మండలాల్లో కూడా గణనీయ సంఖ్యలో రైతుల నమోదు మిగిలి ఉంది.

భూ రికార్డుల్లో గందరగోళం

ఇంకో కీలక సమస్య భూ యాజమాన్య మార్పులు. కొంతమంది రైతులు ఇప్పటికే తమ భూములు విక్రయించినప్పటికీ, భూ రికార్డుల్లో మాత్రం ఇంకా వారి పేర్లే కొనసాగుతున్నాయి. కొత్త యజమానుల వివరాలు నమోదు కాకపోవడం వల్ల ఫార్మర్ యూనిక్ ఐడీ నమోదు సమయంలో ధ్రువీకరణ సమస్యలు తలెత్తుతున్నాయి. ఒకరికి భూమి లేకపోయినా రికార్డుల్లో పేరు ఉండటం, (మిగతా 8వ పేజీలో)

ఓటీపీలో చిక్కులు

ఫార్మర్ యూనిక్ ఐడీ నమోదు ప్రక్రియలో ఓటీపీ ధ్రువీకరణ తప్పనిసరి కావడంతో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మొబైల్ నంబర్లు మారిపోవడం, పాత నంబర్లు రికార్డుల్లో ఉండటం, నెట్‌వర్క్ సమస్యలతో ఓటీపీలు అందకపోవడం సాధారణంగా మారింది. కొందరు రైతులు ఓటీపీ చెప్పేందుకు నిరాకరించడం కూడా నమోదు ఆలస్యానికి కారణమవుతోంది.



మిర్చియార్డులో మధ్యాహ్న భోజనం ప్రారంభం

వైద్యసేవలకూ ఆధార్

- వచ్చే వారం నుంచి అమల్లోకి

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు వేళాయే

కళల స్థలి.... రంగస్థలి

- నేడు రంగస్థలి 46వ వార్షికోత్సవం
- జాతీయ నాటక పోటీల నిర్వహణ
- మూడు రోజులు...ఏడు నాటికలు

8

వేగంగా విస్తరణ

- ముమ్మరంగా బుడంపాడు, కొలనుకొండ ఆర్వోబీల పనులు



అమరావతికి.. భారత ప్రధాన న్యాయమూర్తి



- 1న రానున్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
- ఏపీ జ్యుడీషియల్ అకాడమి, హైకోర్టు అతిథి గృహానికి శంకుస్థాపన
- ఇప్పటికే పూర్తయిన జడ్జిల బంగ్లాల ప్రారంభోత్సవం
- హాజరు కానున్న గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం,
- పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ మార్చి ఒకటో తేదీన ప్రప్రథమంగా అమరావతి రాజధాని పర్యటనకు రానున్నారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఆయన రాజధానికి చేరుకుని ఏపీ జ్యుడీషియల్ అకాడమి భవనం, హైకోర్టు అతిథి గృహానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తుల కోసం నిర్మించిన రెసిడెన్షియల్ ఎన్‌క్లేవ్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. ఆ తర్వాత అక్కడ జరిగే సభలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబునాయుడుతో కలిసి పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, మంత్రులు, ఇతర జడ్జిలు, హైకోర్టు న్యాయవాదులు, రాజధాని రైతులు, అధికారులు పాల్గొంటారు.

ఆగి..శరవేగంగా సాగుతూ..

అమరావతి రాజధాని ఏర్పడి దాదాపుగా దశాబ్దం పూర్తి అవుతున్నా.. నేటికీ ఏపీ హైకోర్టు తాత్కాలిక భవనంలోనే కొనసాగుతోంది. హైకోర్టులో విధులు నిర్వహించే జడ్జిలు గుంటూరు, విజయవాడలో నివా సం ఉంటున్నారు. వైసీపీ పరిపాలనలో ఏపీ హైకోర్టు శాశ్వత భవనం, జడ్జిల బంగ్లాల నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రజాగ్రహంతో వైసీపీ ప్రభు త్వం కూలిపోవడంతో అమరావతిలో నిలిచిపోయిన పనులన్నీ.. పునఃప్రారంభమయ్యాయి. ఇందుకోసం కూటమి ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తోంది. ఏపీ హైకోర్టు శాశ్వత భవనం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ర్యాఫ్ట్ ఫౌండేషన్ కోసం భారీ కాంక్రీట్ ఫ్లోరింగ్ పనులు రికార్డు సమయంలో సీఆర్డీఏ పూర్తి చేస్తోంది. హైకోర్టు శాశ్వత భవనానికి సమీపంలోనే జడ్జిల కోసం 36 బంగ్లాలను నిర్మిస్తోంది. ఒక్కో బంగ్లా ఆరు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. ఒక క్లబ్ హౌస్‌ని 15 వేల ఎస్ఎఫ్‌టీ విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. జడ్జిల బంగ్లాలు కొన్ని పూర్తి కావడంతో వాటిని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ చేతుల మీదగా ప్రారంభింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

కీలకంగా జ్యుడీషియల్ అకాడమీ..

ఏపీ హైకోర్టు శాశ్వత భవనం సమీపంలో సువిశాలమైన అతిథి గృహాన్ని కూడా (మిగతా 8వ పేజీలో)



రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న చైర్మన్ కోటేశ్వరరావు

గ్రంథాలయ పరిషత్.. నూతన కార్యాలయం ప్రారంభం

తాడేపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి హైవేలోని మహేంద్ర అపార్టుమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ నూతన భవన కార్యాలయం ప్రారంభోత్సవం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మాట్లాడుతూ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు స్వతహాగా కష్టపడి క్రమశిక్షణతో ఈ స్థాయి ఎదిగారన్నారు. ఆయన ఆధ్వర్యంలో రాష్ట్రంలో గ్రంథాలయాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. గ్రంథాలయాల అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటి సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ప్రణాళికలు తయారు చేసి గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యాలరావు, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, చదలవాడ అరవిందబాబు, పౌర గ్రంథాలయ శాఖ సంచాలకుడు కృష్ణమోహన్, గ్రంథాలయ పరిషత్ సభ్యులు, పద్మజ, డాక్టర్ సోమశేఖర్, గ్రంథాలయ సంస్థ వివిధ జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు. జిల్లా ఉమ్మడి గ్రంథాలయ సంస్థల అధ్యక్షుడు పి.విఠల్‌రావు (శ్రీకాకుళం), డి రామకృష్ణ (విజయనగరం), వి సతీష్ (విశాఖపట్నం), సాయిబాబారాజు (తూర్పుగోదావరి), కె నాగరాజు (పశ్చిమ గోదావరి), ఎంఎస్ బేగ్ (కృష్ణా) వందనాదేవి (గుంటూరు), ఎం సుచరిత (పకాశం) శాంతకుమారి (నెల్లూరు), ఆర్ గురవారెడ్డి (చిత్తూరు), భానుప్రకాష్ (కడప), టి నాగేంద్ర (కర్నూలు), వి వెంకట్ (అనంతపురం), కార్యదర్శులు పౌర గ్రంథాలయ శాఖ సిబ్బంది, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : సాయంత్రం 6.20 (శుక్రవారం)

సహరి : ఉదయం 5.10 శనివారం)



8

కొల్లూరు మండలం క్రాప గ్రామంలో గురువారం కోగంటి వారి కుటుంబ సభ్యులు నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ఠ క్రతువును అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల డైరెక్టర్లు కోగంటి భానుప్రకాష్, అనూష దంపతులు, వ్యాపార వేత్త కోగంటి ఈశ్వర్‌చంద్, కృష్ణకుమారి దంపతులతో పాటు తోటకూర శ్రీనివాస్, సంధ్య, జొన్నలగడ్డ మోహనబసవపున్నయ్య, నిర్మల దంపతులు పాల్గొని హోమాధి కార్యక్రమాలు నిర్వహించారు.

తప్పులు లేని మ్యుటేషన్ లక్ష్యం

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): తప్పులు లేని మ్యుటేషన్ లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆర్డీవోలు, డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మ్యుటేషన్ ఒకటికి రెండు సార్లు పరిశీలించి, నిర్దేశిత సమయంలో పూర్తిచేయాలని సూచించారు. పట్టాదారు పాసు పుస్తకాలలో ఎటువంటి తప్పులు లేకుండా చూడాలని సూచించారు. వీధి కుక్కల బెడదపై అందుతున్న ఫిర్యాదులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జనాభా లెక్కల సేకరణ, 2027 ఇళ్ల జాబితా తయారీ, కుటుంబ జనాభా గణన అంశంపై జిల్లా, మున్సిపల్ కార్పొరేషన్, మండల స్థాయి అధికారులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం కలెక్టరేట్‌లో గురువారం ముగిసింది. జిల్లాలో జన గణన విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా, జేసీ

29 కేంద్రాల్లో నీట్ నిర్వహణ

జిల్లాలో తెనాలి, మంగళగిరి, అమరావతిలోని 20 కేంద్రాల్లో మే 3న నీట్ నిర్వహణకు ఏర్పాట్లు చేశామని కలెక్టర్ అన్సారియా తెలిపారు. 1,650 మంది వరకు పరీక్షకు హాజరవుతారని.. ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్‌కు వివరించారు.

జర్నలిస్టు అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ

గుంటూరు జిల్లాలో మీడియా అక్రిడిటేషన్ కార్డులను కలెక్టర్ అన్సారియా లాంఛనంగా కలెక్టరేట్‌లో పంపిణీ చేశారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమంలో మీడియా ప్రతినిధులు భాగస్వామ్యం కావాలన్నారు. అనంతరం డీఆర్‌డీఏ ద్వారా అమల వుతున్న వివిధ కార్యక్రమాలపై పీడీ విజయలక్ష్మి, ఇతర అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశాల్లో జేసీ అశుతోష్ ముఖర్జీ, డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజా వలి, డిప్యూటీ కలెక్టర్‌లు గంగ రాజు, లక్ష్మీకుమారి, ఐ అండ్ పీఆర్ డీడీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



యాలి వాహనంపై శ్రీలక్ష్మీనృసింహస్వామి వారు



గ్రామోత్సవంలో వేషధారణలు

యాలి వాహనంపై లక్ష్మీనృసింహుడు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): శ్రీలక్ష్మీనృసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు గురువారం రాత్రి యాలి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయ దేవేరులతో కలిసి యాలి వాహన రూఢుడైన శ్రీవారు తొలుత ఆలయ మాడ వీధుల్లో విహరించారు. అనంతరం మెయిన్ బజారు మీదుగా మిద్దె సెంటరు వరకు గ్రామోత్సవం జరిగింది. ఈ ఉత్సవానికి మంగళగిరికి చెందిన మురికిపూడి పుష్పవేణి, కుమారులు కైంకర్యపరులుగా వ్యవహరించారు. అర్చక స్వాములు ఉత్సవ విశిష్టతను వివరిస్తూ హింసించే స్వభావం కలిగిన క్రూరులను శిక్షించి, సాధువులను రక్షించగలనని తెలియజేయడానికే యాలి వాహనోత్సవం జరుగుతుందని తెలిపారు. యాలి వాహన రూఢుడైన స్వామివారిని దర్శిస్తే దుర్మార్గుల వల్ల భయం నశిస్తుందన్నారు. దేవస్థానం ఈఓ కె.సునీల్‌కుమార్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. గ్రామోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన దేవతామూర్తుల వేషధారణలు, మహిళా భక్త బృందం కోలాట ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. గురువారం ఉదయం స్వామి వారికి ముత్యాల పల్లకీ సేవ నిర్వహించారు. ఈ ఉత్సవానికి విజయవాడకు చెందిన అంగా ఉపేంద్ర వర్మ, తేజస్వి దంపతులు కైంకర్యపరులుగా వ్యవహరించారు. దేవస్థానం వద్ద గల కళా వేదికలో ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు భక్తులను అలరించాయి. సాంస్కృతిక ఉత్సవాలను మాజేటి సూర్యవేణుగోపాలకృష్ణ పర్యవేక్షించారు.



శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల కేంద్రాలపై దాడులు

- మూడు డెయిరీలలో శాంపిల్స్ సేకరణ, కేసుల నమోదు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆహార భద్రత నియంత్రణశాఖ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని పలు పాల కేంద్రాలపై విస్తృత దాడులు చేపట్టారు. కొన్ని చోట్ల లైసెన్సులు లేకుండా వ్యాపారం చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. అధికారుల దాడుల గురించి తెలుసుకున్న వ్యాపారులు దుకాణాలును మూసివేసి వెళ్లిపోయారు. పొత్తూరివారితోట, గుంటూరువారి తోటలోని నీల వెంకయ్య పాల డెయిరీ, శ్రీనివాసా మిల్క్ పార్లర్, లక్ష్మీ నరసింహా డెయిరీలపై దాడులు జరిపి నెయ్యి, పాలు, పెరుగు శాంపిల్స్‌ను సేకరించారు. ఈ సందర్భంగా జాయింట్ ఫుడ్ కంట్రోలర్ నూతలపాటి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ, ఈ మూడు డెయిరీలలో వ్యాపారులు తమ ఫ్రీజర్లలో ఇథలిన్ గ్లైజర్ లేదని, ఫ్రీజర్ తయారీదారుల నుంచి సర్టిఫికెట్ పొందకుండానే వాటిలో పాలు, పెరుగు నిల్వ చేస్తున్నట్టు తనిఖీలలో గుర్తించామన్నారు. మూడు రోజుల్లో ఈ సర్టిఫికెట్ దాఖలు పరచాలని లేనిపక్షంలో ఆ డెయిరీలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. అంతే గాక పాలు, పెరుగు కవర్‌లపై సరైన వివరాలను ముద్రించకుండానే విక్రయిస్తున్నట్టు గుర్తించామని చెప్పారు. పాలు, పెరుగు కవర్లపై తయారు చేసిన తేది, ముగింపు, బ్యాచ్ నెంబరు, ఐఎఫ్ సీసీ కోడ్ వివరాలను విధిగా ముద్రించాలన్నారు. లేని పక్షంలో భారీ జరిమానాలు, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఫుడ్ లైసెన్స్ విధిగా తీసుకోవాలని, లైసెన్స్ లేకుండా వ్యాపారం చేసే డెయిరీలపై రూ.10 లక్షల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. లైసెన్స్ లేకపోవడం, నిల్వ చేసిన పాలు అమ్మడం వంటి విషయాలను గుర్తిస్తే 94403 79755 నెంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ దాడులలో పశు సంవర్ధక శాఖ జేడీ కేవీవీ సత్యనారాయణ, తనిఖీ అధికారి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





పాలకేంద్రంలో తనిఖీ చేస్తున్న ఆహార భద్రత అధికారులు

బోగస్ రుణాల కేసులో అరెస్టులు

● ఇద్దరికి రిమాండ్ ● పరారీలో నలుగురు

పొన్నూరు, ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పురపాలక సంఘం పరిధిలోని మెప్మా విభాగంలో పొదుపు మహిళల బోగస్ గ్రూపుల ద్వారా రుణాలు స్వాహా చేసిన వారిలో ఇద్దరిని అర్బన్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. మెప్మాలో ఆర్పీగా పని చేసిన నాగ సంధ్య, బోగస్ గ్రూపులో సృష్టించడంలో మధ్యవర్తిగా వ్యవహరించిన సుబ్బారావు అనే వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు పోలీసులు వెల్లండించారు. అయితే ఈ కేసులో నిందితులుగా ఉన్న వైసీపీ పట్టణ అధ్యక్షురాలు మూకిరి అనిల్‌కుమారి, అప్పటి సీఎం ఎం. మేరీ జోత్స్న, రిజ్వానా, ఉష అనే నిందితులు కేసు నమోదు అవ్వగానే అదృశ్యమైనట్లు పోలీసులు గుర్తించారు. వారికోసం శోధిస్తున్నారు. ఎట్టకేలకు వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన బోగస్ రుణాల స్వాహా పర్వంలో.. కేసులు నమోదు కావడంతో పాటు అరెస్టులు కూడా జరుగుతుండడంతో బాధితుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. అంతేకాకుండా 2019-24 మధ్య కాలంలో నమోదైన బోగస్ గ్రూపులన్నింటినీ గుర్తించి రూ. 6 కోట్ల వరకు నగదు స్వాహా చేసిన ప్రతి ఒక్కరిని విచారించి, స్వాహా చేసిన రుణాల నగదు తిరిగి బ్యాంకులకు చెల్లించేలా పోలీసులు కృషి చేయాలని పొదుపు మహిళలు వేడుకుంటున్నారు.

నేటి నుంచి ఏఎన్‌యూ మహిళా ఖోఖో పోటీలు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర కళాశాలల ఉమెన్స్ ఖోఖో పోటీలు నరసరావుపేట పట్టణంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో శుక్ర, శనివారాల్లో జరుగుతాయని ప్రిన్సిపాల్ కపిలవాయి రాజేంద్రప్రసాద్ గురువారం తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొంటాని, ఏఎన్‌యూ ప్రతినిధులు, వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు హాజరు అవుతారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు తెలిపారు. కళాశాల డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు, సూదా సురేష్‌బాబు, పాశం కృష్ణారావు, ఇస్కేపల్లి కృష్ణకిషోర్ పాల్గొన్నారు.

వేర్వేరు చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్ట్

● రూ. 37 లక్షల విలువైన ఆభరణాల స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్, పక్కన నార్త్ డీఎస్పీ మురళీకృష్ణ

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు చోరీ కేసుల్లో ఇరువురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.37 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయ ంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్ నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచి వివరాలు వెల్లడించారు. దుగ్గిరాల పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతలపూడి గ్రామంలో ఈ నెల 19న జరిగిన చోరీ కేసులో గుంటూరులోని నెహ్రూ నగర్‌కు చెందిన ఇమిడాబత్తిన గోపిని అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. అతడి వద్ద నుంచి రూ.20 లక్షల 40 వేల విలువైన 136 గ్రాముల బంగారు ఆభరణాలను, 370 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడు గోపి వృత్తిరీత్యా కార్పెంటర్ అని, వ్యసనాలకు బానిసై నేరాలకు అలవాటు పడ్డాడన్నారు. అలాగే గతేడాది సెప్టెంబర్ 20న దుగ్గిరాలలో జరిగిన మరో చోరీ కేసులో పశ్చిమగోదావరి జిల్లా తణుకుకు చెందిన నిందితుడు చిప్పాడ కేదారేశ్వరరావును అరెస్టు చేశామన్నారు. నిందితుడి వద్ద నుంచి రూ.16 లక్షల 32 వేల విలువైన 101.71 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. అతడిపై మంగళగిరి రూరల్, అత్తిలి, హనుమాన్ జంక్షన్, కైకలూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఐదు చోరీ కేసులున్నాయన్నారు. రెండు చోరీ కేసులను ఛేదించిన నార్త్ డీఎస్పీ మురళీకృష్ణ, మంగళగిరి రూరల్ సీఐ ఏవీ బ్రహ్మం, దుగ్గిరాల ఎస్సై వెంకట్ రవితో పాటు పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు ప్రశంసా పత్రాలు అందించారు.

బీజేపీని అట్టడుగు వర్గాలకు చేరువచేయాలి

● త్వరలో ఎస్సీ, ఎస్టీ ఉపకులాలతో ప్రత్యేక సమావేశం
● రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్


పండిట్ దీన్‌దీయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాధవ్, బీజేపీ నాయకులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని అట్టడుగు వర్గాలకు బీజేపీని చేరువ చేయాలని కార్యకర్తలకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. గుంటూరులోని లాలుపురంలో ఉన్న వాజ్‌పేయి భవనంలో మూడు రోజుల పాటు జరిగే గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల దీన్ దయాళ్ ఉపాధ్యాయ వక్తల ప్రశిక్షణ మహా అభియాన్ కార్యక్రమాన్ని గురువారం ఆయన ఘనంగా ప్రారంభించారు. తొలుత దీన్‌దీయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి మాధవ్ నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రశిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. సిద్ధాంతం ప్రకారం రాజకీయాలను ప్రజలకు అందించాలనే ధ్యేయంగా ఈ తరగతులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సేవలతోనే పార్టీ బలోపేతమవుతుందని అభిప్రాయపడ్డారు. అధికారమే పరమావధిగా పనిచేయకూడదని కార్యకర్తలకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. జనతా వారధి ద్వారా అనేక ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలను పరిష్కరించామని అన్నారు. స్వాతంత్రం అనంతరం దేశవ్యాప్తంగా జాతీయ పార్టీగా జాతీయ వాదానికి మద్దతుగా 3.1 శాతం ఓట్లు సాధించామని గుర్తుచేసుకున్నారు. గత 11ఏళ్లుగా వికసిత్ భారత్ ప్రధానంగా అన్ని రంగాల్లో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. అట్టడుగు, అణగారిన వర్గాలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించేందుకు త్వరలోనే ఎస్సీ, ఎస్టీ ఉపకులాలతో రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టికల్ 370, రామ మందిర నిర్మాణం, డిజిటల్ ఇండియా, జన్‌ధన్, ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి, స్వచ్ఛ భారత్ వంటి పథకాలను ప్రధాని మోదీ విజయవంతం చేశారని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో జెండా దిమ్మె ఏర్పాటు చేసి, ఆ దిమ్మెకు జియో ట్యాగ్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. రానున్న రోజుల్లో ప్రతి బూతులో బీజేపీ కార్యకర్త ఉండేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ కేశవకాంత్ ప్రసంగించగా, కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, మకుటం శివ, బిట్రా శివన్నారాయణ, జూపూటి రంగరాజు, దర్శనపు శ్రీనివాస్, అడ్డూరి శ్రీరామ్, చంద్రశేకర్, హరి పావని, దేసు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కాలువ గట్టును ఆక్రమించి ప్లాట్లు

● అడ్డుకున్న ఎన్ఎస్పీ ఏఈఈ, కొండవీడు మేజరు డీసీ చైర్మన్


గోపాలపురం వద్ద కొండవీడు మేజరు కాలువ కట్ట మధ్యన వేసిన హద్దు రాళ్లు

యడ్లపాడు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కొండవీడు మేజరు కాలువ ఆక్రమించి ప్లాట్లు వేస్తున్న విషయాన్ని తెలుసుకున్న అధికారులు గురువారం అడ్డుకున్నారు. మండలంలోని సంగంగోపాలపురం పరిధిలో గుంటూరుకు చెందిన ఓ స్థిరాస్తి వ్యాపారి సుమారు 8 ఎకరాల భూమిని 2013లో కొనుగోలు చేశాడు. ఇటీవల సదరు భూమిలో వెంచర్ ఏర్పాటుకు పనులు ప్రారంబించి మేజరు కాలువ గట్టు మధ్యన హద్దు రాళ్లను ఏర్పాటు చేశాడు. అంతేగాకుండా ప్లాట్లకోసం భూమిని యంత్రాలతో చదును చేసే పనులను ప్రారంభించాడు. నీటి ప్రవాహాన్ని పర్యవేక్షిస్తూ అక్కడకు చేరుకున్న లష్కర్ సుబ్బారావు, వర్క్ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు కాలువ గట్టు మధ్యలో రాళ్ల పాతి ఉండడాన్ని గమనించి.. ఎన్ఎస్పీ కెనాల్ ఏఈఈ నందిని కుమారికి సమాచారం అందించారు. దీనితో ఏఈఈ, కొండవీడు మేజరు డీసీ చైర్మన్ పున్నారెడ్డితో కలసి ఆక్రమణకు గురైన కాలువ గట్టును గురువారం పరిశీలించారు. గుంటూరుకు చెందిన ఆవోపానగర్ వెల్ఫేర్ సొసైటీకి చెందిన స్థిరాస్తి వ్యాపారులు ఈ ప్లాట్లు వేస్తున్నట్లుగా గుర్తించి.. వారిని పిలిపించి మాట్లాడారు. తాము సర్వేకు దరఖాస్తు చేసుకోగా విలేజ్ సర్వేయర్ సర్వే చేసి కాలువ గట్టు మధ్యన గుర్తులు పెట్టగా అక్కడ హద్దు రాళ్లు ఏర్పాటు చేశామన్నారు. దీనితో డీసీ చైర్మన్, ఏఈలు తమకు సమాచారం ఇవ్వకుండా సర్వే చేయడమే కాకుండా కాలువ గట్టుపై హద్దు రాళ్లు ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్తుల జోలికి వస్తే ఊరుకునేది లేదని అందుకు కారకులైన వారిపై కేసులు పెడతామని హెచ్చరించారు. రెవెన్యూ, ఎన్ఎస్పీ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, తిరిగి ఉమ్మడిగా రీసర్వే నిర్వహించాల్సి ఉందని, అప్పటి వరకు ఎలాంటి పనులు నిర్వహించవద్దని స్థిరాస్తి వ్యాపారికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా డీసీ చైర్మన్ మాట్లాడుతూ సుమారు కాలువ 40 మీటర్ల నుంచి 60 మీటర్ల వరకు ఉంటుందని, ఇక్కడ సుమారు 45 మీటర్ల వరకు ఉండవచ్చని చెప్పారు.

కాసు వచ్చి వెళ్లిన.. కొన్ని గంటలకే దాడి

● వైసీపీ మూకలు దాడులు ఆపట్లేదు
● టీడీపీ బీసీ నేతల ఆగ్రహం


విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ బీసీ నేతలు

గురజాలటౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి బుధవారం గురజాల పట్టణానికి వచ్చి వెళ్లిన.. కొన్ని గంటలకే టీడీపీ సీనియర్ నేత బత్తుల ఏడుకొండలుపై దాడి జరిగిందని టీడీపీ బీసీ నేతలు ఆరోపించారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంతోపాటు గురజాల నియోజకవర్గంలో ఎన్నో అరాచకాలు సృష్టించి ఎంతోమంది టీడీపీ నేతలను పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. బీసీలపై ఎన్నో దాడులు చేశారని, అరాచక ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడి ఇంటికి తరిమారన్నారు. అయినప్పటికీ వైసీపీ నేతలకు సిగ్గు రాకపోగా టీడీపీ నేతలపై దాడులకు దిగుతున్నారని మండిపడ్డారు. మహేష్‌రెడ్డి వాళ్ల పార్టీ నేతలను రెచ్చగొట్టి దాడి చేయించారని ఆరోపించారు. తమ నేత ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు నియోజకవర్గం ప్రశాంతంగా ఉండాలని కోరుకుంటున్నారని, అందుకే తాము సంయమనం పాటిస్తున్నామన్నారు. బీసీ నేతలు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	148, 157, 168
చికెన్ విత్ స్కిన్(కిలో)	284.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	294.00

మిర్చియార్డు సమాచారం
(గురువారం ధరలు)

వచ్చిన బస్తాలు	76,561	
అమ్మకాలు	74,409	
నిల్వ	25,292	
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13500	21000
నెంబరు. 5	13500	21000
273	----	----
341	14000	21500
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	18300
షార్క్-1	-----	----
బ్యాడిగి	14000	21000
దేవనూరు డీలక్స్	15500	21500
ఆర్మూరు	13000	16500
ఏసీ కామన్ వెరైటీ		
334	13000	19500
నెంబరు. 5	13000	20000
273	----	----
341	14000	20500
4884	----	----
సూపర్ 10	----	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	17200
బ్యాడిగి 355	14000	20500
దేవనూరు డీలక్స్	----	----
తాలుకాయలు	7500	12000

భారత్ ట్రేడ్ డీల్‌తో వ్యవసాయరంగం నిర్వీర్యం

● గుంటూరు రౌండ్ టేబుల్ సమావేశంలో నేతలు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి
వేదికపై మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అమెరికాతో భారత్ ట్రేడ్ డీల్‌తో దేశంలో వ్యవసాయ రంగం నిర్వీర్యమయ్యే ప్రమాదముందని పలువురు నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల గుంటూరులోని కాంగ్రెస్ కార్యాలయంపై బీజేపీ యువ మోర్చా దాడి చేసిన నేపథ్యంలో పలు రాజకీయ, ప్రజా సంఘాల నాయకులతో ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి ఆధ్వర్యంలో గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఉడా మాజీ ఛైర్మన్ వణుకూరి శ్రీనివాసరెడ్డి పలు యువజన, ప్రజా సంఘాల నాయకులు బీజేపీ యువమోర్చా దాడిని ముక్త కంఠంతో ఖండించారు. మస్తాన్‌వలి మాట్లాడుతూ ఢిల్లీలో ఇటీవల జరిగిన ఏఐ సమ్మిట్‌లో రూ. 350 కోట్లు ఖర్చుతో రోబో తయారు చేశామని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి దేశ ప్రజల పరువు తీసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు. ప్రశ్నించిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలపై కోడిగుడ్లు, రాళ్ళతో బీజేపీ దాడులకు తెగపడటం ఆ పార్టీ పిరికి పంద చర్యలకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే దేశ రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధరల్లేక విలవిల్లాడుతుంటే అమెరికాతో భారత్ డీల్ కుదుర్చుకోవటం మరింత నష్టమేనన్నారు. పార్టీ కార్యాలయాలపై దాడులు దేశంలో రాజకీయ వ్యవస్థకే ముప్పు అని ఆందోళన వ్యక్తం చేశారు.

గడువు గండం!

(5వ పేజీ తరువాయి)

మరొకరికి భూమి ఉన్నా పేరు నమోదు కాకపోవడం వంటి విరుద్ధ పరిస్థితులు అధికారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

ఒత్తిడిలో వ్యవసాయ శాఖ సిబ్బంది

రోజుకు 4,805 నమోదు లక్ష్యాన్ని చేరుకోవాల్సిన బాధ్యత ఒకవైపు ఉండగా, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు మరోవైపు వ్యవసాయ శాఖ అధికారులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నాయి. గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించినా స్పందన తక్కువగా ఉంది. రికార్డు లోపాలు సరిచేయడానికి సమయం పట్టడం, రైతుల గైర్హాజరు వంటి అంశాలు నమోదును నెమ్మదింపజేస్తున్నాయి.

పథకాలపై ప్రభావం

ఫార్మర్ యూనిక్ ఐడీ నమోదు పూర్తికాకపోతే పీఎంకేసహా పలు ప్రభుత్వ పథకాల లబ్ధి పొందడంలో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. గడువు దగ్గరపడుతున్న నేపథ్యంలో తక్షణ చర్యలు తీసుకోకపోతే వేలాది మంది రైతులు లబ్ధికి దూరమయ్యే ప్రమాదం ఉంది.

అత్యవసర చర్యల అవసరం

భూరికార్డుల సవరణ, మొబైల్ నంబర్ల నవీకరణ, గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక నమోదు శిబిరాలు. ఇవన్నీ సమన్వయంతో అమలు చేయాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. లేకపోతే 19,218 పెండింగ్ నమోదు గడువు లోపు పూర్తి కావడం కష్టమేనని స్పష్టమవుతోంది. ఫార్మర్ యూనిక్ ఐడీ నమోదు కార్యక్రమం రైతులకు ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో ప్రారంభమైనప్పటికీ, అమలు దశలో ఏర్పడిన సమస్యలు అధికార యంత్రాంగానికి పెద్ద సవాలుగా మారాయి. గడువు సమీపిస్తున్న ఈ సమయంలో సమగ్ర చర్యలే పరిష్కారమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వైద్య రంగంపై ఆసక్తి కలిగించేలా..

వైజ్ఞానిక ప్రదర్శన: కలెక్టర్ అన్సారియా


ప్రదర్శనలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన వైద్య వైజ్ఞానిక ప్రదర్శన ఎంతో విజ్ఞానదాయకంగా ఉందని, విద్యార్థులు తప్పనిసరిగా దీనిని తిలకించాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ జీఎంసీలోని మెడికల్ ఎగ్జిబిషన్ మెడ్ ఫ్యూజ్ 26ను సందర్శించారు. ప్రదర్శన ఆసాంతం తిలకించి, పిల్లల్లో వైద్య రంగం పట్ల ఆసక్తి కలిగించేంలా చక్కగా ఏర్పాటు చేశారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారిని అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుందరాచారి వైద్య విజ్ఞాన ప్రదర్శనలో పలు అంశాలను కలెక్టర్ కు వివరించారు. సాధారణ వ్యాధులు, రక్తపోటు, మధుమేహం, వడదెబ్బ, ప్రమాదాలు, సర్పాల కాటు నుంచి అనాటమీ, ఫోరెన్సిక్ మెడిసిన్, న్యూరాలజీ, కిడ్నీ, కేన్సర్ వ్యాధులు తదితర విభాగాలు, శరీర అవయవ నిర్మాణం, విద్యార్థులకు బోధన వంటివి వివరించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు కలెక్టర్‌తో కలసి ప్రదర్శన ఆసక్తిగా తిలకించారు. ప్రదర్శన శనివారంతో ముగుస్తుందని, అందరూ దీనిని వినియోగించుకోవాలని జీఎంసీ వర్గాలు కోరాయి.

ఒంగోలు జాతి

పశు సంపదను పరిరక్షించుకోవాలి

● ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 26 (ఆంధ్ర జ్యోతి): ఒంగోలు జాతి పశు సంపదను పరిరక్షించుకోవాలని, పశు పోషకులను ప్రోత్సహించాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. తెనాలి మార్కెట్ యార్డులో నిర్వహించనున్న ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన ఏర్పాట్లకు ఆయన గురువారం భూమి పూజ చేశారు. మార్చి 29 నుంచి ఏప్రిల్ 4 వరకు వారం రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లోని ఎడ్ల జతలు వివిధ విభాగాల్లో బలప్రదర్శనలో పాల్గొంటాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టీడీపీ ఆవిర్భావం పురస్కరించుకుని ఏటా ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఒంగోలు జాతి ఎడ్ల ప్రాధాన్యతను నేటి తరంతో పాటు.. భావి తరాలకు కూడా అందించే ఉద్దేశంతో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎడ్ల బల ప్రదర్శనతో పాటు రైతులకు ఉపయోగపడే సాంకేతిక యంత్రాలు, సోలార్ విద్యుత్, విత్తన సంస్థల ఉత్పత్తుల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. నాయకులు పాలడుగు సురేంద్ర, కోగంటి రోహిత్, సుంకర హరికృష్ణ, డాక్టర్ శేషగిరిరావు, బోయపాటి అరుణ, రమ్య, రమాదేవి, నలుకుర్తి రమేష్, యలవర్తి నాగేశ్వరరావు, వీరవల్లి మురళి, జొన్నాదుల మహేష్, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, ఈదర వెంకటపూర్ణచంద్ పాల్గొన్నారు.

మార్చి నెలాఖరుకు రికవరీలు పూర్తి చేయాలి

● జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ మక్కెన, సీఈవో ఫణికుమార్

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు బ్రాంచ్‌లలో రుణ బకాయిల రికవరీలను మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలని బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు కోరారు. గుంటూరు బ్రాడీపేటలోని ఎన్‌టీఆర్ సహకార భవన్‌లో గురువారం బ్యాంకు మేనేజర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో బ్యాంకు బ్రాంచ్‌ల వారీగా వివరాలు సేకరించారు. ఆయా బ్రాంచ్‌లలో ఉన్న బకాయిలను వెంటనే రికవరీ చేయాలని స్పష్టం చేశారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. దీనిపై ఇప్పటికే ప్రత్యేక అధికారులను కూడా నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవో వీవీఎస్ ఫణికుమార్ పలువురు మేనేజర్లు ఉన్నారు.

నేడు డీసీసీబీ, డీసీఎంఎస్‌లో మహాజన సభలు

గుంటూరు బ్రాడీపేటలోనున్న ఎన్‌టీఆర్ సహకార భవన్‌లో చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు అధ్యక్షతన డీసీసీబీ మహాజన సభ శుక్రవారం నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలోని సభ్యులంతా హాజరుకానున్నారు. అలానే కోర్టు రోడ్డులోనున్న జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ కార్యాలయంలో చైర్మన్ వడ్రాణం హరిబాబు అధ్యక్షతనా.. మహాజన సభ జరుగుతుందని కార్యాలయ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు.

30శాతం ఐఆర్ తక్షణం ప్రకటించాలి

● ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : వెంటనే 12వ పీఆర్‌సీ కమీషన్‌ను నియమించి, 30 శాతం మధ్యంత భృతి ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి.. ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపే మేరకు 26, 27 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని తాలూకా కేంద్రాలలో భాగంగా నరసరావేపేటలో గురువారం ధర్నా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి బి. ప్రజామూర్తి అధ్యక్షత వహించారు. మక్కెన శ్రీనినవాసరావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి నిలబెట్టుకోలేదని, రివర్స్ పీఆర్‌సీ ద్వారా ఉద్యోగులు, ఉపాధ్యాయులను మోసం చేసిందని విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా అదే విధానాలను కొనసాగాస్తూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లను నిరాశపరుస్తుందన్నారు. జూలై 2023 నుంచి అమలులోకి రావాల్సిన 12వ పీఆర్‌సీ గడుడు ముగిసి 30 నెలలు దాటినా ఇప్పటికి పీఆర్‌సీ కమిషన్‌ను నియమించడపోవడం దురదృష్టకరమన్నారు. ధరల సూచీ ప్రకారం కేంద్ర ప్రభుత్వం వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రతి ఆరు నెలలకు కరువు భత్యం విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణం చెల్లించాలని కోరారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు 57 జీవో ప్రకారం పాతపెన్షన్ వర్తింపజేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి బాళ్ళ శ్రీనివాసరావు కోరారు. ధర్నా అనంతరం నరసరావుపేట తహసీల్దార్‌కు 44 డిమాండ్‌తో కూడిన వినతి పత్రం అందజేశారు.

గుంటూరు సిటీ వార్తలు

• గుంటూరు తూర్పు • పశ్చిమ

కేవీలో కాంట్రాక్టు పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడులోని పీఎం శ్రీకేంద్రీయ విద్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిలో పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బొంతా శేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న ప్రైమరీ టీచర్స్, బాలవాటిక, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, నర్సు, ఎడ్యుకేషనల్ కౌన్సిలర్, తెలుగు టీచర్ పోస్టులకు, మార్చి 2న పీజీటీ ఇంగ్లీష్, హిందీ, బయాలజీ, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, టీజీటీ ఇంగ్లీషు, హిందీ, సంస్కృతం, సోషల్, మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆయా పోస్టులకు నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు. ఇతర వివరాల కోసం గుంటూరు.కేవీఎస్.ఎస్‌.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

నేడు ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా చేస్తున్న ఆందోళనల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం 4 గంటలకు గుంటూరులోని ఈఓ సెల్లార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖలీద్, గుంటూరు జోన్ కన్వీనర్ పి.నాగశివన్నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్నాకు రాష్ట్ర కౌన్సిలర్లు, ఆడిట్ కమిటీ సభ్యులు, మండల స్థాయి నాయకులు హాజరుకావాలని కోరారు.

గ్యారేజ్ తరలింపు నిర్ణయాన్ని ఉపసంహరించాలి

● జేఏసీ చైర్మన్ అమర్‌నాథ్

గుంటూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): గుంటూరు-2 డిపో గ్యారేజ్, డిపోలోని సర్వీసుల తరలింపు నిర్ణయాన్ని ఆర్టీసీ యాజమాన్యం వెంటనే ఉపసంహరించుకోవాలని గుంటూరు-2 డిపో గ్యారేజ్ పరిరక్షణ సమితి జేఏసీ చైర్మన్ వి.అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. డిపో గ్యారేజ్ తరలింపును ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో ఆయన ప్రసంగించారు. ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ పేరుతో ఆర్టీసీ గ్యారేజీలను ప్రైవేటు వారికి దారాదత్తం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీయే కొనుగోలు చేసి సొంతంగా నిర్వహణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ ఎస్‌వీ దత్తు, ఉద్యోగులు నారాయణ, పీఆర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సినీ సాంకేతిక నిపుణులపై ఏఐ తీవ్ర ప్రభావం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సినీ సాంకేతిక నిపుణుల ఉపాధిని ఏఐ టెక్నాలజీ తీవ్రంగా దెబ్బకొడుతోందని సినీ దర్శకుడు బీవీఎస్‌రాజా అన్నారు. స్థానిక అరండల్‌పేటలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏఐ టెక్నాలజీ ఇప్పటికే సంగీత దర్శకులకు పనిలేకుండా పోయిందన్నారు. భవిష్యత్తులో ఆర్టిస్టులతో అవసరం లేకుండానే సినిమా తయారవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఏఐ దృశ్యాలుంటే సెన్సార్ చేయకుండా నిర్దిష్టమైన నియమాలను ఆచరణలో పెట్టాలని సెంట్రల్ బోర్డు ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికెట్ పనస సభ్యులను కోరనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అచ్చన శ్రీనివాస్ యాదవ్, గాజులపల్లి రామయ్య పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కళాకారుల సంఘం నాయకులు

రేపటి నుంచి పౌరాణిక పద్య నాటక ప్రదర్శనలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పౌరాణిక కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గుంటూరు వేంకటేశ్వర విజ్ఞానమందిరంలో ఈ నెల 28నుంచి రెండురోజులపాటు ఉచిత పౌరాణిక పద్యనాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు నల్లక శ్రీనివాసరావు తెలిపారు. విజ్ఞాన మందిరం ఆవరణలో గురువారం పోస్టర్లను ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. ప్రదర్శనల్లో భాగంగా 28న గణపతి మహత్యం, గయోపాఖ్యానం, రామాంజనేయ యుద్ధం, సత్యహరిశ్చంద్ర (అడవి సీను), పాత పాటలతో సినీ సంగీత విభావరి, 1న బాలనాగమ్మ, సత్య హరిశ్చంద్ర(పూర్తినాటకం) ప్రదర్శనలు జరుగుతాయని తెలిపారు. ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో హాజరై నాటక ప్రదర్శనలను తిలకించి, కళాకారులను ఆశీస్సులు అందించాలని కోరారు. కార్యక్రమంలో జి.శివరావు, కృష్ణారావు, ప్రసాదుచౌదరి, నారాయణ, సుబ్బారావు, సాంబశివరావు, మీరావలి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపు ఓఆర్ఆర్ ప్రభావిత రైతుల సదస్సు

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రైతు సంఘం ఆధ్వర్యంలో పాత గుంటూరు, సీఐటీయూ కార్యాలయంలో ఈ నెల 28న ఔటర్ రింగ్ రోడ్డు ప్రభావిత రైతుల సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ తెలిపారు. బ్రాడీపేట సీపీఎం కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజధాని పరిధిలోని 190 కిలోమీటర్లలో 121 గ్రామాలకు చెందిన 23 మండలాల్లో భూసేకరణకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు చెప్పారు. అయితే భూములు కోల్పోతున్న రైతులకు ఏ విధి, విధానాలు తెలియకపోవడం బాధాకరమన్నారు. బలవంతపు భూసేకరణయితే రైతుల నుంచి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. విలువైన భూములను కారుచౌకగా రైతులు ఇవ్వడానికి సిద్ధంగా లేరని స్పష్టం చేశారు. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లేందుకు ఏర్పాటు చేసిన ఈ సదస్సులో రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో తమ్మిశెట్టి అప్పారావు, కానుమాను నాగేశ్వరరావు, బొట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'పారాక్వాట్' గడ్డిమందును నిషేధించాలి

● ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



శాసనసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆత్మహత్యలకు కారణమవుతున్న ప్రాణాంతక గడ్డి మందు (పారాక్వాట్)ను తక్షణమే నిషేధించాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రభుత్వాన్ని కోరారు. వెలగపూడి శాసనసభలో జరుగుతున్న బడ్జెట్ సమావేశాల జీరో అవర్ సందర్భంగా గురువారం ఆమె ఈ కీలక అంశాన్ని సభ దృష్టికి తీసుకువచ్చారు. 'పారాక్వాట్' గడ్డి మందు అయినప్పటికీ, ఇది 'సైలెంట్ కిల్లర్'గా మారిందన్నారు. ఆత్మహత్య నిర్ణయాల్లో ఈ గడ్డి మందు ప్రధాన సాధనంగా మారుతోందని, దీన్ని కేవలం 5 ఎంఎల్ తీసుకున్నా శరీరంలోని కీలక అవయవాలు పూర్తిగా దెబ్బతిని ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. పారాక్వాట్ సులభంగా తక్కువ ధరకే అందుబాటులో ఉండడం, దీనికి సరైన విరుగుడు (యాంటీడోట్) లేకపోవడం వలన ఇది అత్యంత ప్రమాదకరంగా మారిందని గళ్ళా మాధవి ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రాణాంతక మందుపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

గుంటూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే గళ్ళా మాధవి గురువారం పంపిణీ చేశారు. వివిధ రకాల వ్యాధులతో బాధపడుతూ వైద్యం చేయించుకొని ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని, అవసరంలో ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం తోడుగా నిలుస్తుందన్నారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, అర్హులైన ప్రతి ఒక్కరూ సీఎం రిలీఫ్ ఫండ్‌ను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.



మైనార్టీ అధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు తూర్పులో అభివృద్ధికి సహకరించండి

● ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గంలో పీఎంజేవీకే ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని మైనార్టీ వెల్ఫేర్ ఎండీకి ఎమ్మెల్యే నసీర్ సూచించారు. గురువారం నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్‌ను మైనార్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి పార్థసారథి కలిశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి జన వికాస్ కార్యక్రమం ద్వారా చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలపై వారు చర్చించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు పూర్తి సహకారం అందించాలన్నారు. వీటికి సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని ఎమ్మెల్యే నసీర్ సూచించారు.

కాలువలో యువకుడి గల్లంతు

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంగళాయపాలెం కాలువలో ఓ యువకుడు గల్లంతయ్యాడు. పెదకాకాని జాన్ ఆసర కాలనీకి చెందిన నంద్యాల దయాకర్ బుధవారం తన స్నేహితులతో కలిసి వెంగళాయపాలెం కాలువలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో నీటిలో మునిగి కాలువలో కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు కాలువ వద్దకు చేరుకొని గాలింపు చేపట్టారు. అయితే దయాకర్ ఆచూకీ లభించలేదు. దయాకర్ మట్టి పనులకు వెళుతుంటాడని, అతనికి వివాహమై భార్య ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థినిపై యువకుడి అత్యాచారం

నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓబులునాయుడుపాలెంలో పదో తరగతి బాలికపై అదే గ్రామానికి చెందిన నాగరాజు అనే యువకుడు మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక ఇంటి సమీపంలో ఉండే నాగరాజు ఏడు నెలలుగా ఆమె స్కూలుకు వెళ్లి వచ్చే సమయంలో వెంటపడుతూ మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. మాయమాటలు చెప్పి నాగరాజు అనేకసార్లు బాలికపై అత్యాచారానికి ఒడిగట్టాడు. అదే ప్రాంతానికి చెందిన వరలక్ష్మి అనే మహిళ కూడా నాగరాజుకు సహకరిస్తే డబ్బులు, దుస్తులు, చెప్పులు, చాక్లెట్లు ఇస్తాడని బాలికను ప్రలోభాలకు గురిచేసింది. గత నెలలో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఒంటరిగా ఉన్న బాలికపై అత్యాచారం చేసేందుకు ప్రయత్నించగా ఆమె కేకలువేసింది. దీంతో నాగరాజు పారిపోయాడు. బాలిక విషయం తల్లికి చెప్పడంతో ఆమె నల్లపాడు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదుచేసింది. పోలీసులు పోక్సో కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ పోలీసులకు కళ్ళజోళ్ళు అందజేత

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డులో గల డాక్టర్ అగర్వాల్ హాస్పిటల్ నగరంలోని ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీసులకు కళ్ళజోళ్ళు, వాటర్ బాటిళ్లు, క్యాప్‌లు అందజేసింది. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏరాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ అగర్వాల్ ఆస్పత్రి వైద్యులు ఎస్పీ చేతుల మీదుగా ట్రాఫిక్ పోలీసులకు కిట్ అందించారు. ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈస్ట్, వెస్ట్ ట్రాఫిక్ సీఐలు ఆకుల అశోక్ కుమార్, సింగయ్య, ట్రాఫిక్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

రిలయన్స్ స్మార్ట్‌లో 11 కిలోల జీడిపప్పు చోరీ

స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం స్మార్ట్‌లో ముగ్గురు మహిళలు 11 కిలోల జీడిపప్పు చోరీకి పాల్పడ్డారు. చీరాల రాంనగర్‌కు చెందిన వీరు గురువారం స్మార్ట్‌మాల్‌కు వచ్చారు. ఇరువురు మహిళలు అడ్డు ఉండగా మరో మహిళ జీడిపప్పు ప్యాకెట్లను లోదుస్తుల్లో అమర్చుకున్న ప్రత్యేక జేబులో సర్దుకుంది. సీసీ కెమెరా ద్వారా గమనించిన సిబ్బంది ముగ్గురు మహిళలు బయటకు వెళ్తుండగా పట్టుకున్నారు. వారిని శోధన చేయగా ఓ మహిళ వద్ద 11 కిలోల జీడిపప్పు ప్యాకెట్లు లభ్యమయ్యాయి. రిలయన్స్ స్మార్ట్ స్టోర్ మేనేజర్ గౌస్ మొహీద్దీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగైన బోధన అందించాలి

● డీఈవో డాక్టర్ ఎస్‌కే సలీమ్ బాషా



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో డాక్టర్ ఎస్‌కే సలీమ్ బాషా

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సమర్థ్యాలు పెంపొందేలా మెరుగైన బోధన అందించాలని డీఈవో డాక్టర్ ఎస్‌కే సలీమ్ బాషా ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం స్థానిక కేవీపీ కాలనీలోని కేఎస్ఆర్‌టీఎం మున్సిపల్, లాల్‌పురంలోని జడ్పీ స్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలు పెంపు వల్ల వారు ఉన్నత తరగతుల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తారని తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు రూపొందించిన 100 రోజుల ప్రణాళిక సక్రమంగా అమలు చేయాలని, మార్చి నెల నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు 10వ తరగతి సిలబస్ బోధించాలని సూచించారు. ప్రాథమిక పాఠశాలల్లో జీఎఫ్ఎల్ఎస్ శిక్షణను మెరుగ్గా ఇవ్వాలని సూచించారు.

సీఆర్డీఏ జాబ్‌మేళాలో 104 మందికి ఉద్యోగాలు



జాబ్ మేళాలలో ఆఫర్ లెటర్లు అందజేస్తున్న సీఆర్డీఏ అధికారులు

తుళ్లూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఆర్డీఏ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ సౌజన్యంతో తుళ్లూరులోని సీఆర్డీఏ స్కిల్ హబ్ ప్రాంగణంలో గురువారం జాబ్‌మేళా జరిగింది. పలు కంపెనీలలో 500 ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ఈ జాబ్‌మేళాను నిర్వహించారు. మేళాకు 318 మంది అభ్యర్థులు హాజరు కాగా 104 మందికి ఉద్యోగాలు లభించాయి. మరొక 31 మంది తదుపరి రౌండుకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీఆర్డీఏ సోషల్ డెవలప్‌మెంట్ విభాగ డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు, సీనియర్ లవ్లీహుడ్ ఆఫీసర్ శంకర్, జూనియర్ లవ్లీహుడ్ స్పెషలిస్టులు క్రాంతి కుమార్, వెంకటేశ్వర్లు, వరాహ నరసింహం సీఆర్డీఏ విలేజ్ ఫెసిలిటేటర్లు పాల్గొని జాబ్ మేళాను సమర్థవంతంగా నిర్వహించారు. జాబ్ మేళాకు హాజరైన అభ్యర్థుల సౌకర్యార్థం సిబ్బందిని నియమించి రిజిస్ట్రేషన్, ఇంటర్వ్యూల నిర్వహణ ప్రక్రియ సాఫీగా నిర్వహించారు. ఉద్యోగాలకు ఎంపికైన పలువురు అభ్యర్థులకు ఆఫర్ లెటర్‌లు ఏపీ సీఆర్డీఏ అధికారులు అందజేశారు.

జనసేన అభ్యున్నతికి ఉద్యమిద్దాం: నాయబ్ కమాల్



పార్టీ సభ్యత్వ నమోదు శిబిరంలో నాయబ్ కమాల్

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ భావజాలం, సిద్ధాంతాలు నచ్చి స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వం స్వీకరిస్తున్న ఉద్యమిలకు అభినందనలు తెలియజేస్తున్నామని జనసేన రాష్ట్ర కార్యదర్శి నాయబ్‌కమాల్ తెలిపారు. గురువారం పాతగుంటూరులోని 8వ డివిజన్‌లో పార్టీ నాయకుడు దురశాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు ప్రక్రియను ఆయన ప్రారంభించారు. దేశవ్యాప్తంగా గురువారం నుంచి జనసేన పార్టీ సభ్యత్వ నమోదు శిబిరాలను ప్రారంభించినట్లు నాయబ్ కమాల్ తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 12.60 లక్షల మంది సభ్యులు ఉన్నారని, దీనిని 25 లక్షలకు పెంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం నాయబ్ కమాల్‌తో పాటు పార్టీ నేతలు స్థానికంగా విస్తృతంగా పర్యటించి దుకాణదారులు, చిరు వ్యాపారులు, యువతతో ప్రత్యక్షంగా మమేకమై జనసేన పార్టీ సిద్ధాంతాలను వివరించారు. పార్టీ సభ్యత్వం పొందటం వల్ల కలిగే ఇన్స్యూరెన్స్ ప్రయోజనాలను తెలియజేశారు. పలువురు వ్యాపారులు, యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సభ్యత్వం నమోదు చేసుకున్నారు. పాత గుంటూరులో మొత్తం మూడు ప్రాంతాల్లో సభ్యత్వ నమోదు శిబిరాలను ఏర్పాటు చేసిన దురశాల శ్రీనివాసరావును కమాల్ అభినందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నారదాసు ప్రసాద్, అన్నం వెంకట్రావు, లక్ష్మీనారాయణ, లక్ష్మీశెట్టి రమేష్, నాగేంద్ర, ఉయ్యూరి సతీష్, లక్ష్మీశెట్టి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

భద్రతా ఏర్పాట్లు సమీక్షించిన ఎస్పీ

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తుళ్లూరు మండలం దొండపాడు శివారులోని పిచ్చుకులపాలెం వద్ద మార్చి 1న నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ జ్యూడీషియల్ అకాడమీ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ మేరకు గురువారం భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. కార్యక్రమం జరిగే ప్రదేశాన్ని సందర్శించిన ఎస్పీ వేదిక, ప్రవేశ మార్గాలు, పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ నియంత్రణ, వీఐపీ భద్రత, బారికేడ్లు ఏర్పాటు చేయవలసిన తీరు గురించి సమగ్రంగా ఆరా తీశారు. ఎస్పీతో తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బీ సీఐలు రాంబాబు, శ్రీహరి, తుళ్లూరు సీఐ శ్రీనివాసరావు, తుళ్లూరు ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు, సీఐ -2 మాతంగి శ్రీనివాసరావు ఉన్నారు.

సీపీఐ నాయకుడు నల్లకన్నుకు ఘన నివాళులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధుడు, సీపీఐ నాయకుడు, తమిళనాడు గాంధీగా పిలుచుకునే ఆర్ నల్లకన్నుకు సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. కొత్తపేట సీపీఐ కార్యాలయంలో జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ కార్యవర్గసభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ నల్లకన్ను సీపీఐ జాతీయ నేతగా, తమిళనాడు రాష్ట్ర మాజీ కార్యదర్శిగా, మాజీ పార్లమెంట్ సభ్యుడిగా విశేష సేవలు అందించారని గుర్తుచేసుకున్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని 14 ఏళ్ల జైలు జీవితం గడిపిన కమ్యూనిస్ట్ యోధుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వెలుగూరి రాధాకృష్ణమూర్తి, కోటా మాల్యాద్రి, అకిటి అరుణ్‌కుమార్, మేడా హనుమంతురావు, రావుల అంజిబాబు, పుప్పాల సత్యనారాయణ, శని, చిన ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పుష్పాభిషేకం

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న 31వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం గణపతి పూజ, గోపూజ, శ్రీ చక్రమేరుకు విశేషాభిషేకాలు, అర్చనలు జరిగాయి. కల్యాణాలలో భాగంగా ధైర్యలక్ష్మి అమ్మవారి కల్యాణం కనులపండువగా జరిగింది. అనంతరం పలు రకాలు పుష్పాలతో కల్యాణ మూర్తులకు పుష్పాభిషేకం కనులపండువగా నిర్వహించారు. మహా హారతి, మంత్రపుష్పం, కల్యాణంలో పాల్గొన్న దంపతులకు, భక్తులకు తీర్థప్రసాద వితరణ, అన్నప్రసాద వితరణ జరిగింది. ఉత్సవాలను ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాద్ శర్మ పర్యవేక్షించారు.



స్వామి వారికి పుష్పాభిషేకం చేస్తున్న వేద పండితులు

హిందూవుల మనోభావాలను దెబ్బతీస్తున్న వైసీపీ

● పిల్లి మాణిక్యరావు

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): హిందూవుల మనోభావాలను దెబ్బతీయడం కోసమే శాసనమండలిలో వైసీపీ వికృతచేష్టలు చేస్తోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శాసనమండలిలో వైసీపీ సభ్యులు సభా సంప్రదాయాలకు వ్యతిరేకంగా శ్రీవారిని అవమానించేలా వ్యవహరిస్తున్నారన్నారు. శ్రీవారికి సమర్పించే నెయ్యిని కల్తీ చేయడం మహాపాపమన్నారు. శ్రీవారి చిత్రపటాలను చెప్పులు, బూట్లతో ప్రదర్శన చేసి నినాదాలు చేయడం మహాపచారమన్నారు. బైబిల్‌ను నమ్మే సుబ్బారెడ్డి, ఆయన భార్యకు టీటీడీ చైర్మన్ పదవి ఎలా ఇచ్చారనేదానికి వైసీపీ సమాధానం చెప్పాలన్నారు. ఈ విషయాన్ని పక్కకు నెట్టి సుబ్బారెడ్డి భార్య స్థల పురాణంపై అనర్గళంగా మాట్లాడుతుందని చెప్పడం విషయాన్ని పక్కదారి పట్టించడమేన్నారు. జగన్, సుబ్బారెడ్డి కుటుంబాలు శ్రీవారి పట్ల కావాలనే అపచారం చేస్తున్నారని, దీనిపై వారు సమాధానం చెప్పాలన్నారు. ఎవరు ఏ మతాన్నైనా స్వీకరించే హక్కు రాజ్యాంగం కల్పించిందని, ఒక మతం వారు ఇంకొక మతంపై సాంస్కృతిక, సాంప్రదాయ, వివక్షతతో కూడిన దాడి చేయకూడదని అన్నారు.

జాబ్ మేళాతో మారనున్న యువత భవిత

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జాబ్ మేళాలతో లక్ష ఉద్యోగాలు కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఐటీ విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దడానికి ప్రణాళికలు సిద్ధం చేయడం శుభ పరిణామమన్నారు. రాష్ట్రంలో 1587 జాబ్ మేళాలు నిర్వహించి 10 లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పించాలని కృషి చేస్తున్నామన్నారు. నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ సీడ్ యాప్ ద్వారా 74,000 మందికి శిక్షణ నిచ్చి అందులో 40 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వం ధ్యేయంతో ఉందన్నారు.

కొనసాగుతున్న అంగన్వాడీల రిలే దీక్షలు

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీలు తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షలను గురువారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బాబుప్రసాదు ప్రారంభించి మాట్లాడారు. ఐసీడీఎస్ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తవుతున్నా నేటికీ అంగన్వాడీలను కార్మికులుగా గుర్తించలేదన్నారు. అంగన్వాడీలకు 2019 నుంచి జీతం పెంచలేదని, దీనికి తోడు పని భారం పెరిగిందని అన్నారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు రమణ మాట్లాడుతూ, రిలే నిరాహార దీక్షలు శుక్రవారంతో ముగుస్తాయని, ఆ తరువాత మార్చి 2న చలో విజయవాడ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నిరసనల్లో కె.శ్రీనివాసరావు, హుస్సేన్‌వలీ, దండా లక్ష్మీనారాయణ, లాయర్స్ యూనియన్ నాయకులు శేషగిరిరావు, జయలక్ష్మీ, సుభాషిణీ, స్వర్ణలత, రోజమ్మ, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

అంబటి ఇంటిపై దాడిలో పోలీసులే దోషులు

● హైకోర్టు న్యాయవాది పొన్నవోలు

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అంబటి రాంబాబు ఇంటిపై దాడి కేసులో పోలీసులే దోషులుగా నిలుస్తారని హైకోర్టు న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి అన్నారు. గుంటూరు సిద్ధార్థనగర్‌లోని అంబటి నివాసంలో వైసీపీ లీగల్‌సెల్ సమావేశం జరిగింది. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో పొన్నవోలు మాట్లాడుతూ, దాడి చేసిన వారితో పోలీసులు భుజాలు కలిపారని, సహకరించిన పోలీసులు దోషులుగా నిలవకతప్పదన్నారు. ఎమ్మెల్సీలు కల్పలత రెడ్డి, టి.మాధవరావు, ఇజ్రాయిల్, రామచంద్రారెడ్డి, రామసుబ్బారెడ్డి, పలువురు నాయకులు అంబటిని పరామర్శించారు.

పండగలా జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు

● పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన



జనసేన సభ్యత్వ నమోదులో పాల్గొన్న పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బోనబోయిన శ్రీనివాసయాదవ్

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పిలుపుమేరకు జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం పండగ వాతావరణంలో జిల్లాలో మొదలైందని పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బోనబోయిన శ్రీనివాసయాదవ్ అన్నారు. గురువారం స్థానిక శ్రీనివాసరావుపేటలో జనసేన జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కేంద్రాన్ని అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురికి ఉద్యమి సభ్యత్వాన్ని ఆయన అందచేశారు. పవన్ కల్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలపై ప్రజల్లో విశేషమైన ఆదరణ ఉందని పేర్కొన్నారు. వచ్చే నెల 10వ తేదీ వరకు జరిగే ఈ సభ్యత్వ నమోదును ఇదే స్ఫూర్తితో రికార్డు స్థాయిలో చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారుతీ కిషోర్, మహబూబ్ బాషా, కోలా అంజి, స్టూడియో బాలాజీ, వడ్డే సుబ్బారావు, అలా గోవిందు, పసుపులేటి నరసింహారావు, కొట్టంశెట్టి బాలు, నాజర్ వలి, ఇళ్ళా చిరంజీవి, సుధాకర్, నండూరి స్వామి, కొలసాని బాలకృష్ణ, యార్డు డైరెక్టర్ నక్కల వంశీ పాల్గొన్నారు.

వైభవంగా దత్తాత్రేయ స్వామి కల్యాణం

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతినగర్‌లోని మారుతి దేవాలయ 40వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా లక్ష మోదక సహిత లక్ష్మి గణపతి స్వామికి హోమాన్ని నిర్వహించారు. అనంతరం దత్తాత్రేయ స్వామి వారి కల్యాణం వేద పండితులు వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ మాట్లాడుతూ, శుక్రవారం శంకరమంచి ఆంజనేయ శర్మ బ్రహ్మత్వం, భువనగిరి గోపాలకృష్ణ శర్మ ఆధ్వర్యంలో గణపతి స్వామి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ 27వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన బ్రహ్మోత్సవాల సభకు నేరే నారాయణమూర్తి, ఆలయ పాలకమండలి కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఆనంద ఆశ్రమం పీఠాధిపతి ప్రసన్నానందగిరిస్వామి, శృంగేరి విరూపాక్ష పీఠాధిపతులు గంభీరానంద భారతీస్వామి, సర్వాధికార ప్రతినిధి కారంచేడు విశ్వభారానందగిరి స్వామి భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. సభలో డాక్టర్ నిమ్మల శేషయ్య, బీజేపీ నాయకులు యడ్లపాటి స్వరూపారాణి, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య, మానం శ్రీనివాసరావు, బొల్లేపల్లి సత్యనారాయణ, కొగంటి శ్రీరంగనాయకులు, ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు అంకా విజయబాబు, సూర్యదేవర వెంకటేశ్వరరావు, ఓటుకూరి నాగేశ్వరరావు, కన్నెగంటి బుచ్చయ్య చౌదరి, సుధాకర్, బండారు సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభ ఉత్సవాల్లో అనుగ్రహ భాషణం చేస్తున్న పీఠాధిపతులు, పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు





విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల డైరెక్టర్లు కోగంటి భానుప్రకాష్, అనూష దంపతులు, వ్యాపారవేత్త కోగంటి ఈశ్వర్‌చంద్, కృష్ణకుమారి దంపతులు, తోటకూర శ్రీనివాస్, సంధ్య దంపతులు, జొన్నలగడ్డ మోహనబసవపున్నయ్య, నిర్మల దంపతులు, భక్తులు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

● శ్రీరామ స్మరణతో మార్మోగిన క్రాప గ్రామం

కొల్లూరు/బాపట్ల, ఫిబ్రవరి 26 (ఆంధ్ర జ్యోతి): కొల్లూరు మండల పరిధిలోని క్రాప గ్రామంలో గురువారం శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్స వాలు అత్యంత వైభవంగా జరిగాయి. కోగంటి వారి కుటుంబసభ్యులు నూతనంగా నిర్మించి న ఆలయంలో శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనే య స్వామి విగ్రహాలను వైఖనస ఆగమ శా స్త్ర ప్రకారం రొంపిచర్ల శ్రీరామభట్టాచార్యుల ఆ ధ్వర్యంలో ప్రతిష్ఠ క్రతువును అత్యంత ఘనం గా నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా సీ త, రామస్వామి, లక్ష్మణ ఆంజనేయస్వామి వి గ్రహాలకు విశేష పూజలు నిర్వహించి జలాది వాసం, శయనాదివాసం, ధాన్యాధివాసాలను జరిపి హోమాది కార్యక్రమాలను పండితులు వైఖనస ఆగమ శాస్త్ర ప్రకారం ఉదయం 10.08 గంటలకు ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ గావించారు. ఈ మహోత్సవంలో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల డైరెక్టర్లు కోగంటి భానుప్రకాష్, అనూష, వ్యాపారవేత్త కోగంటి ఈశ్వర్‌చంద్, కృష్ణకుమారి, తోటకూర శ్రీనివాస్, సంధ్య, జొన్నలగడ్డ మోహనబసవ పున్నయ్య, నిర్మల దంపతులు పాల్గొని హోమాధి కార్యక్రమాలు నిర్వహిం చారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల శ్రీ రామ నామస్మరణ మధ్య ప్రతిష్ఠ వేడుక అ త్యంత ఘనంగా జరిగింది. అనంతరం సుబ్ర హ్మణ్య స్వామి, కనకదుర్గ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి యంత్రస్థాపన చేశారు. రామాలయం, కనకదుర్గ ఆలయాలపైన ప్ర త్యేక పూజలు నిర్వహించి కలశ స్థాపన చేశా రు. ప్రతిష్ఠ తర్వాత సీతాలక్ష్మణ సమేత కోదం డ రామస్వామి, సుబ్రహ్మణ్య స్వామి, కనకదు ర్గ అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించి ఆ భరణాలు, గజమాలలతో అలంకరించి విశేష పూజల్లో భాగంగా పవిత్ర పుష్పాలు, తులసీద ళాలు, కుంకుమలతో సహస్ర అష్టోత్తర పూజ లు జరిపి పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కోగంటి ఈశ్వర్‌చంద్ దంపతులతో పాటు కోగంటి వారి కుటుంబస భ్యులు సీతారాముల వారి కల్యాణాన్ని కన్ను ల పండువగా జరిపించారు. క్రాప గ్రామంతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు అధి క సంఖ్యలో విచ్చేసి ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నా రు. అనంతరం తీర్థ, అన్న ప్రసాదాలు స్వీక రించారు. ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలతో క్రాప ఆధ్యాత్మిక శోభను సంతరించు కుంది. ఈ మహోత్సవంలో ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు, మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జున రావు, టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని ము రళీకృష్ణ, క్రాప పీఏసీఎస్ అధ్యక్షుడు కోగంటి హరిప్రసాద్, సంగం డెయిరీ డైరెక్టర్ జీఎల్‌జీ భగవాన్, టీడీపీ నాయకులు మల్లంపాటి హ రిప్రసాద్, నాగళ్ల కృష్ణారావు పాల్గొన్నారు.



క్రాపలో నూతనంగా నిర్మించిన రామాలయంలో ఎమ్మెల్యే ఆనందబాబును ఆశీర్వదిస్తున్న పండితులు

21 రోజులే అవకాశం

● గడువు దాటితే అపరాధం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్ర జ్యోతి): జనన, మరణ నమోదుకు సంబంధించి రాష్ట్ర ప్రభు త్వం కొత్త నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చింది. పాఠశాలల్లో ప్రవేశాలు, ఓటరు కార్డు, డ్రైవిం గ్ లైసెన్స్‌లు, ఆధార్, పాసు పోర్టు తదితర పత్రాలు పొందేందుకు జనన ధ్రువీకరణ తప్పనిసరి. ఆస్తి వ్యవహారాలు, బ్యాంక్ ఖాతాల్లోకి నిధులు బదలాయించటం తదితర పనులకు మరణ ధ్రువీకరణ పత్రాలే కీలకమైనవి. ఈ పత్రాల నమోదులో చాలా మంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జనన, మరణాలు సంభవిస్తే తప్పనిసరిగా 21 రోజుల్లో నమోదు చేసుకోవాలి. తరువాత 21 నుంచి 30 రోజుల్లో నమోదు చేస్తే రూ.25 అపరాధ రుసుం చెల్లించాలి. 30 రోజుల తరువాత నుంచి ఏడాదిలోపు ఐతే జిల్లా రిజిస్ట్రార్ రాత పూర్వక వినతితో పాటు రూ.250 రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఏడాది దాటితే కలెక్టర్, ఆర్డీవో అనుమతితో పాటు అపరాధ రుసుం కింద రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. దీంతో పాటు ఫారం-14 ద్వారా అఫిడవిట్ సమర్పించాలి. బిడ్డ పుట్టిన వెంటనే కొందరు జనన ధ్రువపత్రాల్లో పేర్లు నమోదు చేయటం లేదు. అలాంటి వారు 12 నెలల్లోపు ఉచితంగా పేర్లు నమోదు చేసుకోవచ్చు. 12 నెలల నుంచి 15 సంవత్సరాల లోపు పేరు చేర్చాలనుకుంటే రూ.250 రుసుం చెల్లించాల్సి ఉంటుంది. జనన, మరణాలు ఆస్పత్రుల్లో జరిగితే ఆ సంస్థ అధికారులు బాధ్యతగా నిర్ణీత ఫార్మాట్‌లో సమాచారాన్ని రిజిస్ట్రార్‌కు పంపుతారు. ఇంట్లో జరిగితే ఇంటి యజమాని లేదా కుటుంబ పెద్ద ఆ సమాచారాన్ని అందించే బాధ్యత తీసుకోవాలి. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పుట్టినా, మృతి చెందినా ఆస్పత్రి సిబ్బందే ధ్రువపత్రాలు ఇస్తారు.

వైద్యసేవలకూ ఆధార్

● వచ్చే వారం నుంచి అమల్లోకి..

రెంటచింతల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అన్ని రకాల వైద్య సేవలకు ఇకపై ఆధార్ నెంబర్ లింక్ చేయనున్నారు. వచ్చే వారం నుంచి పీహెచ్‌సీల్లో ఈ ప్రక్రియను ప్రారంభించను న్నారు.ప్రతి పౌరునికి డిజిటల్ కార్డు ఉండాలన్నా ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వివిధ వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షల కోసం ఆస్పత్రులకు వచ్చే రోగులు తమ వెంట ఆధార్ కార్డు తెచ్చుకోవాల్సి ఉంది. ఓపీ కౌంటర్ వద్ద ఆధార్ కార్డు చూపిస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. అనంతరం ఓపీ చీటి ఇస్తారు. రోగుల ఆధార్ వివరాలను ఒక్కసారి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే తదుపరి పీహెచ్‌సీకి ఎప్పుడు వెళ్ళినా గతంలో ఎప్పుడు ఏ జబ్బుకు డాక్టర్ చేసిన చికిత్స, ఎలాంటి మందులు ఇచ్చారు, పరీక్షల రిపోర్టులు తదితర వివరాలు తెలుస్తాయని పీహెచ్‌సీ డాక్టర్ ఎన్.కృష్ణారెడ్డి చెప్పారు.



రెంటచింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు వేళాయే

● ఒక్కసారి చేరితే ఏడేళ్లు ఉచిత నాణ్యమైన విద్య

క్రోసూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 14 ప్రభుత్వ ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు వేళయింది. ఈ పాఠశాలల్లో ఒక్కసారి ప్రవేశం పొందితే వరుసగా ఏడేళ్లు ఇంగ్లీషు మీడి యంలో ఉచితంగా నాణ్యమైన విద్య లభించనుంది. 2026-27 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైంది. మార్చి 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 14 ఆదర్శ పాఠశాలలు ఉండగా అవి మొత్తం పల్నాడు జిల్లాలోనే ఉన్నాయి. బొల్లాపల్లి, దాచే పల్లి, దుర్గి, గురజాల, ఈపూరు, కారంపూడి, నాదెండ్ల, నకరికల్లు, నూజెండ్ల, రెంటచింతల, రొంపిచర్ల, వెల్దుర్ది, వినుకొండతో పాటు క్రోసూరులోనూ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. 6వ తరగతిలో ప్రవేశాలకు ఓసీ, బీసీ విద్యార్థులు 2014 సెప్టెంబరు 1 నుంచి 2016 ఆగస్టు 31వ తేదీ లోపు జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2012 నుంచి సెప్టెంబరు 1 నుంచి 2016 ఆగస్టు 31వ తేదీ లోపు జన్మించి ఉండాలి. ఓసీ, బీసీ విద్యార్థులైతే 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే 30 మార్కులు కనీసం సాధించాలి. ప్రతిభా రిజర్వేషన్‌ల ఆధారంగా సీట్ల భర్తీ ఉంటుంది. ఏప్రిల్ 12వ తేదీన ఆయా పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష జరగనుంది. 5వ తరగతి సిలబస్‌తో పరీక్ష నిర్వహిం చనున్నారు. ఏప్రిల్ 27న మెరిట్ లిస్టు ప్రదర్శిస్తారు. ధ్రువపత్రాల పరిశీలన, కౌన్సిలింగ్ అనం తరం జూన్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభిస్తారు. పైసా ఖర్చు లేకుండా 6వ తరగతి నుంచి ఇంటర్మీడి యట్ వరకు పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఇది మంచి అవకాశంగా చెప్పవచ్చు.



ప్రభుత్వ ఆదర్శ పాఠశాల

మిర్చియార్డులో మధ్యాహ్న భోజనం ప్రారంభం

● రైతు చేతుల మీదుగా ప్రారంభింపజేసిన చైర్మన్ కుర్రా



మిర్చియార్డులో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని రైతుతో ప్రారంభింపజేస్తున్న చైర్మన్ కుర్రా అప్పారావు, పక్కన ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రిక

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరు (మిర్చియార్డు)లో రైతులకు మధ్యాహ్న భోజనం పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. గురువారం ఏఎంసీ చైర్మన్ కుర్రా అప్పారావు మిర్చియార్డులోని రైతుల భోజనశాలను ఓ రైతు చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. అనంతరం భోజనశాలలో లాంచనంగా అన్నం వడ్డించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ అప్పారావు మాట్లాడుతూ, మిర్చియార్డుకు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి రైతులు ఆరుగాలం పండించిన మిర్చిని తీసుకొచ్చి విక్రయిస్తుంటారని, ఈ క్రమంలో రైతులు భోజనం, అల్పాహారానికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు పాలకవర్గం ఉచితంగా ఈ పథకాన్ని ప్రారంభించిందన్నారు. రైతులు ఎంతమంది వచ్చినా అంతమందికి కడుపునిండా భోజనం పెడతామన్నారు. ఆహారం నాణ్యత విషయంలో రాజీపడకుండా చూస్తామన్నారు. మే నెల రెండో వారంలో మిర్చి సీజన్ ముగిసేంత వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. భోజనం నాణ్యత, పరిమాణం విషయంలో ఎలాంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, ఏఎంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ.చంద్రిక, వైస్ చైర్‌పర్సన్ బిట్రగుంట మల్లిక, పాలకవర్గ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



రైతులకు మధ్యాహ్న భోజనం పంపిణీ చేస్తున్న మిర్చియార్డు చైర్మన్ కుర్రా అప్పారావు, డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు

కళల స్థలి.... రంగస్థలి

● నేడు రంగస్థలి 46వ వార్షికోత్సవం
● జాతీయ నాటక పోటీల నిర్వహణ
● మూడు రోజులు...ఏడు నాటికలు

నరసరావుపేట కల్చరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట రంగస్థలి రాష్ట్రంలోనే ప్రతిష్ఠాత్మక నాటక సంస్థ. సుమారు నాలుగున్నర దశాబ్దాలుగా ఒక నాటక సంస్థ మనుగడ సాగించడమంటే అది సామాన్య విషయం కాదు. ఆ అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది రంగస్థలి. సరిగ్గా 46 ఏళ్ల క్రితం 1980లో ప్రారంభమైన రంగస్థలి ప్రస్థానం నేటికీ అప్రతిహతంగా కొనసాగుతుందంటే దాని వెనుక ఎంతో మంది కళాకారుల అవిరళ కృషి, మరెంతోమంది ఆర్థిక అండదండలూ ఉన్నాయి.

● చిన్న నాటిక సమాజాలు కలిసి ఒకటిగా

80వ దశకంలో పట్టణంలో ఉన్న చిన్న చిన్న నాటిక సమాజాలు కలిసి ఒకటిగా నటీ, నట ప్రేక్షక సమాఖ్యగా నరసరావుపేట రంగస్థలి ఏర్పాటైంది. వందల సంఖ్యలో శాశ్వత సభ్యులతో నెలవారీ కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించేవారు. అయితే టీవీ సినిమాల వెల్లువలో నెలవారీ కార్యక్రమాలకు ప్రేక్షకులు తగ్గడంతో ప్రతి సంవత్సరం వార్షికోత్సవం పేరిట ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహించడం ప్రారంభించారు. రాష్ట్రంలో ప్రతి సమాజం రంగస్థలి నాటిక పరిషత్‌లో ప్రదర్శించాలని కోరుకునేవారు. రంగస్థలిలో నాటకం ప్రదర్శించడమంటే గొప్ప అవకాశంగా భావించేవాళ్లు. సుమారు 25 ఏళ్లుగా నిర్విఘ్నంగా నాటిక పోటీలు నిర్వహిస్తున్నారు.

● కోడెల శివప్రసాద్ కృషితో టౌన్‌హాల్ నిర్మాణం

తొలినాళ్లలో మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని గురజాడ కళామందిర్‌లో నాటక పోటీలు జరిగేవి. అది ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం కావడంతో వాతావరణం అనూకూలించకపోతే ఒక్కోసారి ప్రదర్శనలకు అంతరాయం కలిగేది. కళాకారుల ఇబ్బందులను గుర్తించిన మాజీ మంత్రి దివంగత డాక్టర్ కోడెల శివప్రసాదరావు భువన చంద్ర టౌన్‌హాల్‌ను నిర్మించి కళాకారుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. అప్పటి నుంచి నాటక పోటీలు టౌన్‌హాల్‌లో జరుగుతున్నాయి. డాక్టర్ కోడెలకు స్వతహాగా కళలన్నా, నాటకాలన్నా ఇష్టం ఉండడంతో, ఆయన రంగస్థలి నాటక పోటీలకు క్రమం తప్పకుండా హాజరయ్యేవారు. ఈ క్రమంలో రంగస్థలికి విచ్చేసిన కె.విశ్వనాధ్, సోమయాజులు, గీత రచయిత వేటూరి, బ్రహ్మానందం, కోట శ్రీనివాసరావు, ఎల్‌బీ శ్రీరాం, అన్నపూర్ణ, హీరో శివాజీ వంటి ఎంతో మందిని సన్మానించి, సత్కరించింది. అంతే కాక ప్రతి సంవత్సరం అయా రంగాలలో లబ్ధ ప్రతిష్టులైన వారికి ప్రతిభా పురస్కారాలు అందజేస్తోంది.



రంగస్థలి కార్యక్రమంలో మాజీ మంత్రి, నవ్యాంధ్ర తొలి శాసన సభాపతి దివంగత డాక్టర్ కోడెల శివప్రసాదరావు, పక్కన ముఖ్యఅతిథి సినీ నటుడు దివంగత కోటా శ్రీనివాసరావు (పాత చిత్రం)

● మూడు రోజులు...ఏడు నాటికలు

రంగస్థలి 46వ వార్షికోత్సవం సందర్భంగా శుక్ర, శని, ఆదివారం మూడు రోజుల పాటు ఏడు నాటిక పోటీలు జరగనున్నాయి.

రంగస్థలి లోగో

మొదటి రోజు సాంస్కృతిక సమితి, విజయవాడ వారి మమ్మల్ని బతకనివ్వండి, అభినయ ఆర్ట్స్ గుం టూరు వారి ఇది అతని సంతకం, రెండో రోజు అరవింద ఆర్ట్స్, తాడేపల్లి వారి దేవుణ్ణి చూశాం, విశాఖపట్నం వారి అసత్యం, సహృదయ, ద్రోణాదుల వారి వర్క్ ఫ్రం హోం, మూడో రోజు గోవా డ క్రియేషన్స్, హైదరాబాద్ వారి అమ్మ చెక్కిన బొమ్మ, సిరిమువ్వ కల్చరల్ అసోసియేషన్, హైదరాబాద్ వారి గేమ్ నాటికలు ప్రదర్శించనున్నారు. ఈ ఏడాది రంగస్థలి ప్రతిభా పురస్కారాలు నటి, దర్శకురాలు ఎస్.అమృత వర్షిణి, నటి, గాయని ఎం.రత్నకుమారి, ఔను వాళ్లిద్దరు ఇష్ట పడ్డారు ఫేం ద్రాక్షారామం సరోజకు అందజేయనున్నారు.

వేగంగా విస్తరణ

● ముమ్మరంగా బుడంపాడు, కొలనుకొండ ఆర్వోబీల పనులు



గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు రవాణాలో అత్యంత కీలకమైన చెన్నై - కోల్‌కతా (ఎన్‌హెచ్-16) జాతీయ రహదారిపై రెండు ఆర్వోబీల (రైలు ఓవర్ బ్రిడ్జి) విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయి. గుంటూరు, విజయవాడ నగరాల మధ్య ఈ జాతీయ రహదారి ఆరు లేన్లుగా ఉన్నప్పటికీ.. బుడంపాడు సమీపంలో ఐదు లేన్లుగా, కొలనుకొండ వద్ద నాలుగు లేన్లుగా ఉంది. అందుకు కారణం అక్కడ ఆర్వోబీలు ఉండ డమే. బుడంపాడు, కొలనుకొండ వద్ద ఇరుకైన ఆర్వోబీల కారణంగా.. జాతీయ రహదారిని విస్త రించేందుకు వీలు లేకుండా ఉంది. ఈ రెండు చోట్ల ఆర్వోబీలు విస్తరించేందుకు కేంద్ర ప్రభు త్వం ఆమోదం తెలపడంతో.. ఏడాది తిరిగేలోపు ఈ నిర్మాణ పనులు ప్రారంభమై పరుగులు పెడుతున్నాయి.

● గుంటూరులో..

గుంటూరులో బుడంపాడు ఫ్లై ఓవర్‌కు సమీపంలో గుంటూరు, తెనాలి రైల్వే ట్రాకుపై ఉన్న ఆర్‌ఓబీని రూ.18 కోట్లతో విస్తరిస్తున్నారు. ఇక్కడ విజయవాడ నుంచి చెన్నై వైపు ఆర్వోబీ మూడు లేన్లుగానూ, చెన్నై నుంచి విజయవాడ వైపు ఆర్వోబీ రెండు లేన్లుగానూ ఉంది. ఇప్పుడు ఈ రెండు లేన్ల వంతెనను మూడు లేన్లుగా విస్తరించనున్నారు. రెండేళ్లలో దీన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా రోడ్డు నిర్మాణ పనులు మొదలయ్యాయి. రోడ్డు నిర్మాణంలో భాగంగా బీటీ లేయర్లతో మెరకవేసే పనులు దాదాపు చివరి దశకు వచ్చాయి. ట్రాక్‌పై వంతెన నిర్మాణానికి అవసరమైన పిల్లర్లువేసే పనులు జరుగుతున్నాయి.

● కొలనుకొండ వద్ద

మంగళగిరి మండలం కొలనుకొండ వద్ద ప్రస్తుత డీజీపీ కార్యాలయానికి సమీపంలో ఆర్వోబీ రెండు లేన్లుగానే ఉంది. రోడ్డంతా మూడు లేన్లుగా ఉంటూ ఒక్కసారిగా ఈ ఆర్వోబీ దగ్గర రెండు లేన్లుగా కుదించుకుపోయి ఉండడంతో ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతుం టాయి. ఈ వంతెనను మూడు లేన్లుగా విస్తరించడానికి కేంద్ర ప్రభుత్వం రూ.36 కోట్లు కేటాయించింది. ఈ పనులు రెండు నెలల క్రితం ప్రారంభమయ్యాయి. ఈ ఆర్వోబీ వద్ద చెట్లను నరికి నేలను చదును చేసే పనులు జరుగుతున్నాయి. అయితే వెస్ట్ బైపాస్ పూర్తయితే ఈ రోడ్డు రాష్ట్ర రహదారిగా మారిపోతుంది. అయినప్పటికీ ఈ ఆర్వోబీలను మూడు లేన్లుగా విస్తరించి ఎన్‌హెచ్‌ఏఐ రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుంది.



బుడంపాడు సమీపంలో రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా ఆర్వోబీ కోసం వేసిన బీటీ రోడ్డు

అమరావతికి భారత ప్రధాన న్యాయమూర్తి

(5వ పేజీ తరువాయి)

సీఆర్‌డీఏ నిర్మించనుంది. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్‌లో ఆంధ్రప్రదేశ్ జ్యూడీషియల్ అకాడమీని నిర్మాణానికి రూ.165కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. రాజధానిలోని పిచ్చుకాలపాలెంలో నిర్మాణానికి మట్టి పనిని పూర్తి చేశారు. ఈ అకాడమి న్యాయవ్యవస్థ ఎంతో కీలకమైంది. ఇక్కడ జ్యూడీషియల్ అధికారులకు వివిధ అంశాల్లో శిక్షణనిస్తారు. కొత్త క్రిమినల్ చట్టాలపై సదస్సులు నిర్వహిస్తారు. జడ్జిలుగా నియామకం పొందిన వారికి 16 వారాల శిక్షణ, వర్కుషాప్‌లు, ప్రాక్టికల్ ట్రైనింగ్ సెషన్స్‌కు అనువుగా ఉంటుంది. ప్రస్తుతం ఈ అకాడమి మంగళగిరిలోని కాజ సమీపంలో అద్దె భవనంలో కొనసాగుతోంది. ఈ న్యాయ సంస్థల నిర్మాణాలన్నీ.. పూర్తయితే అమరావతిలో జస్టిస్ సిటీ సమగ్రంగా రూపుదిద్దుకొంటుంది.



సహజయోగ

సదా భగవంతుడినే సేవిస్తూ, ఆయననే పూర్తిగా నమ్ముకున్నవారికి సంపూర్ణ రక్షణ లభిస్తుంది. దుష్టశక్తులు వారికి హాని కలిగించలేవు. భగవద్భక్తులైన సజ్జనులు జీవితంలో ఎదురయ్యే ఎలాంటి ప్రమాదాలనుంచయినా బయట పడగలరు. దీనికి ప్రతీక హోలీ పండుగ. హోలికా దహనం జరిగిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ ఈ ఉత్సవాన్ని నిర్వహించుకోవడం ఆనవాయితీ.

ఏడు రంగులు ఏడు చక్రాలు

రంగుల పండుగగా ఆసేతుహిమాచలం హోలీకి ఎనలేని ప్రాధాన్యం ఉంది. ఈ ఉత్సవం వెనుక ఒక పౌరాణిక గాథ ఉంది. హరిభక్తుడైన తన కుమారుడు ప్రహ్లాదుణ్ణి హిరణ్యకశిపుడు అనేక విధాలుగా హింసించాడు. చివరకు చంపాలనుకున్నాడు. తన సోదరి హోలికను సాయం కోరాడు. హోలికకు మంటల్లో కూర్చున్నా చెక్కుచెదరదని అగ్నిదేవుడు ఇచ్చిన ఒక వరం ఉంది. ఆమె చుట్టూ ఒక మాయా వస్త్రం ఉంటుంది. దాన్ని మంటలు ఏమీ చేయలేవు. కాబట్టి హిరణ్యకశిపుడి కోరిక ప్రకారం... ప్రహ్లాదుణ్ణి తన ఒడిలో కూర్చోబెట్టుకొని ఆమె అగ్నిలోకి ప్రవేశించింది. అప్పుడు 'ప్రహ్లాదుడు గణేశుని అంశతో జన్మించినవాడు. విష్ణుభక్తుడు. అతణ్ణి ఎలా దహించగలను? అలా చేయకపోతే హోలికకు ఇచ్చిన వాగ్దానాన్ని ఎలా నెరవేర్చగలను?' అని అగ్నిదేవుడు సందిగ్ధంలో పడ్డాడు. మన జీవితంలో కూడా కర్తవ్యానికి, ధర్మానికి మధ్య సందిగ్ధతలు ఎదురవుతాయి. ఎప్పుడైనా కర్తవ్యం కన్నా ధర్మం గొప్పదని అర్థం చేసుకోవాలి. అగ్నిదేవుడు ధర్మానికే కట్టుబడ్డాడు.

అప్పుడు విష్ణుమాయ కారణంగా హోలిక మాయా వస్త్రం ప్రహ్లాదుడికి చుట్టుకుంది. హోలిక మంటల్లో కాలిపోయింది. ప్రహ్లాదుడు సురక్షితంగా బయటపడ్డాడు. అందుకే హోలీకి ముందురోజు రాత్రి 'హోలికా దహనం' పేరుతో మంటలు వేస్తారు. చెడును దహించి, మంచిని ఆహ్వానించాలనే సందేశం దీనిలో ఇమిడి ఉంది. అలాగే తపస్సులో ఉన్న తనను మేలుకొలపాలని ప్రయత్నించిన మన్మథుణ్ణి శివుడు తన మూడో కంటితో భస్మం చేసిన రోజు ఇది. అందుకే దీన్ని 'కాముని పున్నమి' అంటారు. మనలోని కామ, క్రోధాదులను దహించివేయాలని దీని అంతరార్థం.

ఆనందంగా, ఉత్సాహంగా...

త్రేతాయుగంలో శ్రీరాముడి జీవితం చాలా ఆదర్శంగా, ఉన్నతంగా, ఎంతో గంభీరంగా ఉండేది. ప్రజలు యజ్ఞాలు, యాగాలు నిర్వహించుకుంటూ నియమనిష్టలతో ఉండేవారు. వారందరూ శ్రీరాముడిలా గంభీరంగా మారడం ప్రారంభించారు. శ్రీకృష్ణుడు అవతరించే సమయానికి ధర్మాచరణ కఠినంగా ఉండేది. ప్రజలు క్రమేపీ ఛాందసులుగా, కోపిష్టులుగా మారారు. వారిలో ఆనందం, ఉత్సాహం కరువైపోయాయి. శ్రీకృష్ణుడు దీన్ని సరిదిద్దాలనుకున్నాడు. రంగులతో హోలీ ఆడడం ప్రారంభించాడు. వాస్తవానికి ఈ రంగులు దేవీ శక్తికి ప్రతీక. మన సూక్ష్మశరీరంలోని ఏడు శక్తి కేంద్రాలు ఏడు రంగులను కలిగి ఉంటాయి. ఆ ఏడు చక్రాల రంగులతోనే హోలీ చేసుకుంటాం. సహస్రార చక్రం సప్తవర్ణాల సమ్మిళితంగా ఉంటుంది.' 'మనలోని చక్రాలను ప్రతిబింబించే ఈ రంగులను మీమీద చల్లుకోండి. ఆనందంతో, ఉత్సాహంతో ఆడుకోండి" అంటూ ప్రజలందరినీ సామూహిక హోలీ వేడుకలకు శ్రీకృష్ణుడు ప్రోత్సహించాడు. భగవంతుడితో సంయోగం పొందిన వ్యక్తి ఆనందంలో పూర్తిగా లీనమైపోతాడు. మనకు బాధను, దుఃఖాన్ని ఇచ్చేది దైవం కాదు. వాటికి మనమే కారకులం. దీన్ని అందరూ గుర్తించాలి. ఎప్పుడూ సంతోషమైన స్వభావం కలిగి ఉండాలి. విశాల హృదయం కలిగి ఉండాలి. మన ప్రవర్తన అందరూ స్వాగతించేలా ఉండాలి.



మార్చి 3న హోలీ

ఐక్యతకు చిహ్నం...

ధనిక, పేద, కుల భేదాలకు అతీతంగా అందరూ కలిసి జరుపుకొనే హోలీ ఐక్యతకు ఒక చిహ్నం. పాత గొడవలను మరిచిపోయి, ఒకరికి ఒకరు రంగులు పూసుకుంటూ, స్నేహహస్తాన్ని అందించడం ఈ పండుగ ప్రత్యేకత. పూర్వం పసుపు, కుంకుమ, మోదుగపూలు లాంటి సహజసిద్ధమైన రంగులను హోలీలో ఉపయోగించేవారు. అవి శరీరంలో వ్యాధి నిరోధకశక్తిని పెంచి, వేసవిలో వచ్చే ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా సహజ యోగులు హోలీని కామదహనానికి ప్రతీకగా నిర్వహించుకుంటారు. అగ్నిని హోమరూపంలో పూజిస్తారు. పురుషులు పురుషులతో, మహిళలు మహిళలతో హోలీ ఆడుతారు.



డాక్టర్ పి. రాకేష్,
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్',
తెలంగాణ



సందేశం

జకాత్... సంపద శుద్ధి కోసం




ఇస్లాంలోని సమస్త ఆరాధనల్లో నమాజ్‌కు ఎంత ప్రాధాన్యం ఉందో జకాత్‌కు కూడా అంతే ప్రాధాన్యం ఉంది. ఈ రెండిటిలో ఏ దేన్ని నిరాకరించినా... అవిశ్వాసిగా పరిగణన పొందుతాడు. వీటిలో ఒకటి లేకపోతే రెండోదానికి ఎలాంటి విలువా ఉండదు. ఒక ముస్లిం నిత్యం నమాజ్ చేస్తున్నప్పటికీ... ప్రతి ఏడాది జకాత్ చెల్లించకపోతే... నమాజ్ వల్ల అతనికి ఎలాంటి ప్రయోజనం చేకూరదు. అలాగే వేరొకరు ఏటేటా జకాత్ చెల్లిస్తున్నా... జీవితాంతం నమాజ్ చేయకపోతే... పరలోకంలో అతని జకాత్ సత్కార్యం బూడిదలో పోసిన పన్నీరు అవుతుంది.

"సత్యాన్ని విశ్వసించి, సదాచార సంపన్నులై, నమాజ్ నిర్వహిస్తూ, జకాత్‌ను నెరవేర్చుతూ ఉండేవారికి ప్రభువు వద్ద ప్రతిఫలం సిద్ధంగా ఉంది. వారికి పరలోకంలో ఎలాంటి భయం, దుఃఖం ఉండవు" అనీ, "విశ్వాసులైనవారు ఒకరికొకరు స్నేహితులు, శ్రేయోభిలాషులు. వారు మంచి విషయాలు బోధిస్తారు. చెడు విషయాల నుంచి వారిస్తారు. నమాజ్ వ్యవస్థ స్థాపిస్తారు. జకాత్ చెల్లిస్తారు. దేవునిపట్ల, ఆయన ప్రవక్త పట్ల వినయ విధేయతలతో మసలుకుంటారు. వారిపైనే దైవకారుణ్యం వర్షిస్తుంది" అనీ అంతిమ దివ్యగ్రంథమైన ఖుర్‌ఆన్ స్పష్టం చేసింది.

"ఏ సంపద నుంచి జకాత్ తీయకుండా అందులోనే కలిసి ఉంటుందో... ఆ సంపదను అది నాశనం చేస్తుంది" అని చెబుతూ జకాత్ చెల్లించకపోవడం వల్ల ప్రళయ దినం నాడు ఎదురయ్యే భయానకమైన పర్యవసానాలను దైవ ప్రవక్త మహమ్మద్ వివరించారు. "దేవుడు తన అనుగ్రహంతో ప్రసాదించిన సంపద విషయంలో పిసినారితనంతో వ్యవహరించేవారు... ఆ పిసినారితనం తమకు మేలు చేకూరుస్తుందని భావించకూడదు. అది వారికి హాని కలిగిస్తుంది. ఏ ధనం విషయంలో వారు పిసినారితనం వహిస్తున్నారో... అదే ప్రళయదినాన వారి మెడకు గుదిబండగా మారుతుంది" అని హెచ్చరించారు.

'జకాత్' అంటే పవిత్రత, పరిశుద్ధత అని అర్థాలు ఉన్నాయి. ఇక్కడ ప్రత్యేక పరిభాషలో చెప్పాలంటే... ధనికుడు పవిత్రుడు అయ్యే ఉద్దేశంతో, తన సంపదను శుద్ధి చేసుకోవడానికి ఏడాదికి ఒకసారి తన సంపద నుంచి రెండున్నర శాతం చొప్పున పేదలకు, ధర్మ సంస్థాపన కార్యాలకు దానం చేసే ధన, కనక, వస్తువులను 'జకాత్' అంటారు. "జకాత్ చెల్లింపును ముస్లింలకు అల్లాహ్ తప్పనిసరి చేశాడు. ఇది వారిలోని ధనికుల నుంచి వసూలు చేసి, వారిలోని నిరుపేదలకు అందజేయడం జరుగుతుంది" అని దైవ ప్రవక్త మహమ్మద్ తెలిపారు. దీన్నిబట్టి జకాత్ పేద ప్రజల హక్కు అని తెలుస్తోంది. ఇస్లాం ధర్మానికి ఉన్న అయిదు మూల స్తంభాలలో విశ్వాస ప్రకటన, నమాజ్ తరువాత జకాత్‌ను మూడో స్తంభంగా పరిగణిస్తారు. దివ్య ఖుర్‌ఆన్ గ్రంథంలో కనీసం 32 సార్లు నమాజ్‌తో పాటు జకాత్ ప్రస్తావన కూడా ఉంది. దీన్నిబట్టి కూడా జకాత్ ప్రాధాన్యత అర్థమవుతుంది.

• మహమ్మద్ వహీదుద్దీన్



సద్బోధ

పూర్వం శ్రోణుడనే రాజకుమారుడు ఉండేవాడు. తల్లిదండ్రులు అతణ్ణి అల్లారుముద్దుగా పెంచారు. యవ్వనంలో అతడు అన్ని రకాల రాజభోగాలలోనూ మునిగి తేలాడు. కానీ శ్రోణుడికి అందం, ఐశ్వర్యం, గానం, నాట్యం... ఏవీ సంతృప్తిని ఇవ్వలేదు. ఎప్పుడూ అతని మనసులో ఏదో తెలియని వెలితి ఉండేది. కాంతిమంతమైన ముఖాలతో హాయిగా, ఆనందంగా జీవిస్తున్న భిక్షువులను చూసి... 'ఏదీ లేకపోయినా భిక్ష మీద బతుకుతున్నవారికి ఈ వర్చస్సు, ఈ ప్రశాంతత ఎలా లభించాయి?' అని ఆలోచించాడు. తానూ భిక్షువుగా మారాలని నిర్ణయించుకున్నాడు. గౌతమ బుద్ధుణ్ణి ఆశ్రయించి.. భిక్షువుల్లో ఒకడయ్యాడు.

జీవన వీణ

అయితే శ్రోణుడు అందరికన్నా భిన్నంగా వ్యవహరించేవాడు. ఇతర భిక్షువులు మంచి బాట మీద నడిచి వెళుతూ ఉంటే... అతను రాళ్ళు రప్పలు, ముళ్ళ కంపలమీద అడుగులు వేస్తూ నడిచేవాడు. అంతకుముందు మెత్తని తివాచీలమీద సున్నితంగా అడుగులు వేసిన రాజకుమారుడతను. అందరూ చెట్ల కింద కూర్చొని సేద తీరితే... అతను మాత్రం ఎర్రటి ఎండలో కాళ్ళు మాడ్చుకుంటూ నిలబడేవాడు. అతని పాదాల్లో బొబ్బలు వచ్చేవి. భిక్షువులందరూ రోజుకు ఒక పూట భోజనం చేస్తే... శ్రోణుడు రోజుల తరబడీ నిరాహారిగా ఉండేవాడు. ఆరు నెలలు తిరగకముందే అతను అందాన్ని, శక్తిని కోల్పోయి జీవచ్ఛవంలా మారిపోయాడు. అస్థిపంజరంలా మిగిలాడు.

ఈ సంగతి గౌతమ బుద్ధుని దృష్టికి వచ్చింది. ఒక రోజు ఆయన శ్రోణుడి దగ్గరకు వెళ్ళాడు. ప్రేమతో నిండిన హృదయంతో అతణ్ణి పలకరించాడు. "నాయనా శ్రోణా! నీకు వీణ వాయించడంలో చాలా ప్రావీణ్యం ఉందని నేను విన్నాను. నిజమేనా?" అని అడిగాడు.

శ్రోణుడు 'అవున'ని సమాధానమిచ్చాడు. "నాలా వీణ వాయించగలిగేవారు ఎవరూ లేరని అందరూ అనేవారు" అని కూడా చెప్పాడు.

అప్పుడు బుద్ధుడు "నాకొక సందేహం ఉంది. వీణ తీగలు బాగా వదులుగా ఉంటే వీణ నుంచి మధురమైన సంగీతం వెలువడుతుందా?" అని అడిగాడు.

శ్రోణుడు నవ్వుతూ "లేదు భంతే! వీణ తీగలు వదులుగా ఉంటే ఎలాంటి సంగీతం రాదు" అన్నాడు.

"ఒకవేళ తీగలు బాగా బిర్రుగా బిగించి ఉంటే మంచి ధ్వని వస్తుందా?" అని ప్రశ్నించాడు బుద్ధుడు.

"రాదు మహాశయా! ఆ తంత్రులను తాకిన వెంటనే అవి తెగిపోతాయి. ఇక శ్రావ్యమైన సంగీతం ఎలా వస్తుంది?" అన్నాడు.

"మరి వీణ నుంచి మంచి సంగీతం ఎప్పుడు వస్తుంది? అని అడిగాడు బుద్ధుడు.

"తంత్రులు పూర్తిగా వదులుగా కానీ, బిగువుగా కానీ లేకుండా... మధ్యస్థాయిలో ఉన్నప్పుడు" అని బదులిచ్చాడు శ్రోణుడు.

"ఈ విషయమే నీకు గుర్తు చేద్దామని వచ్చాను. ఆ వీణ ఎలాంటిదో... ఈ జీవన వీణ కూడా అలాంటిదే. అతిగా తిన్నా, పూర్తిగా తినకుండా ఉన్నా, అతిగా నిద్రపోయినా, ఎప్పుడూ మేలుకొనే ఉన్నా... నీ జీవితం ఆనందమయం కాదు, సుమధుర సంగీతభరితం కాదు. మనది మధ్యేమార్గం. ఆ చివరికో, ఈ చివరికో వెళ్ళి పతనం కాకూడదు" అని బోధించాడు.

"అర్థమయింది భగవాన్!" అంటూ బుద్ధ భగవానుడి పాద పద్మాలపై తల ఉంచి నమస్కరించాడు శ్రోణుడు.

• రాచమడుగు శ్రీనివాసులు

బిజినెస్

కొత్త జీడీపీ సిరీస్ ఆధారంగా నేడే క్యూ3 గణాంకాలు

న్యూఢిల్లీ: బేస్ సంవత్సరం 2022-23ని పరిగణనలోకి తీసుకుని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి (అక్టోబరు-డిసెంబరు) జీడీపీ గణాంకాలను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేయనుంది. జీడీపీ కొత్త సిరీస్‌లో ఈ-వాహన్, వంటవారు, డ్రైవర్లు, ఇంటి పనులు చేసే వారందించే సేవలపై జీఎస్‌టీ గణాంకాలు కూడా ఉంటాయి. దీనివల్ల ఆర్థిక గణాంకాల్లో మరింత సమగ్రత వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. గతంలో బేస్ సంవత్సరం 2011-12 ఉండేది. వాస్తవానికి ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఈ సిరీస్‌ను కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ మార్చుతూ ఉంటుంది. కాని కరోనా మహమ్మారి కారణంగా సిరీస్ మార్పును వాయిదా వేసినందు వల్ల కొంత అధిక వ్యత్యాసం ఏర్పడింది. ఇదిలా ఉండగా టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) బేస్ సంవత్సర సవరణపై కూడా కసరత్తు జరుగుతోంది. అప్పటివరకు పాత బేస్ సంవత్సరాన్నే పరిగణనలోకి తీసుకుంటారు.

• యాక్సిస్ బ్యాంక్.. తన కమర్షియల్ బ్యాంకింగ్ గ్రూప్ (సీబీజీ) కోసం అవసరమైన రిలేషన్‌షిప్ మేనేజర్ల కోసం అడ్డా ఎడ్యుకేషన్‌తో జట్టు కట్టింది. ఈ ఒప్పందంలో భాగంగా హైర్-ట్రైన్-డిప్లాయ్ (హెచ్‌టీడీ) కార్యక్రమం ద్వారా ఈ మేనేజర్లను నియమించుకోనుంది. శరవేగంగా వృద్ధి చెందుతున్న ఎస్ఎంఈ విభాగాన్ని మరింత పటిష్ఠం చేసేందుకు వీరు తోడ్పడతారని బ్యాంక్ వెల్లడించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



27వ తేదీ			
హైదరాబాద్	470	విజయవాడ	500
వరంగల్	472	గోదావరి	480
చిత్తూరు	533	విశాఖపట్నం	485
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	135	విజయవాడ	135
వరంగల్	135	గుంటూరు	137
కరీంనగర్	135	ఒంగోలు	137
మహబూబ్‌నగర్	135	చిత్తూరు	124
కర్నూలు	135	నెల్లూరు	129
విశాఖపట్నం	135	అనంతపురం	129
గోదావరి	135		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,61,680 ▼	1,48,200 ▼	2,95,000 ▲
విజయవాడ	1,63,000 ▲	1,52,000 ▲	2,67,000 ▼
విశాఖపట్నం	1,63,000 ▼	1,47,600 ▼	2,95,000 ▲
రాజమండ్రి	1,61,020 ▼	1,47,600 ▼	2,66,000 ▲
ప్రొద్దుటూరు	1,57,300 ▼	1,44,720 ▼	2,72,000 ▼
ముంబై	1,58,022 ▼	1,44,748 ▼	2,60,667 ▼

ఎంఎఫ్ రంగంలో సెబీ భారీ సంస్కరణలు

ఐదు తరగతులుగా పథకాల వర్గీకరణ

పిల్లలు, రిటైర్మెంట్ పథకాలకు గుడ్‌బై • కొత్తగా లైఫ్ సైకిల్ ఫండ్స్ పథకాలు

న్యూఢిల్లీ: దేశ మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) పరిశ్రమలో భారీ సంస్కరణలకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ శ్రీకారం చుట్టింది. ఇందుకు సంబంధించి గురువారం ఒక సర్క్యులర్ జారీ చేసింది. ఎంఎఫ్ పథకాలను ఈక్విటీ, డెట్, హైబ్రిడ్, లైఫ్ సైకిల్, ఇతర పథకాల పేరుతో ఐదు రకాలుగా వర్గీకరించింది. ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్ఓఎఫ్) పథకాలు, ఇండెక్స్ లేదా ఈటీఎఫ్‌ల వంటి పాసివ్ పథకాలను 'ఇతర' పథకాల్లో చేర్చింది. ఈ సంస్కరణల్లో భాగంగా ఇప్పటి వరకు రిటైర్మెంట్, పిల్లల చదువులు, పెళ్లిళ్ల వంటి నిర్ణీత అవసరాల కోసం ఉద్దేశించిన సొల్యూషన్ ఓరియెంటెడ్ మ్యూచువల్ ఫండ్ పథకాలకు సెబీ గుడ్‌బై చెప్పింది. ఈ పథకాల్లో తాజా పెట్టుబడుల స్వీకరణను వెంటనే ఆపివేయాలని కూడా ఎంఎఫ్‌లను ఆదేశించింది. తన ముందస్తు అనుమతితో ఈ పథకాలను అదే తరహా రిస్క్, పెట్టుబడుల కేటాయింపులు ఉండే ఇతర పథకాల్లో విలీనం చేయాలని స్పష్టం చేసింది.

పేర్లలోనూ స్పష్టత

మ్యూచువల్ ఫండ్ సంస్థలు తమ పథకాల ప్రకటనల్లోనూ మరింత పారదర్శకంగా వ్యవహరించాలని సెబీ స్పష్టం చేసింది. పథకం ఏ క్యాటగిరికి చెందినది, దాని లక్ష్యాలను సెబీ మార్గదర్శకాలకు అనుగుణంగా స్పష్టంగా ఆఫర్ డాక్యుమెంట్, ప్రకటనల్లోనూ స్పష్టం చేయాలి. పథకం పేరు చివర్లోనూ ఆ పథకం ఏ క్యాటగిరికి చెందినదో కూడా స్పష్టం చేయాలని కోరింది. అలాగే పథకాల పేర్లలో ఎక్కడా ఆ పథకం నుంచి వచ్చే రాబడుల ప్రస్తావన ఉండకూడదని స్పష్టం చేసింది. ఈ చర్యల ద్వారా రిటైల్ మదుపరులకు రోజురోజుకి కఠినంగా మారుతున్న ఎంఎఫ్ పెట్టుబడులను సెబీ సులభతరం చేసిందని చాయిస్ వెల్త్ సీఈఓ నికుంజ్ సరాఫ్ చెప్పారు.



హద్దులపైనా..

ఆయా పథకాల్లో ఎంఎఫ్ సంస్థల పెట్టుబడుల పరిమితులనూ సెబీ స్పష్టం చేసింది. ఈక్విటీ, డెట్, హైబ్రిడ్, లైఫ్ సైకిల్, ఇతర పథకాలన్నీ తమ తమ క్యాటగిరికి వర్తించే నిబంధనలకు లోబడి మాత్రమే ఆయా ఆస్తుల్లో పెట్టుబడులు పెట్టాలని పేర్కొంది. ఇండెక్స్ ఫండ్స్, ఈటీఎఫ్‌లు తమ మొత్తం నిధుల్లో కనీసం 95 శాతం మొత్తాన్ని ఆ ఇండెక్స్‌కు సంబంధించిన సెక్యూరిటీల్లోనే మదుపు చేయాలి. ఫండ్ ఆఫ్ ఫండ్స్‌కీ ఇదే సూత్రం వర్తిస్తుందని సెబీ తెలిపింది.

ఇతర ప్రధాన మార్పులు

- ఈక్విటీ పథకాలు తమ నిధుల్లో 35 శాతం వరకు బంగారం, వెండిలో పెట్టుబడులు పెట్టేందుకు అనుమతి
- రుణ పత్రాల మెచ్యూరిటీ గడువు ఐదేళ్ల లోపు ఉంటే వాటి పరపతి రేటింగ్ కనీసం డబుల్ ఏ లేదా అంతకు మించి ఉండాలి
- రుణ పత్రాల కాలపరిమితి కూడా మ్యూచువల్ ఫండ్ పథకాల కాలపరిమితికి లోబడి ఉండాలి
- ఎంఎఫ్‌లు ఇక తమ పథకాల పెట్టుబడులు దేన్లోనైనా పరిమితికి మించి ఉంటే ప్రతి నెలా ఆ విషయాన్ని తమ వెబ్‌సైట్లలో పోస్టు చేయాలి
- ఎంఎఫ్‌లు జారీ చేసే ఫండ్ ఆఫ్ ఫండ్స్‌పై పరిమితులు
- ప్రస్తుత పథకాలన్నీ 6నెలల్లోగా కొత్త నిబంధనలకు అనుగుణంగా మారాలి
- సెబీ నియంత్రణ పరిధిలోకి వచ్చే సంస్థలు, ఏజెంట్లు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో ఏదైనా మార్కెట్ విషయాలు లేదా సెక్యూరిటీల గురించి పోస్టులు పెట్టేటప్పుడు తమ పేరు, రిజిస్ట్రేషన్ నంబరు వెల్లడించాలి
- ఏప్రిల్ 1 నుంచి ఎంఎఫ్‌లు తమ పథకాల నిర్వహణలో ఉన్న బంగారం, వెండి నిల్వల విలువను గుర్తింపు పొందిన స్టాక్ ఎక్స్ఛేంజీలు ప్రకటించే స్పాట్ ధర ఆధారంగా లెక్కించాలి
- లైఫ్ సైకిల్ పథకాల కనీస కాలపరిమితి ఐదు నుంచి ఆరు సంవత్సరాలు
- ప్రారంభించి ఏడాది కూడా పూర్తికాని పథకాలను యూనిట్ హోల్డర్ల అనుమతితో అదే కాలపరిమితి ఉన్న లైఫ్ సైకిల్ పథకాల్లో విలీనం చేయాలి
- 5, 10, 15, 20, 25, 30 సంవత్సరాల మెచ్యూరిటీతో మాత్రమే లైఫ్ సైకిల్ పథకాలు ప్రారంభించాలి
- ఈక్విటీ పథకాలు అన్నిటిలో కనీసం 65 నుంచి 75 శాతం ఈక్విటీ పెట్టుబడులు ఉండాలి.

లైఫ్ సైకిల్ ఫండ్స్ కాలపరిమితి 5 నుంచి 30 ఏళ్లు

సొల్యూషన్ ఓరియెంటెడ్ ఫండ్స్ స్థానంలో సెబీ కొత్తగా లైఫ్ సైకిల్ ఫండ్స్ పేరుతో ప్రత్యేక క్యాటగిరి ఫండ్స్ ప్రవేశపెట్టింది. ఈ ఫండ్స్ కాలపరిమితి ఐదు నుంచి 30 సంవత్సరాలు. తమ జీవిత లక్ష్యాలకు అనుగుణంగా మదుపరులు ఈ ఓపెన్ ఎండెడ్ పథకాలను ఎంచుకోవచ్చు. అయితే ఈ పథకాల కాలపరిమితి ముగిసే వరకు పెట్టుబడులు వెనక్కి తీసుకోవడాన్ని అనుమతించరు. ఒకవేళ ఏడాది నుంచి మూడేళ్లలోపు వెనక్కి తీసుకుంటే ఒకటి నుంచి మూడు శాతం ఎగ్జిట్ లోడ్ చెల్లించాలి. ఈ పథకాల పెట్టుబడుల కోసం ఎంఎఫ్‌లు క్రమానుగత పెట్టుబడుల విధానం అనుసరిస్తాయి. ఈ విధానంలో ముందు అధిక నష్టభయంతో పాటు అధిక రాబడులకు అవకాశం ఉన్న ఈక్విటీ షేర్లలో ఎక్కువ పెట్టుబడులు పెడతారు. తరువాత క్రమంగా ఈక్విటీ పెట్టుబడులు తగ్గించుకుంటూ, పెద్దగా నష్టభయం లేకుండా స్థిరమైన రాబడులు ఇచ్చే రుణపత్రాల్లో పెట్టుబడులు పెంచుతారు. దీనివల్ల రిటైర్మెంట్, పిల్లల చదువులు, పెళ్లిళ్ల వంటి మదుపరులు లక్ష్యాలు నెరవేరతాయి.

సామ్‌సంగ్ గెలాక్సీ ఎస్26 సిరీస్



న్యూఢిల్లీ: సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ మూడో తరం ఏఐ స్మార్ట్‌ఫోన్.. గెలాక్సీ ఎస్26 సిరీస్‌ను ఆవిష్కరించింది. గెలాక్సీ ఎస్26, ఎస్26 ప్లస్, ఎస్26 అల్ట్రా పేరుతో ఈ స్మార్ట్‌ఫోన్స్‌ను తీసుకువచ్చింది. ఇందులో ఎస్26 అల్ట్రాను ప్రపంచంలోనే తొలిసారిగా ప్రైవసీ డిస్‌ప్లేతో రూపొందించినట్లు వెల్లడించింది. అంతేకాకుండా 7.9 ఎంఎంతో తీసుకువచ్చిన అత్యంత పలుచటి అల్ట్రా స్మార్ట్‌ఫోన్ అని తెలిపింది. 12 జీబీ ప్లస్ 256 జీబీ వేరియంట్‌తో కూడిన ఈ అల్ట్రా స్మార్ట్‌ఫోన్ ప్రారంభ ధర రూ.1,39,999 అని పేర్కొంది. కాగా ఎస్ 26 ప్లస్ ప్రారంభ ధర రూ.1,19,999గా ఉండగా ఎస్ 26 ప్రారంభ ధర రూ.87,999గా ఉంది. కృత్రిమ మేధ (ఏఐ)ను కేవలం ప్రీమియం ఫోన్లకే పరిమితం చేయకుండా ఎంట్రీ-లెవల్ స్మార్ట్ ఫోన్లలోనూ ప్రవేశపెట్టాలని చూస్తున్నట్లు సామ్‌సంగ్ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజు పుల్లన్ తెలిపారు. భారత్‌లో ఇప్పటికే ఎంట్రీ-లెవల్ విభాగంలో 'గెలాక్సీ ఏ07 5జీ' ద్వారా ఈ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. గెలాక్సీ ఏ సిరీస్ విక్రయాల్లో ఈ ఏడాది 10 కోట్ల మైలురాయిని సాధించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

2030 నాటికి రూ.45.46 లక్షల కోట్లకు..

భారత జెన్ ఎక్స్ వస్తు, సేవల వినియోగంపై రెడ్‌సీర్ అంచనా

న్యూఢిల్లీ: భారత వినియోగ శక్తికి జెనరేషన్ ఎక్స్ (45 నుంచి 60 ఏళ్ల వయసువారు) ప్రధాన చోదకమని కన్సల్టింగ్ కంపెనీ రెడ్‌సీర్ పేర్కొంది. 2029-30 ఆర్థిక సంవత్సరం నాటికి భారత జెన్ ఎక్స్ వస్తు, సేవల వినియోగ విలువ 50,000 కోట్ల డాలర్లకు (రూ.45.46 లక్షల కోట్లు) చేరుకోవచ్చని అంచనా వేసింది. ఆరోగ్యం, పర్యాటకం, సౌందర్య రక్షణ, విద్య రంగా ల్లో ప్రీమియం ఉత్పత్తులు, సేవలకు వీరే ప్రధాన వినియోగదారులని అంటోంది. గణనీయంగా పెరుగుతున్న వీరి తలసరి వినియోగం ఇందుకు దోహదపడనుందని అభిప్రాయపడింది. జెన్ ఎక్స్ ఆర్థిక భద్రత, డిజిటల్ ధీమా, విలువల పట్ల స్పష్టత కలిగి ఉన్నప్పటికీ, భారత వినియోగంలో వీరు అత్యంత తక్కువగా అంచనా వేయబడిన శక్తి అని రెడ్‌సీర్ స్ట్రాటజీ కన్సల్టెంట్ భాగస్వామి మ్రిగాంక్ గుట్గుటియా అన్నారు. ఈ తరం విచక్షణాపూర్వక ఖర్చు నుంచి ఆరోగ్య సంరక్షణ, పర్యాటక అనుభూతి, అందంగా డిజైన్ చేసిన నాణ్యమైన ఇళ్ల కోసం ఆలోచనపూర్వకంగా వెచ్చిస్తున్నారని అన్నారు.

- ఏఐ ప్లస్ స్మార్ట్‌ఫోన్.. ఏఐఓటీ ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకువచ్చింది. నోవాపాడ్స్, నోవావాచ్‌తో ఈ ఐఓటీ ఉత్పత్తులను విడుదల చేసింది. శుక్రవారం నుంచి ఈ ఉత్పత్తులు ఫ్లిప్‌కార్ట్‌లో అందుబాటులో ఉండనున్నాయి. వీటితో పాటు పల్స్ 2, నోవా 2 సిరీస్ పేరుతో స్మార్ట్‌ఫోన్లను తీసుకువస్తున్నట్లు ప్రకటించింది. ఈ స్మార్ట్‌ఫోన్స్ మార్చి 2న విడుదల చేయనున్నట్లు వెల్లడించింది.
- అనియంత్రిత మార్కెట్ల ద్వారా విక్రయిస్తున్న అక్రమ పత్తి విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ నిపుణులు, విత్తన పరిశ్రమ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. వీటి ద్వారా రైతులు అనూహ్యమైన నష్టాలను ఎదుర్కొనాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. ఈ విత్తనాలను ఉపయోగించటం ద్వారా కొన్ని ప్రాంతాల్లో పత్తి దిగుబడి 10-15 క్వింటాళ్ల నుంచి 4-6 క్వింటాళ్లకు పడిపోయిందని ప్రతినిధులు వెల్లడించారు.
- ఒర్బియా ప్రెసిషన్ అగ్రికల్చర్‌కు చెందిన నెటాఫిమ్‌తో జట్టు కట్టినట్లు అమెజాన్ ఇండియా ప్రకటించింది. ఇందులో భాగంగా హైదరాబాద్, బెంగళూరు సమీప ప్రాంతాల్లోని వ్యవసాయ భూముల్లో సాంప్రదాయ ఫ్లడ్ ఇరిగేషన్ స్థానంలో డ్రిప్ ఇరిగేషన్‌ను వినియోగించటం ద్వారా 32.5 కోట్ల లీటర్ల నీటిని ఆదా చేయనున్నట్లు వెల్లడించింది.

ఆద్యంతం ఊగిసలాటలే..

• సూచీల మిశ్రమ ముగింపు

ముంబై: ఆద్యంతం తీవ్ర ఊగిసలాటలకు లోనైన ప్రామాణిక ఈక్విటీ సూచీలు చివరికి మిశ్రమంగా ముగిశాయి. ఆసియా మార్కెట్ సానుకూల సంకేతాలతో గురువారం ఆరంభ ట్రేడింగ్‌లో 303 పాయింట్ల వరకు ఎగబాకిన సెన్సెక్స్.. ఎఫ్ఎంసీజీ, ఆర్థిక సేవలు, రియల్టీ షేర్లలో లాభాల స్వీకరణ కారణంగా ఇంట్రాడే గరిష్ఠం నుంచి 608 పాయింట్ల మేర పతనమైంది. చివరికి 27.46 పాయింట్ల నష్టంతో 82,248.61 వద్ద ముగిసింది. నిఫ్టీ మాత్రం 14.05 పాయింట్ల లాభంతో 25,496.55 వద్ద స్థిరపడింది. అమెరికా- ఇరాన్ మధ్య ప్రతిపాదిత అణు చర్చలు, ఐటీ రంగంలో ఏఐ ఆందోళనలు, సుంకాల అనిశ్చితుల నేపథ్యంలో ఈక్విటీ మదుపరులు అప్రమత్త ధోరణిని కనబరిచారని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు.

స్పోర్ట్స్

అన్నీ మంచి శకునములే..

అంతా ఆశించినట్టే జరుగుతోంది. సఫారీలు వెస్టిండీస్‌ను చిత్తుగా ఓడించాలని కోరుకున్నాం...అదే జరిగింది. మనోళ్లు జింబాబ్వేపై ఘనవిజయం సాధించాలనుకున్నాం...అదీ జరిగింది. ఆపరేషన్ సెమీస్‌లో ఇప్పుడిక ఒకటే మిగిలింది. అది...ఆదివారం జరిగే పోరులో వెస్టిండీస్‌ను ఓడించడం. ఆ ఒక్క పనీ పూర్తిచేస్తే మనకు సెమీస్ బెర్తు... విండీస్‌కు ఇంటికి ఫ్లైట్ టిక్కెట్ ఖరారవుతాయి.

సెమీస్‌కు సఫారీలు

వెస్టిండీస్‌పై 9 వికెట్లతో గెలుపు



మార్‌క్రమ్ (82 నాటౌట్)

మార్‌క్రమ్ హాఫ్ సెంచరీ • బెంబేలెత్తించిన బౌలర్లు

అహ్మదాబాద్: టీ20 ప్రపంచ కప్‌లో దక్షిణాఫ్రికా జోరు కొనసాగుతోంది. టోర్నమెంట్‌లో అజేయ రికార్డును కొనసాగిస్తూ ఆరో విజయం అందుకుంది. తొలుత పేసర్లు, ఆపై బ్యాటర్లు అద్భుతంగా రాణించిన వేళ..మెగా టోర్నీలో మరో అజేయ జట్టు వెస్టిండీస్‌కు ఏకంగా తొమ్మిది వికెట్లతో షాకిచ్చింది. ఇంకో రెండు పాయింట్లు ఖాతాలో వేసుకొని సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లింది.. గురువారం జరిగిన మ్యాచ్‌లో తొలుత కరీబియన్లు 20 ఓవర్లలో 176/8 స్కోరుకే పరిమితమయ్యారు. రొమారియో షెప్పర్డ్ (37 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సలతో 52 నాటౌట్), జాసన్ హోల్డర్ (31 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సలతో 49) తప్ప అంతా విఫలమయ్యారు. ఎన్‌గిడి మూడు, రబాడ, బాష్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో టాపార్డర్ శివాలెత్తడంతో సఫారీలు 16.1 ఓవర్లలో 177/1 స్కోరు చేసి సునాయాసంగా గెలుపొందారు. కెప్టెన్ మార్‌క్రమ్ (46 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సలతో 82 నాటౌట్), డికాక్ (24 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సలతో 47), ర్యాన్ రికెల్టన్ (28 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సలతో 45 నాటౌట్) దుమ్ము రేపారు. మార్‌క్రమ్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

టాపార్డర్ ఫటాఫట్

ఛేదనలో దక్షిణాఫ్రికా టాపార్డర్ బ్యాటర్లు ధనాధన్ షాట్లతో చెలరేగారు. మార్‌క్రమ్, డికాక్ తొలి బంతి నుంచే విరుచుకు పడడంతో పవర్ ప్లేలో సఫారీలు 69/0తో తిరుగులేని స్థితిలో నిలిచారు. ప్రత్యర్థి పేసర్లు, స్పిన్నర్లను లక్ష్యంగా చేసుకొని ఆడిన మార్‌క్రమ్, డికాక్ మొదటి వికెట్‌కు 48 బంతుల్లోనే 95 పరుగులు జోడించారు. ఈ దశలో డికాక్ నిష్క్రమించినా..వన్‌డౌన్ బ్యాటర్ రికెల్టన్ కూడా దూకుడు ప్రదర్శించడంతో విండీస్ బౌలర్లకు దిక్కుతోచలేదు. ఇక..సూపర్ ఫామ్‌లో ఉన్న మార్‌క్రమ్ టోర్నీలో మూడో హాఫ్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. మార్‌క్రమ్, రికెల్టన్ రెండో వికెట్‌కు 50 బంతుల్లో అభేద్యంగా 82 పరుగులు జత చేసి జట్టును విజయ తీరాలకు చేర్చారు.

విండీస్ విలవిల

భారీ హిట్టర్లతో నిండిన వెస్టిండీస్ జట్టు దక్షిణాఫ్రికా పేసర్ల ధాటికి కుదేలైంది. దాంతో 11వ ఓవర్‌కు 83/7 స్కోరుతో కనీసం వంద పరుగులైనా చేయగలుగుతుందా..అనిపించింది. అయితే షెప్పర్డ్, హోల్డర్ అసమానంగా పోరాడి ఎనిమిదో వికెట్‌కు 89 పరుగులు (57 బంతులు) జోడించడంతో వెస్టిండీస్ పోటీ ఇచ్చే స్కోరు అందుకుంది. షెప్పర్డ్, హోల్డర్ భాగస్వామ్యం టీ20లలో ఎనిమిదో వికెట్‌కు రికార్డు కావడం విశేషం.

స్కోరుబోర్డు

వెస్టిండీస్: కింగ్ (సి) డికాక్ (బి) ఎన్‌గిడి 21, హోప్ (సి) డికాక్ (బి) రబాడ 16, హెట్‌మయెర్ (సి) కేశవ్ (బి) రబాడ 2, పొవెల్ (సి) బ్రెవిస్ (బి) ఎన్‌గిడి 9, చేజ్ (బి) ఎన్‌గిడి 2, రూథర్‌ఫోర్డ్ (సి) డికాక్ (బి) బాష్ 12, హోల్డర్ (రనౌట్-డికాక్/బాష్) 49, ఫోర్డ్ (సి) రికెల్టన్ (బి) బాష్ 11, షెప్పర్డ్ (నాటౌట్) 52, మోటీ (నాటౌట్) 0 ; **ఎక్స్‌ట్రాలు : 2 ; మొత్తం 20 ఓవర్లలో 176/8 ; వికెట్లపతనం :** 1-29, 2-31, 3-41, 4-43, 5-60, 6-71, 7-83, 8-172 ; **బౌలింగ్ :** కేశవ్ మహరాజ్ 4-0-43-0, యాన్సెన్ 4-0-50-0, రబాడ 4-0-22-2, ఎన్‌గిడి 4-0-30-3, బాష్ 4-0-31-2.

దక్షిణాఫ్రికా: మార్‌క్రమ్ (నాటౌట్) 82, డికాక్ (సి) హోల్డర్ (బి) చేజ్ 47, రికెల్టన్ (నాటౌట్) 45 ; **ఎక్స్‌ట్రాలు : 3 ; మొత్తం : 16.1 ఓవర్లలో 177/1 ; వికెట్ పతనం:** 1-95 ; **బౌలింగ్:** మాథ్యూ ఫోర్డ్ 3-0-30-0, రొమారియో షెప్పర్డ్ 2-0-22-0, హోల్డర్ 3.1-0-31-0, షమార్ జోసెఫ్ 2-0-24-0, గుడకేష్ మోటీ 2-0-24-0, రోస్టన్ చేజ్ 4-0-46-1.

ఒత్తిడంతా ఒక్కసారిగా ఎగిరిపోయింది.. భారత్ మళ్లీ గాడిలో పడింది. సూపర్-8లో దక్షిణాఫ్రికా చేతిలో ఓటమితో సూర్యసేన సెమీస్ అవకాశాలపై ఒక్కసారిగా నీలినీడలు కమ్ముకున్నాయి. కానీ, జింబాబ్వేపై సాధికార విజయంతో టీమిండియా నాకౌట్ ఆశలను నిలబెట్టుకొంది. ముఖ్యంగా తడబడుతూ సాగుతున్న భారత బ్యాటర్లు.. ఈ మ్యాచ్‌లో సత్తాచాటారు. వరుస వైఫల్యాలతో విమర్శలు ఎదుర్కొంటున్న అభిషేక్ శర్మ, తిలక్ వర్మ ఫామ్‌లోకి రావడం శుభపరిణామం.



అభిషేక్ (30 బంతుల్లో 55)

ఆట అదిరె.. ఆశలు నిలిచె!

72 రన్స్‌తో భారత్ ఘన విజయం

మెరిసిన హార్దిక్, అభిషేక్, తిలక్

జింబాబ్వే అవుట్

చెన్నై: బ్యాటర్లు రాణించడంతో.. టీ20 వరల్డ్‌కప్ సెమీస్ ఆశలను భారత్ సజీవంగా నిలబెట్టుకొంది. సూపర్-8లో భాగంగా గురువారం గ్రూప్-1లో జరిగిన కీలక మ్యాచ్‌లో టీమిండియా 72 పరుగుల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. తొలుత భారత్ 20 ఓవర్లలో 256/4 స్కోరు చేసింది. అభిషేక్ శర్మ (30 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సలతో 55), హార్దిక్ పాండ్యా (23 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సలతో 50 నాటౌట్) హాఫ్ సెంచరీలు సాధించగా.. తిలక్ వర్మ (16 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సలతో 44 నాటౌట్) సత్తాచాటాడు. సికందర్ రజా, ముజరబాని, ఎన్‌గరవ తలో వికెట్ పడగొట్టారు. ఛేదనలో జింబాబ్వే ఓవర్లన్నీ ఆడి 184/6 స్కోరు చేసింది. బ్రియాన్ బెన్నెట్ (97 నాటౌట్) ఒంటరి పోరాటం చేశాడు. అర్ష్‌దీప్ 3 వికెట్లు పడగొట్టాడు. ఈ ఓటమితో నాకౌట్ రేసు నుంచి జింబాబ్వే అవుటైంది. కాగా, సెమీస్ బెర్త్ కోసం ఆదివారం జరిగే బంపర్ మ్యాచ్‌లో వెస్టిండీస్‌తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. పాండ్యా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

ముందుగానే వదిలేశారు..

భారీ లక్ష్యాన్ని జింబాబ్వే ఏదశలోనూ ఛేదించే విధంగా కనిపించలేదు. బెన్నెట్ భారీ అర్ధ శతకంతో రాణించినా.. విజయం కోసం తెగించలేక పోయాడు. సగం ఓవర్లు ముగిసే సరికి రన్‌రేట్ 20కిపైగా చేరుకోవడంతో.. జింబాబ్వే ఓటమి లాంఛనమేనని అర్థమైంది. ఓపెనర్లు బెన్నెట్, మరుమణి జట్టుకు నిలకడైన ఆరంభాన్నిచ్చారు. వీరిద్దరూ వీలుచిక్కినప్పుడల్లా షాట్లు ఆడుతూ స్కోరుబోర్డును నడిపించడంతో.. జింబాబ్వే 44/0తో పవర్‌ప్లేను ముగించింది. కానీ, ఆ తర్వాతి ఓవర్‌లోనే మరుమణిని అక్షర్ క్యాచవుట్ చేసి.. టీమిండియాకు బ్రేక్ అందించాడు. అయితే, 9వ ఓవర్‌లో అక్షర్ బౌలింగ్‌లో బెన్నెట్ 6,4,6తో ఒక్కసారిగా గేర్ మార్చాడు. కానీ, మేయర్స్ (6)ను వరుణ్ పెవిలియన్ చేర్చాడు. ఈ దశలో బెన్నెట్, కెప్టెన్ సికందర్ (31) మూడో వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. కావాల్సిన రన్‌రేట్ భారీగా పెరిగిపోవడంతో.. వీరిద్దరూ ఓటమి అంతరాన్ని తగ్గించడానికే ప్రయత్నించారు. 15వ ఓవర్‌లో దూబే బౌలింగ్‌లో రెండు ఫోర్లు, రెండు సిక్సలతో 26 పరుగులు రాబట్టిన బెన్నెట్ సెంచరీ దిశగా సాగాడు. కానీ, రజా, బర్ల్ (0)తోపాటు మన్యోంగా (11)ను అర్ష్‌దీప్ వెనక్కిపంపాడు. చివరి ఓవర్‌లో మూసేకివ (7)ను దూబే అవుట్ చేసినా.. 6,4 బాదిన బెన్నెట్ వంద మార్క్‌కు మాత్రం చేరుకోలేక పోయాడు.

కలిసి కొట్టారు..

బ్యాటర్లు సమష్టిగా చెలరేగడంతో.. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ భారీ స్కోరు చేసింది. టోర్నీలో తొలిసారి ఓపెనర్లు సంజూ శాంసన్ (24) అభిషేక్ శుభారంభాన్ని అందించారు. కిషన్ స్థానంలో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన సంజూ.. మొదటి రెండు ఓవర్లు దాదాపుగా తానే ఎదుర్కోవడంతో శర్మపై ఒత్తిడి తగ్గింది. తొలి ఓవర్‌లోనే 4,6 బాదిన శాంసన్.. ఆ తర్వాత ఓవర్‌లో మరో సిక్స్ కొట్టాడు. 3వ ఓవర్‌లో మపోసా బౌలింగ్‌లో రెండు ఫోర్లు, సిక్స్‌తో టచ్‌లోకి వచ్చిన అభిషేక్.. ఏకంగా 23 పరుగులు రాబట్టాడు. అయితే, భారీ స్కోరు చేస్తాడని భావించిన సంజూ మరోసారి వికెట్ పారేసుకొన్నాడు. ముజరబాని బౌలింగ్‌లో అతడు క్యాచవుట్ కావడంతో.. తొలి వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక, వన్‌డౌన్‌లో వచ్చిన ఇషాన్ కిషన్ (38) కూడా రెండు ఫోర్లు బాదడంతో.. పవర్‌ప్లేలో భారత్ 80/1 స్కోరు చేసింది. మధ్య ఓవర్లలో కూడా టీమిండియా బ్యాటర్లు ఇదే జోరు చూపడంతో రన్‌రేట్ ఎక్కడా తగ్గలేదు. 11వ ఓవర్‌లో సికందర్ బౌలింగ్‌లో అభిషేక్ సింగిల్‌తో టోర్నీలో తొలి ఫిఫ్టీ నమోదు చేసినా.. 4,6 కొట్టిన కిషన్ క్యాచవుట్ అయ్యాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 72 పరుగులు జోడించారు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ సూర్యకుమార్ (33) బౌండ్రీతో ఖాతా తెరిచాడు. ఇవాన్స్ బౌలింగ్‌లో ముజరబాని క్యాచ్ చేజార్చడంతో బతికిపోయిన సూర్య 4,6తో బ్యాట్‌కు పనిచెప్పాడు. కానీ, అభిషేక్‌ను మపోసా అవుట్ చేసి దెబ్బకొట్టాడు. ధాటిగా ఆడే క్రమంలో సూర్య కూడా వెనుదిరిగాడు.

పాండ్యా, తిలక్ పోటాపోటీ..

డెత్ ఓవర్లలో పాండ్యా, తిలక్ ఎడాపెడా షాట్లతో.. ఐదో వికెట్‌కు 31 బంతుల్లో 84 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పడంతో టీమ్ స్కోరు 250 మార్క్ దాటింది. ఎదుర్కొన్న తొలి బంతినే బౌండ్రీకి తరలించిన తిలక్.. ఆత్మవిశ్వాసంతో కనిపించాడు. 17వ ఓవర్‌లో ఇవాన్స్ బౌలింగ్‌లో పాండ్యా ఫోర్ కొట్టగా.. తిలక్ సిక్స్ బాదాడు. వీరిద్దరూ పోటీపడి ఆడడంతో ఆ తర్వాతి రెండో ఓవర్లలో 40 పరుగులు లభించాయి. కాగా, ఆఖరి ఓవర్‌లో పాండ్యా రెండు వరుస సిక్సలతో అర్ధ శతకం పూర్తి చేసుకోవడంతోపాటు గ్రాండ్ ఫినిషింగ్ ఇచ్చాడు.



హార్దిక్ (23 బంతుల్లో 50 నాటౌట్)

మారిన వ్యూహం

తీవ్ర విమర్శల నేపథ్యంలో భారత బ్యాటింగ్ ఆర్డర్‌లో భారీ మార్పులు చోటు చేసుకొన్నాయి. ఓపెనర్‌గా శాంసన్‌కు చోటివ్వగా.. అక్షర్ పటేల్ టీమ్‌లోకి వచ్చాడు. రింకూ సింగ్, సుందర్‌పై వేటుపడగా.. ఇషాన్ వన్‌డౌన్‌లో, తిలక్ వర్మ మిడిలార్డర్‌లో బరిలోకి దిగారు. లెఫ్ట్-రైట్ కాంబినేషన్ ఉండేలా జాగ్రత్తలు తీసుకొన్నారు.



తిలక్ (44 నాటౌట్)

పాయింట్ల పట్టిక

గ్రూప్-1

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	ర.రే
దక్షిణాఫ్రికా	2	2	0	0	4	2.890
వెస్టిండీస్	2	1	1	0	2	1.791
భారత్	2	1	1	0	2	-0.100
జింబాబ్వే	2	0	2	0	0	-4.475

గ్రూప్-2

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	ర.రే
ఇంగ్లండ్	2	2	0	0	4	1.491
న్యూజిలాండ్	2	1	0	1	3	3.050
పాకిస్థాన్	2	0	1	1	1	-0.461
శ్రీలంక	2	0	2	0	0	-2.800

మ్యా: మ్యాచ్‌లు; గె: గెలుపు; ఓ: ఓటమి; ర: రద్దు; పా: పాయింట్లు; ర.రే: రన్‌రేట్

స్కోరుబోర్డు

భారత్: శాంసన్ (సి) బర్ల్ (బి) ముజరబాని 24, అభిషేక్ (సి) సికందర్ (బి) మపోసా 55, ఇషాన్ (సి) ఎన్‌గరవ (బి) సికందర్ 38, సూర్య (సి) మూసేకివ (బి) ఎన్‌గరవ 33, హార్దిక్ (నాటౌట్) 50, తిలక్ (నాటౌట్) 44; **ఎక్స్‌ట్రాలు:12; మొత్తం: 20 ఓవర్లలో 256/4; వికెట్ల పతనం:** 1-48, 2-120, 3-150, 4-172; **బౌలింగ్:** ఎన్‌గరవ 4-0-62-1, ముజరబాని 4-0-43-1, మపోసా 2-0-40-1, ఇవాన్ 4-0-52-0, సికందర్ రజా 3-0-29-1, బెన్నెట్ 2-0-16-0, ర్యాన్ బర్ల్ 1-0-10-0.

జింబాబ్వే: బెన్నెట్ (నాటౌట్) 97, మరుమణి (సి) ఇషాన్ (బి) అక్షర్ 20, మేయర్స్ (సి) తిలక్ (బి) వరుణ్ 6, సికందర్ (సి) అభిషేక్ (బి) అర్ష్‌దీప్ 31, బర్ల్ (ఎల్బీ) అర్ష్‌దీప్ 0, మన్యోంగా (బి) అర్ష్‌దీప్ 11, మూసేకివ (సి) సంజూ (బి) దూబే 7, ఇవాన్స్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 184/6; వికెట్ల పతనం:** 1-44, 2-72, 3-144, 4-144, 5-162, 6-173; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-24-3, హార్దిక్ 3-0-21-0, బుమ్రా 3-0-21-0, వరుణ్ 4-0-35-1, అక్షర్ 4-0-35-1, దూబే 2-0-46-1.

256/4

భారత్ చేసిన ఈ స్కోర్.. టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే రెండో అత్యధికం. ఈ టోర్నీలో మాత్రం ఇదే టాప్ స్కోర్. ఇక.. ఓవరాల్‌గా 260/6 స్కోరుతో శ్రీలంక (2007లో కెన్యాపై) టాప్‌లో ఉంది.

భారత్ X ఆస్ట్రేలియా

మహిళల రెండో వన్డే నేడు (హోబర్ట్‌లో)

(ఉదయం 9.20 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..)

సెమీస్‌లో మానవ్ జోడీ



సింగపూర్: భారత అగ్రశ్రేణి టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు మానవ్ ఠక్కర్-మానుష్ షా జోడీ డబ్ల్యూటీటీ సింగపూర్ స్మాష్ సెమీఫైనల్స్‌లో ప్రవేశించింది. గురువారం జరిగిన క్వార్టర్స్‌లో మానవ్-మానుష్ ద్వయం 3-0 (11-8, 11-9, 11-9)తో మార్టిన్ అల్లెగ్రో-అడ్రియన్ రాసెన్ (జర్మనీ) జోడీపై నెగ్గింది. డబ్ల్యూటీటీ స్మాష్ సిరీస్‌లో ఈ టోర్నీ రెండో అత్యున్నతమైనది. ఈ టోర్నీ సెమీస్‌లో ప్రవేశించిన తొలి భారత జోడీ మానవ్-మానుష్‌నే కావడం విశేషం.

మయాంక్ శతకం

రంజీ ఫైనల్

కర్ణాటక 220/5 ● జమ్మూ కశ్మీర్ 584



హుబ్బళ్లి (కర్ణాటక): ఓపెనర్ మయాంక్ అగర్వాల్ (130 బ్యాటింగ్) శతకంతో ఆదుకోవడంతో.. జమ్మూ కశ్మీర్‌తో రంజీ ఫైనల్లో కర్ణాటక పోరాడుతోంది.మూడో రోజైన గురువారం ఆట చివరికి తొలి ఇన్నింగ్స్‌లో కర్ణాటక 220/5 స్కోరు చేసింది. మయాంక్‌తోపాటు కృతిక్ కృష్ణ (27 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. ఓపెనర్ కేఎల్ రాహుల్ (13), కరుణ్ నాయర్ (0), రవిచంద్రన్ స్మరణ్ (0)లను పేసర్ ఆకిబ్ నబీ పెవిలియన్ చేర్చగా.. కెప్టెన్ దేవ్‌దత్ పడిక్కల్ (11)ను సునీల్ అవుట్ చేశాడు. 57/4తో పీకల్లోతు కష్టాల్లో పడిన తరుణంలో మయాంక్, శ్రేయాస్ గోపాల్ (27) ఐదో వికెట్‌కు 105 పరుగుల భాగస్వామ్యంతో గాడిలో పెట్టే ప్రయత్నం చేశారు. అంతకుముందు జమ్మూ తొలి ఇన్నింగ్స్‌లో 584 పరుగులకు ఆలౌటైంది. కాగా, ఒకవేళ మ్యాచ్ డ్రాగా ముగిస్తే.. మొదటి ఇన్నింగ్స్‌లో ఏ జట్టుకు ఆధిక్యం లభిస్తే ఆ టీమ్‌ను విజేతగా ప్రకటిస్తారు.

ఇంగ్లీష్ నేర్చుకోకపోవడం నాకు పెద్ద వెలితి

లియోనెల్ మెస్సీ



బార్సిలోనా: తన సుదీర్ఘ కెరీర్‌లో ఇప్పటికీ ఇంగ్లీష్ భాషను నేర్చుకోకపోవడం చాలా వెలితిగా అనిపిస్తోందని సాకర్ దిగ్గజం లియోనెల్ మెస్సీ అన్నాడు. ఇంగ్లీష్ భాషపై అవగాహన పెంచుకునేందుకు సమయం, అవకాశమున్నా.. దాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయానన్న బాధ ఇప్పటికీ ఉందని ఓ పాడ్‌కాస్ట్‌లో విచారం వ్యక్తం చేశాడు. అర్జెంటీనాకు చెందిన 38 ఏళ్ల మెస్సీకి ఇంగ్లీష్ రాదు.. స్పానిష్ భాషలో మాట్లాడతాడు. అతడి బాల్యం, పాఠశాల జీవితమంతా స్పెయిన్‌లోనే గడిచింది. 'నేను అనేక అంశాలపై ఇప్పటికీ చింతిస్తుంటా. వీటిలో ప్రధానంగా ఇంగ్లీష్ భాష. చిన్నప్పుడే ఇంగ్లీష్ నేర్చుకోవాల్సింది. కనీసం ఆ భాషపై అవగాహన పెంచుకోవాల్సింది. గొప్పవాళ్లు, సెలెబ్రిటీలు కలిసినప్పుడు వాళ్లతో ఇంగ్లీష్‌లో సంభాషించలేక ఇబ్బందిపడ్డ సందర్భాలు ఎన్నో ఉన్నాయి' అని మెస్సీ చెప్పుకొచ్చాడు.

14 బంతుల్లోనే 50

వైభవ్ సంచలనం



ముంబై: చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ దేశవాళీ క్రికెట్‌లో మరో సంచలనం సృష్టించాడు. డీవై పాటిల్ టీ20 కప్‌లో ఇండియన్ నేవీతో జరిగిన మ్యాచ్‌లో డీవై పాటిల్ బ్లూ తరపున వైభవ్ (63) 14 బంతుల్లోనే అర్ధశతకం నమోదు చేశాడు. దీంతో బ్లూ టీమ్ 5 వికెట్ల తేడాతో గెలిచింది.

హైదరాబాద్‌లో హాకీ వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): మహిళల హాకీ వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్‌కు హైదరాబాద్ ఆతిథ్యమిస్తోంది. వచ్చేనెల 8 నుంచి 14 వరకు ఈ పోటీలు గచ్చిబౌలి స్టేడియంలో జరగనున్నాయి. భారత్‌తో పాటు ఆస్ట్రియా, ఇంగ్లండ్, ఇటలీ, కొరియా, స్కాట్లాండ్, ఉరుగ్వే, వేల్స్ బరిలోకి దిగుతున్నాయి.

ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్

ఇంగ్లండ్ X న్యూజిలాండ్ (రా. 7 గం. నుంచి)

1 టీ20 వరల్డ్‌కప్ చరిత్రలో అత్యధిక వికెట్లు సాధించిన భారత బౌలర్‌గా అర్ష్‌దీప్ (35). ఈ క్రమంలో బుమ్రా (33)ను అధిగమించాడు.

వేల సంఖ్యలో క్రమశిక్షణ కేసులు

- విచారణల పెండింగ్‌పై హైకోర్టు ఆందోళన
- పురోగతిపై 4 నెలలకోసారి అఫిడవిట్
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి హైకోర్టు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులపై పెండింగ్‌లో ఉన్న క్రమశిక్షణ చర్యల కేసుల పరిష్కారానికి హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. పరిష్కారమయ్యేవరకు విచారణలను నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపింది. గతేడాది డిసెంబరు 15 నాటికి వివిధ శాఖల్లో 5,424 కేసులు పెండింగ్‌లో ఉండడంపై ఆందోళన వ్యక్తం చేసింది. చార్జ్‌మెమోలతో సంబంధం లేకుండా పదోన్నతి కల్పించాలని, సీనియార్టీ పునరుద్ధరించాలని, పదవీ విరమణ ప్రయోజనాలు కల్పించాలని, జాప్యం కారణంగా క్రమశిక్షణ విచారణలు కొట్టివేయాలని కోరుతూ పెద్ద సంఖ్యలో పిటిషన్లు దాఖలవుతున్నాయని తెలిపింది. దీంతో కోర్టుపై పెండింగ్ కేసుల భారం పెరుగుతోందని వెల్లడించింది. ప్రభుత్వ ఉత్తర్వుల్లో నిర్దేశించిన విధంగా 3 నుంచి 6నెలల వ్యవధిలో పెండింగ్ కేసులను పరిష్కరించాలంది. ప్రతి నాలుగునెలలకు క్రమశిక్షణ కేసుల విచారణల పురోగతిపై అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్)ని ఆదేశించింది. కంటిన్యూస్ మాండమస్‌ను ఉపయోగించి కేసులు పరిష్కారమయ్యేవరకు పర్యవేక్షిస్తామంది. తదుపరి విచారణను జూన్ 19కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.విజయ్ ఇటీవల తీర్పు ఇచ్చారు. తనపై ఉన్న క్రమశిక్షణ చర్యలకు సంబంధించి ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సాధ్యమైనంత త్వరగా ముగించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ విజయవాడ ఈఎస్ ఐ ఆసుపత్రిలో స్పెషల్‌గ్రేడ్ సివిల్ సర్జన్‌గా పనిచేస్తున్న జి.రవికుమార్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. సాధారణ కేసులను మూడునెలల్లో, క్లిష్టమైన కేసులు 6నెలల్లో పరిష్కరించాలని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నప్పటికీ అమలుకావడం లేదన్నారు. పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి.. శాఖలవారీగా ఎన్ని విచారణలు పెండింగ్‌లో ఉన్నాయి? సకాలంలో ఎందుకు ముగించలేకపోతున్నారో చెప్పాలని సీఎస్‌ను ఆదేశించారు. దీంతో బదిలీలు, పదవీ విరమణలు, కొత్తనియామకాలు, డేటా అందకపోవడం, ఫైళ్లు వివిధ కార్యాలయాల్లో ఉండడం వల్ల క్రమశిక్షణ చర్యల కేసుల విచారణలో జాప్యం జరుగుతోందని సీఎస్ హైకోర్టుకు నివేదించారు. శాఖలవారీగా పెండింగ్ కేసుల వివరాలను కోర్టు ముందు ఉంచారు. మొత్తం 5,424 కేసులు పెండింగ్‌లో ఉండగా అత్యధికంగా హోంశాఖలో 1,558, రెవెన్యూశాఖలో 854, రోడ్లు-భవనాలశాఖలో 384, పురపాలక-పట్టణాభివృద్ధిశాఖలో 366 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ స్థాయిలో క్రమశిక్షణ చర్యల కేసులు పెండింగ్‌లో ఉండడం పై న్యాయమూర్తి విస్మయం వ్యక్తం చేశారు. 'విచారణల్లో జాప్యం కారణంగా ఉద్యోగులు తీవ్ర మానసిక వేదనకు గురవుతారు. పదవీ విరమణ ప్రయోజనాలు నిలిచిపోతాయి. ఇది విశ్రాంతి ఉద్యోగికి రాజ్యాంగం ప్రసాదించిన గౌరవప్రదమైన జీవితాన్ని గడిపే హక్కును హరించడమే. క్రమశిక్షణా విచారణలను వేగంగా ముగించాలనేది ఉద్యోగికి ఉన్న ప్రత్యేకమైన హక్కు కాదు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా నిజాయితీ లేని ఉద్యోగులను శిక్షించడంతో పాటు నిజాయితీ కలిగినవారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత ఆయా శాఖలపై ఉంది' అని న్యాయమూర్తి పేర్కొన్నారు.

200 కోట్ల గంజాయి!

- ఒడిశాలో భారీగా లిక్విడ్ గంజాయి పట్టివేత
- మరో రూ.5 కోట్ల ముడి గంజాయి కూడా
- కొరాపుట్ ఎస్పీ రోహిత్‌వర్మ నేతృత్వంలో ప్రత్యేక ఆపరేషన్
- జోలాపుట్ రిజర్వాయర్ గుండా పడవల్లో ఏవోబీకి
- దండకారణ్యంలో అణువణువూ జల్లెడ

సాలూరు రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, ఒడిశాఖ సరిహద్దులోని దండకారణ్యమది! అక్కడికి వెళ్లడం అత్యంత కష్టతరం. ఈ ప్రాంతంలోనే ప్రముఖ నటి అనూష్కశెట్టి ప్రధాన పాత్రగా ఘాటీ సినిమా చిత్రీకరించారు. గంజాయిని ఎలా రవాణా చేయాలనేదే ఈ చిత్రంలో ప్రధాన ఇతివృత్తం! గంజాయిని ద్రవరూపంలోకి మార్చడం, దాన్ని చాకచక్యంగా రవాణా చేయడం చూపించారు. ఆ సన్నివేశాలనే స్మగర్లు ఆదర్శంగా తీసుకున్నట్లున్నారు. ఏవోబీ కొరాపుట్, మల్కన్‌గిరి జిల్లాల పరిధిలోని కటాఫ్ అడవుల్లో ఏకంగా గంజాయిని లిక్విడ్‌గా తయారు చేసే యూనిట్‌నే నెలకొల్పారు. అక్కడ గుట్టుగా గంజాయిని లిక్విడ్‌గా తయారు చేసి ఇతర రాష్ట్రాలకు స్మగింగ్ చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న కొరాపుట్ ఎస్పీ రోహిత్‌వర్మ గురువారం ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. ఆ ప్రాంతానికి చేరుకోవడానికి సిబ్బందితో జోలాపుట్ రిజర్వాయర్‌లో పడవల్లో వెళ్లారు. రిజర్వాయర్ ఒడ్డు నుంచి నిర్దేశిత ప్రాంతానికి కాలినడకన చేరుకున్నారు. తయారీ యూనిట్‌పై దాడి చేశారు. అప్పటికే స్మగర్లు పలాయనం చిత్తగించారు. తయారీ యూనిట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రవాణాకు సిద్ధంగా ఉంచిన 1800 లీటర్ల లిక్విడ్ గంజాయి, మరో రూ.5 కోట్ల విలువైన 1000 కిలోలకు పైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వాటి ధర సుమారు రూ.200 కోట్లు ఉంటుందని చెబుతున్నారు. తయారీదారులను గుర్తించామని, త్వరలో పట్టుకుంటామని కొరాపుట్ ఎస్పీ రోహిత్‌వర్మ, డీఐజీ విశాల్‌సింగ్ వెల్లడించారు.

మరో 5 కోట్ల గంజాయి స్వాధీనం.. నలుగురి అరెస్ట్

మరో ఘటనలో.. నందపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ముంచంగిపుట్ వైపు రెండు వాహనాల్లో రూ.5 కోట్ల విలువైన 1,148 కిలోల గంజాయిని తరలిస్తున్న వారిని గురువారం ఒడిశాలోని నందపూర్ పోలీసులు పట్టుకున్నారు. గంజాయితో పాటు రెండు వాహనాలను సీజ్ చేశారు. గంజాయిని రవాణా చేస్తున్న సిమిలిగుడ, కొరాపుట్‌లకు చెందిన ఇద్దరు, హరియాణాకు చెందిన ఇద్దరిని అరెస్ట్ చేశారు.



ఏవోబీ కారడవిలో కొరాపుట్ పోలీసులు స్వాధీనం చేసుకున్న లిక్విడ్, గంజాయి

గంజాయి రవాణాను కట్టడి చేద్దాం

- పరస్పర సహకారంతో ఏవోబీలో ఆదిలోనే అరికడదాం
- తక్షణ సమాచార మార్పిడికి ప్రత్యేక కమ్యూనికేషన్ వేదిక
- వర్చువల్ సమావేశంలో ఆంధ్రా-ఒడిశా పోలీసుల నిర్ణయం

విజయవాడ సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని గంజాయి మూలాలను ఛేదిందుకు రెండు రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు సన్నద్ధమయ్యారు. ఏవోబీ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే గంజాయిని సమన్వయంతో ఆదిలోనే అరికట్టాలనే గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో నిర్ణయానికి వచ్చారు. ఏపీ ఐజీపీ రవికృష్ణ, ఒడిశా ఐజీపీ డాక్టర్ సార్థక్ సారంగి, సదరన్ రేంజ్ ఐజీపీ నితిశేఖర్, సౌత్ వెస్ట్రన్ రేంజ్ విశాల్‌సింగ్, విశాఖపట్నం రేంజ్ ఐజీపీ గోపీనాథ్, ఎన్‌సీబీ జోనల్ డైరెక్టర్ పంకజ్ ద్వివేది, ఒడిశా జోనల్ డైరెక్టర్ కుల్దీప్‌శర్మ, ఈగల్ అడ్మిన్ నాగేశ్‌బాబుతో పాటు రెండు రాష్ట్రాల్లోని సరిహద్దు జిల్లాల ఎస్పీలు వర్చువల్ సమావేశంలో పాల్గొన్నారు. గత 12 నెలల్లో జరిగిన ఎన్‌డీపీఎస్ ధోరణులపై సమగ్ర నివేదికను ఇరు రాష్ట్రాల పోలీసులు సమర్పించారు. గంజాయి అక్రమ సాగు, పెరుగుతున్న సంఘటిత ముఠాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఉత్పత్తి, రవాణా, పంపిణీదారులపై కేంద్రీకృత దాడులు అవసరమనే నిర్ణయానికి వచ్చారు. దీని కోసం రెండు రాష్ట్రాల్లో నోడల్ అధికారులను నియమించాలని, తక్షణ సమాచార మార్పిడి కోసం ప్రత్యేక కమ్యూనికేషన్ వేదికను ఏర్పాటు చేసుకోవాలని, నేరస్థుల వివరాలను పరస్పరం పంచుకోవాలని, హాట్‌స్పాట్లలో సంయుక్త ఆపరేషన్లకు నియమిత సమీక్షా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. పరస్పర సహకారంతో ముందుకు సాగాలనే కట్టుబాటుకు వచ్చారు.



'ఆపరేషన్ చిన్నారి తల్లి' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఏడీజీ మధుసూదన్ రెడ్డి, ఐజీ రాజకుమారి తదితరులు

'ఆపరేషన్ చిన్నారి తల్లి'

- సురక్షిత బాల్యంతోనే సుస్థిర అభివృద్ధి: డీజీపీ

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): చిన్నారులు, మహిళలపై తరచూ లైంగిక నేరాలకు పాల్పడే 'సెక్సువల్ అఫెండర్స్'తోపాటు గంజాయి బానిసలపై ప్రత్యేక దృష్టి పెట్టామని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా చెప్పారు. నేరాలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో జీవించే పిల్లల తల్లులతో పాటు అంగన్‌వాడీలు, విద్యా సంస్థల్లో బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు. గురువారం మంగళగిరిలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో 'ఆపరేషన్ చిన్నారి తల్లి' పోస్టర్‌ను డీజీపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'సురక్షిత బాల్యంతోనే సుస్థిర అభివృద్ధి' అనే నినాదంతో రాష్ట్రంలోని బాలికల రక్షణ కోసం 'ఆపరేషన్ చిన్నారి తల్లి' కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. 'లైంగిక నేరాలకు పాల్పడే వ్యక్తులు, గంజాయి బానిసల్ని గుర్తించి, వారిపై నిఘా పెట్టాం. అవసరం మేరకు స్థానిక పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇస్తారు. అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. గస్తీ పెంచుతారు. పోక్సో కేసుల్లో నిందితుల అరెస్టు నుంచి చార్జిషీటు నమోదు వరకూ సకాలంలో పూర్తి చేస్తారు. నేరస్తులకు సత్వర శిక్షలు పడేందుకు విచారణను వేగవంతం చేస్తారు. అన్ని జిల్లాల ఎస్పీలకు, కమిషనర్లకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. రాష్ట్రపోలీసుశాఖలోని ఉమెన్ సేఫ్టీ విభాగం ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తుంది' అని డీజీపీ వివరించారు. కార్యక్రమంలో శాంతి భద్రతల ఏడీజీ మధుసూదన్ రెడ్డి, ఉమెన్ సేఫ్టీ వింగ్ ఐజీ రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి శెట్టిపల్లి భూముల కేసులో

ఇద్దరిపై వేటు

- సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్
- సెటిల్‌మెంట్ కమిషనర్ ఉత్తర్వులు
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అత్యంత విలువైన తిరుపతి శెట్టిపల్లి ఎస్టేట్ భూములను దొడ్డిదారిన ప్రైవేటుపరం చేద్దామనుకున్న వ్యవహారంపై సర్కారు కన్నెర్ర చేసింది. సెటిల్‌మెంట్ కమిషనరేట్‌లోని ఇద్దరు అధికారులను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. తదుపరి విచారణకు ఆదేశించింది. 'రెవెన్యూలో ఇంటిదొంగ' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' గురువారం వార్తను ప్రచురించిన సంగతి తెలిసిందే. తిరుపతి రూరల్ మండలంలోని శెట్టిపల్లిలో రూ.500 కోట్ల విలువైన 40 ఎకరాల భూమిని ప్రైవేటు పరం చేద్దామన్న పన్నాగాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. తిరుపతి సెటిల్‌మెంట్ అధికారిగా జాయింట్ కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను అడ్మిట్ చేసుకోవడానికి బదులుగా తిరస్కరించేలా రాష్ట్ర సెటిల్‌మెంట్ కమిషనర్ వద్ద ఫైలు నడిపారు. ప్రైవేటుకు లబ్ధి చేకూర్చడానికి సర్వే, సెటిల్‌మెంట్‌లోని ఓ అధికారి ప్రైవేటు పార్టీని ఏకంగా ఆఫీసు పరిసరాలకే పిలిచి బేరసారాలు ఆడినట్లుగా విచారణలో తేలింది. జేసీ ఇచ్చిన ఆదేశాలను తిరస్కరించేలా ఫైలు పెట్టిన విషయాన్ని సెటిల్‌మెంట్ కమిషనర్ కూర్మనాథ్ గుర్తించి ఆ ఫైలును పక్కనపెట్టారు. ఈ విషయం తెలుసుకున్న ప్రైవేటు వ్యక్తి ఆఫీసులోకి వచ్చి అధికారులతో మంతనాలు జరిపినట్లుగా గుర్తించారు. "కావాల్సినంత ఇస్తాం.. తీసుకోండి. ఫైలును ఎందుకు పక్కనపెట్టారు? ఏం కావాల్నో అడగండి. వెళ్లి మాట్లాడండి. ఫైలును ఓకే చేయించండి" అని మంతనాలు జరిపిన విషయం ఉన్నతాధికారులకు తెలిసి బాధ్యులపై క్రమశిక్షణ చర్యలకు వెంటనే ఫైలు పెట్టాల్సిందిగా ఆదేశించారని సమాచారం. ఈ విషయంలో మరో అధికారి తలదూర్చి సస్పెన్షన్‌ను అడ్డుకునేందుకు బేరసారాలు చేశారు. సీరియస్ చర్యలు వద్దని సెటిల్‌మెంట్ కమిషనర్‌పై ఉన్నతస్థాయిలో ఒత్తిళ్లు తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. ఓ ఉద్యోగ సంఘం నేతతోనూ రాయబారాలు నడిపించారు. జరిగిన తప్పు తీవ్రమైనది కావడంతో ఈ వ్యవహారంలో బాధ్యులైన ఓ సూపరింటెండెంట్‌ను, మరో సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తూ సెటిల్‌మెంట్ కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. 'విధి నిర్వహణలో తప్పుడు ప్రవర్తన, రికార్డులను తారుమారు చేయడం, ఉన్నతాధికారులను తప్పుదోవపట్టించేలా అవాస్తవాలను ప్రజెంటేషన్ చేయడం' అన్న అభియోగాలపై ఇద్దరిని సస్పెండ్ చేసినట్లు తెలిసింది. ఇదిలాఉంటే, ఈ పరిణామంపై ప్రభుత్వం తక్షణమే స్పందించింది. ఏం జరుగుతోందంటూ ఆరాతీసింది. శెట్టిపల్లి భూముల విషయంలో ఎలాంటి తప్పు జరగకుండా చర్యలు తీసుకోవాలని సెటిల్‌మెంట్ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిసింది. మరోవైపు సెటిల్‌మెంట్ కమిషనర్ కూర్మనాథ్ గురువారం తిరుపతి రూరల్ తహశీల్దార్, ఇతర రెవెన్యూ అధికారులను పిలిచి సమీక్ష నిర్వహించినట్లు సమాచారం.

ఏప్రిల్ 25న పాలీసెట్.. 73 పరీక్ష కేంద్రాల ఏర్పాటు

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరంలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం ఏప్రిల్ 25న పాలీసెట్ నిర్వహించనున్నట్టు నైపుణ్యాభివృద్ధి శాఖ తెలిపింది. పాలీసెట్-2026 నిర్వహణ ఏర్పాట్లపై గురువారం మార్గదర్శకాలు విడుదల చేసింది. 73 కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపింది. ఇందుకోసం పోలీసుల సహకారం తీసుకోవాలని సూచించింది. జిల్లా కలెక్టర్లు దీనిపై సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని, పరీక్ష నిర్వహణలో భాగస్వామ్యం అయ్యే 10వేల మందికి వసతి సౌకర్యం కల్పించాలని నిర్దేశించింది. టెన్త్ విద్యార్థుల వివరాలు ఇవ్వాలని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్‌ను ఆదేశించింది.



మృత్యువాతపడిన పిల్లి

పులి పిల్ల కాదు.. పిల్లి!

- ఏజెన్సీలో అరుదైన జాతి పిల్లి హల్‌చల్
- పులి పిల్లగా భావించి బంధించిన గ్రామస్థులు.. గంట వ్యవధిలోనే మృతి

కొయ్యూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం మర్రివాడ గ్రామంలో గురువారం పులి పిల్లను పోలిన ఓ అరుదైన జాతి పిల్లి హల్‌చల్ చేసింది. గ్రామస్థులు దాన్ని పులి పిల్లగా భావించి, బంధించి అటవీ శాఖ సిబ్బందికి సమాచారమిచ్చారు. అయితే వారు వచ్చే లోగానే అది మృతిచెందింది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి చెరువు వద్ద ఈ పిల్లి తారసపడింది. అది ఆయనపై దాడికి దిగడంతో పరుగున గ్రామంలోకి వచ్చి.. గ్రామస్థులకు చెప్పాడు. ఈ లోగా ఆ పిల్లి గ్రామంలోకి చొరబడి పలువురిపై దాడికి యత్నించింది. దీంతో గ్రామస్థులు గంటకు పైగా శ్రమించి దానిని బంధించారు. అటవీ సిబ్బందికి తెలియజేశారు. గ్రామస్థులు పట్టుకునేంత వరకూ చలాకీగా ఉన్న ఆ పిల్లి.. గంట వ్యవధిలోనే చనిపోయింది. పెదవలస ఇన్‌చార్జి అటవీ రేంజ్ అధికారి ప్రశాంతకుమారి, కొయ్యూరు ఎఫ్ఎస్‌వో శ్రీరాములు, సిబ్బంది వచ్చి పిల్లి కళేబరాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం పశుసంవర్ధక శాఖ సిబ్బందికి సమాచారమిచ్చారు. అది ఎక్సోటిక్ జాతికి చెందిన పిల్లి అని కొందరు, అరుదైన లెపార్డు జాతికి చెందినదని, క్రూరమైనదని మరికొందరు అంటున్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



'రై రై రా రా...

హీరో రామ్‌చరణ్- దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న ప్రతిష్ఠాత్మక పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' విడుదల తేదీ సమీపిస్తున్న కొద్దీ మెగా అభిమానుల్లో అంచనాలు అంతకంతకూ రెట్టింపు అవుతున్నాయి. మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థల సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన తొలి గీతం 'చికిరి చికిరి'కి అద్భుతమైన స్పందన లభించింది. ఈ క్రమంలో తాజాగా మేకర్స్ మరో అదిరిపోయే అప్డేట్ ఇచ్చారు. 'రై రై రా రా...' అంటూ సాగే రెండో గీతాన్ని మార్చి 2న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఓ పోస్టర్‌ని కూడా రిలీజ్ చేశారు. పోస్టర్‌లో రామ్‌చరణ్ మాసీ అవతార్‌లో కనిపిస్తున్నారు. మాసిన దుస్తులు, చెదిరిన జుట్టు, పెరిగిన గడ్డం, భుజంపై పెద్ద సుత్తిని వేలాడదీసుకుని, మెరిసే చిరునవ్వుతో కనిపిస్తున్నారు.

వెంకటేశ్.. కల్యాణ్‌రామ్‌తో



ఇటీవలే మెగాస్టార్ చిరంజీవితో మనశంకర వరప్రసాద్ గారు చిత్రం తెరకెక్కించి భారీ విజయాన్ని అందుకున్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. దీంతో ఆయన తదుపరి ప్రాజెక్ట్‌పైన అందరిలో ఆసక్తి నెలకొంది. చాలా రోజులుగా ఆయన వెంకటేశ్‌తో ఓ చిత్రం చేయడానికి సన్నాహాలు చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమాను అధికారికంగా ప్రకటించారు అనిల్ రావిపూడి. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే ఇందులో నందమూరి కల్యాణ్ రామ్ కూడా భాగమవ్వడం. 'మొదటి రూ.వంద కోట్ల బొమ్మ' కొట్టిన హీరో వెంకటేశ్ గారితో.. మొదటి బొమ్మ తీసే అవకాశం ఇచ్చిన హీరో నందమూరి కల్యాణ్‌రామ్ గారితో కలసి 2027 మొదటి పండగకి మీ ముందుకు వసున్నాం' అని పేర్కొన్నారు. ఈ ప్రకటన వెలువడిన వెంటనే ఈ మల్టీస్టారర్‌పై అందరి దృష్టి పడింది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉందీ చిత్రం.

రెండు గంటల వినోదం




- శ్రీ విష్ణు

"శ్రీ విష్ణు విన్యాసం' చాలా రోజులు గుర్తుండిపోయే చిత్రమవుతుంది. థియేటర్లలో రెండు గంటల వినోదం పక్కా. దానికి నాది గ్యారంటీ. ప్రథమార్థం యువతకు బాగా కనెక్ట్ అవుతుంది. ద్వితియార్థం నుంచి ఫ్యామిలీ డ్రామాగా మారుతుంది. సినిమా పూర్తయ్యేసరికి ఓ మంచి చిత్రం చూశామనే అనుభూతి కలుగుతుంది' అని అన్నారు శ్రీ విష్ణు. ఆయన కథానాయకుడిగా యధునాథ్ మారుతీరావు తెరకెక్కించిన చిత్రమిది. సుమంత్ నాయుడు నిర్మించారు. సినిమా నేడు విడుదలవుతున్న సందర్భంగా శ్రీ విష్ణు మీడియాతో ముచ్చటించారు. 'ఇందులో నేను లెక్చరర్ పాత్రలో కనిపిస్తాను. వీరి వీరి గుమ్మడి పండు అనే సన్నివేశానికి థియేటర్ మొత్తం నవ్వులతో బ్లాస్ట్ అవుతుంది. రథన్ మంచి సంగీతాన్ని అందించారు. హీరోయిన్ క్యారెక్టర్‌ని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు' అని శ్రీ విష్ణు వివరించారు.

కుటుంబమంతా కలసి చూడదగ్గ చిత్రం



సాయి సింహాద్రి కథానాయకుడిగా నటించి, నిర్మించిన చిత్రం 'సన్ ఆఫ్'. బత్తుల సతీశ్ తెరకెక్కించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో సాయి సింహాద్రి మాట్లాడుతూ 'ఈ చిత్రం కుటుంబమంతా కలసి చూసేలా ఉంటుంది. ఇందులోని భావోద్వేగాలు, కథాంశం, పాటలు ఆకట్టుకుంటాయి. 'సన్ ఆఫ్' విజయంపై నమ్మకముంది' అని అన్నారు.



కన్నుల పండువగా

విరోష్ కల్యాణం

- మూడు ముళ్ల బంధంతో ఒకటైన విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న
- ఉదయ్‌పూర్‌లో ఘనంగా వివాహ వేడుక

టాలీవుడ్ ప్రేమజంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న వివాహబంధంతో ఒక్కటయ్యారు. స్క్రీన్ మీద తమ కెమిస్ట్రీతో మాయ చేసిన ఈ జంట, ఇప్పుడు నిజ జీవితంలో జీవిత బాగస్వాములుగా మారారు. ఎనిమిదేళ్ల వీరి ప్రేమ ప్రయాణం రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ వేదికగా గురువారం పెళ్లి పీట లెక్కింది.







ఉదయ్‌పూర్‌లోని ఐటీసీ మెమెంటోస్ రిసార్ట్స్‌లో విజయ్, రష్మికల వివాహం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 10:10 గంటలకు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో తెలుగు సంప్రదాయ పద్ధతిలో రష్మిక మెడలో విజయ్ తాళి కట్టాడు. అనంతరం సాయంత్రం వధువు మూలాలను గౌరవిస్తూ, కూర్గ్ (కొడవ) సంప్రదాయంలో కూడా మరోసారి వివాహ వేడుక నిర్వహించారు. పెళ్లి అనంతరం బయట ఉన్నవారికి పంపిణీ చేసిన కాజు కట్లీ స్వీట్ బాక్సులపై నవ వధువు రష్మిక ఫొటో ఉండడం విశేషం.

సంప్రదాయం ఉట్టిపడేలా నవ దంపతులు

విజయ్, రష్మికల పెళ్లి ఫొటోలు చూస్తే ఎవరికైనా ముచ్చటేస్తుంది. రష్మిక అచ్చమైన దక్షిణ భారత పెళ్లికూతురిలా ముస్తాబైంది. లేత ఆరెంజ్, గోల్డ్ కలర్ కాంబినేషన్‌లో ఉన్న పట్టుచీర, ఒంటినిండా బంగారు ఆభరణాలతో నవ వధువుగా ఆమె అందం ద్విగుణీకృతమైంది. చేతిలో కొబ్బరికాయ పట్టుకొని పెళ్లి మండపానికి వస్తున్న రష్మిక ముఖంలో ఆనందం వెల్లివిరిసింది. ఇక విజయ్ దేవరకొండ అచ్చమైన తెలుగింటి పెళ్లి కొడుకులా తెల్లటి పంచె, మెడలో ఎర్రటి కండువాతో ఎంతో హుందాగా కనిపించాడు.





నవ్వుల నడుమ మాంగల్య ధారణ



వివాహ వేడుకలో ముఖ్య ఘట్టమైన మాంగల్యధారణ సమయంలో విజయ్ తాళి కడుతుండగా, రష్మిక ముఖంలో విరిసిన చిరునవ్వులు వారి మధ్య ఉన్న అంతులేని ప్రేమకు అద్దం పడుతున్నాయి. తమ కుటుంబ సభ్యులు, సన్నిహితుల ఆశీర్వాదాల మధ్య, గులాబీ పూల దండలు మార్చుకొని ఈ జంట ఒక్కటయ్యారు. అలాగే వెండి బిందెలో ఉంగరం కోసం ఇద్దరూ పోటీ పడుతూ నవ్వుకుంటున్న దృశ్యం వారి వైవాహిక జీవితం ఎంత సంతోషంగా మొదలైందో చెబుతోంది. బంధు మిత్రులు పూల వాన కురిపిస్తుండగా, ఇద్దరు చేతులు పట్టుకొని నడుచుకుంటూ వస్తున్న ఫొటో ఈ వివాహ వేడుకకు ప్రత్యేకాకర్షణగా నిలిచింది. ఈ జంట మార్చి 4న హైదరాబాద్‌లో గ్రాండ్‌గా రిసెప్షన్ నిర్వహించనున్నారు.


మ్యూజికల్ చైర్స్‌లో మహిళా ప్రజాప్రతినిధుల జోష్


కబడ్డీలో పోటీపడుతున్న ఎమ్మెల్యేలు


క్రీడాపోటీల్లో పాల్గొన్న మహిళా ప్రజాప్రతినిధులు



షటిల్ బ్యాడ్మింటన్‌లో విన్నర్ గ్రీష్మ, రన్నరప్ శ్రావణి

ఉరిమిన ఉత్సాహం

- గెలుపోటముల్లో ఒత్తిడిని జయించిన నేతలు
- క్రికెట్ ఫైనల్స్‌లో మంత్రి మనోహర్ జట్టు విజయం
- ముగిసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల ఆటలపోటీలు
- బాగా సందడి చేసిన నాదెండ్ల, అనిత, సంధ్యారాణి, అచ్చెన్న, మండిపల్లి

విజయవాడ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రజాసంబంధ వ్యవహారాలతో నిత్యం తలమునకలై ఉండే ప్రజాప్రతినిధులు మూడు రోజులపాటు జరిగిన క్రీడా పోటీల్లో గెలుపోటములను పక్కనబెట్టి ఒత్తిడిని జయించారు! విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన పోటీల్లో ఆద్యంతం ఉల్లాసంగా గడిపారు. అన్ని ఆటల్లో సభ్యులు పోటాపోటీగా.. పాల్గొన్నారు. గురువారంతో ఈ పోటీలు ముగియగా.. చివరిరోజు మంత్రులు మనోహర్, రాంప్రసాద్‌రెడ్డి, అనిత, సంధ్యారాణి, అచ్చెన్నాయుడు బాగా సందడి చేశారు.

బుచ్చయ్య వెరీ యంగ్

సీనియర్ నేత.. రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిపై ఇతర ఎమ్మెల్యేలు సరదా సెటైర్లు వేశారు. బుచ్చయ్య యువ ఎమ్మెల్యేలతో కలిసి క్రికెట్ ఆడి.. ఉత్సాహంగా పరుగులు తీయడంతో.. అందరిలో బుచ్చయ్య చౌదరే యంగ్ అంటూ కితాబు ఇచ్చారు. దీనికి స్పందించిన ఆయన.. రాష్ట్రంలో క్రీడాకారులకు కొరత లేదని, వారికి తగిన వసతులు మాత్రం లేవని కౌంటర్ వేశారు. క్రీడల ద్వారా ఆదాయాన్ని పెంచుకునే మార్గాలు ఉన్నాయని, వాటిపై శాప్ దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఆటల పోటీలకు స్పాన్సర్‌షిప్ లేకపోవడం లోటుగా ఉందని ఆయన నవ్వుతూ అన్నారు.


క్రికెట్‌లో విజేతగా నిలిచిన నాదెండ్ల మనోహర్ టీం

స్పీకర్ గారూ... ఆధార్‌కార్డులు చెక్ చేయండి

ఆటల పోటీల్లో భాగంగా 70ఏళ్లకు పైబడిన వారికి జావెలిన్‌త్రో నిర్వహించారు. ఇందులో గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కామినేని శ్రీనివాసరావుతోపాటు పలువురు పాల్గొన్నారు. అదే సమయంలో మంత్రులు అనిత, సంధ్యారాణి, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ కూడా పాల్గొంటామని వచ్చారు. వారిని ఉద్దేశించి స్పీకర్ గారూ... సభ్యుల ఆధార్‌కార్డులు చెక్ చేయండని బుచ్చయ్య అన్నారు. 30, 40 ఏళ్లు ఉన్న వాళ్లు బహుమతి గెలుచుకోవడానికి 70 ఏళ్ల కేటగిరిలో ఆడుతున్నారన్నారు. ఆధార్‌కార్డులో పుట్టిన తేదీని పరిశీలించి ఆటలోకి అనుమతించాలని విజ్ఞప్తి చేశారు.

అచ్చెన్నపై 'మనోహర' విజయం

క్రికెట్ తుది పోరులో మంత్రి అచ్చెన్నాయుడు జట్టుపై మంత్రి నాదెండ్ల మనోహర్ జట్టు విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మనోహర్ జట్టు 12 ఓవర్లలో 108 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ ప్రారంభించిన అచ్చెన్నాయుడు జట్టు 100 పరుగులకు అవుటయింది. ఈ మ్యాచ్ జరుగుతున్నప్పుడు ఫోర్లు, సిక్సులు కొట్టినప్పుడు టపాసులు పేల్చి జట్టు సభ్యుల్లో ఉత్సాహాన్ని రేకెత్తించారు.

గ్రౌండ్స్‌లో అనిత డ్యాన్స్

హోంమంత్రి అనిత క్రికెట్ గ్రౌండ్‌లో చేసిన డ్యాన్స్ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. బుధవారం డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మంత్రి అచ్చెన్నాయుడు జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరిగింది. వారితో కలిసి ఆమె క్రికెట్ ఆడారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అవుట్‌కావడంతో ఫీల్డింగ్‌లో ఉన్న అనిత రెండు చేతులు ఊపుతూ చిన్నపాటి స్టెప్ వేశారు.

స్పీకర్‌పై కోపంగా ఉంది: కేశినేని చిన్ని

స్పీకర్ అయ్యన్నపాత్రుడుపై తనకు కోపంగా ఉందని ఎంపీ కేశినేని చిన్ని సరదాగా వ్యాఖ్యానించారు. స్టేడియంలో జరుగుతున్న ఆటల పోటీలను తిలకించడానికి చిన్ని వచ్చారు. దక్షిణాది రాష్ట్రాల క్రికెట్ పోటీ నిర్వహణపై స్పీకర్ చేసిన ప్రతిపాదనపై చిన్ని మాట్లాడారు. ఈ ఆటల పోటీల్లో ఎంపీలకు అవకాశం ఇవ్వలేదన్నారు. దక్షిణాది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో విశాఖ స్టేడియంలో ఫ్లడ్ లైట్ల వెలుగులో మ్యాచ్‌ను నిర్వహిస్తామని చెప్పారు.

వద్దయ్యా అన్నా... డిప్యూటీ స్పీకర్ వినలేదు

'మనస్సులో ఉన్న క్రీడాస్ఫూర్తిని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఆపులేకపోయారు. వద్దయ్యా మనకెందుకు అని చెప్పినా వినలేదు' అని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు వ్యాఖ్యానించారు. క్రికెట్ ఆడుతుండగా డిప్యూటీ స్పీకర్ పరుగులు తీస్తూ పడిపోవడంతో ఎడమచేతి మణికట్టు వద్ద ఎముక విరగడంపై ఆయన స్పందించారు. 'మాకు కొంచెం ఒళ్లెక్కువ. అందువల్ల వద్దన్నా. అయినా రఘురామ క్రీడాస్ఫూర్తిని ఆపులేక ఆడారు. చేయికి గాయమైంది. హైదరాబాద్‌లో శస్త్రచికిత్స చేశారు. రెండు, మూడు రోజుల్లో కోలుకుంటారు' అని అన్నారు. సౌత్‌జోన్ ప్రజాప్రతినిధుల పోటీలు విశాఖలో నిర్వహించాలని స్పీకర్ తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు.

వికలాంగుల కోటాలో పింఛన్లు అడుగుదాం!

- క్రీడల్లో గాయపడ్డ వారితో బోండా సరదా వ్యాఖ్య

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): క్రీడా పోటీల్లో గాయపడ్డ ప్రజాప్రతినిధులకు వికలాంగుల కోటా వర్తింప చేసి పింఛను ఇవ్వాలని సీఎంని కోరుదామని ఎమ్మెల్యే బోండా ఉమా సరదాగా వ్యాఖ్యానించారు. మూడు రోజులుగా జరిగిన క్రీడా పోటీల్లో డిప్యూటీ స్పీకర్ రఘురామరాజుతో సహా పలువురు ప్రజా ప్రతినిధులు గాయపడ్డారు. బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి కాలు విరగడంతో ఆయన కర్ర సాయంతో గురువారం అసెంబ్లీకి వచ్చారు. టీడీపీ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ చేతికి కట్టుతో వచ్చారు. వీరిద్దరూ ఒకే కారులో వచ్చి.. ఒకరికొకరు సాయంగా అసెంబ్లీ లాబీలోకి వస్తున్న సమయంలో బోండా ఉమా ఎదురయ్యారు. ఈ సందర్భంగా ఉమా మాట్లాడుతూ.. గాయపడిన వారు చట్టసభల సభ్యులు కాబట్టి అవసరమైతే అత్యవసర బిల్లు పెట్టిద్దామని అన్నారు. దీనిపై పార్థసారథి స్పందిస్తూ.. అలాంటి ప్రతిపాదన పెడితే సగం మంది సభ్యులకు వర్తిస్తుందని, తమతోపాటు చాలా మంది గాయపడ్డారని అన్నారు.

త్వరలో దక్షిణాది ఎమ్మెల్యేల క్రీడాపోటీలు: స్పీకర్ అయ్యన్న

దక్షిణాదిలోని ఆరు రాష్ట్రాలకు చెందిన శాసనసభ్యులతో విశాఖపట్నం వేదికగా క్రీడాపోటీలను నిర్వహించనున్నట్టు స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాల ఎమ్మెల్యేలందరినీ ఆహ్వానించి భారీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తామని చెప్పారు. విశాఖలో అంతర్జాతీయ క్రికెట్ పోటీలతో పాటు బీచ్ వాలీబాల్, కబడ్డీ నిర్వహణకు అనుకూలమైన వాతావరణం ఉందన్నారు. ఈ మూడింటిలో ఏదో ఒక క్రీడను నిర్వహిస్తామని తెలిపారు. ఈ మెగా క్రీడా సంబరాల ద్వారా దక్షిణాది రాష్ట్రాల మధ్య ఐక్యతను చాటడమే కాకుండా, రాజకీయంగా ఎలాంటి సమస్యలు, భిన్నాభిప్రాయాలు ఉన్నా క్రీడాస్ఫూర్తితో అంతా ఒకే వేదికపైకి వస్తాయనే బలమైన సందేశాన్ని దేశం మొత్తానికి చాటిచెప్పవచ్చని ఆకాంక్షించారు. ఈ ప్రతిష్టాత్మక క్రీడాపోటీలను ఏసీఏ అధ్యక్షుడు కేశినేని చిన్ని ఆధ్వర్యంలో నిర్వహిస్తామని స్పీకర్ వెల్లడించారు.

మండలిలో తొండి!

(మొదటి పేజీ తరువాయి)

పరిణామమూ చోటు చేసుకుంది. ఆ సమయంలో... ప్రభుత్వం తరపున కల్తీ నెయ్యిపై స్టేట్‌మెంట్ ఇచ్చేందుకు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అప్పటికే లేచి నిల్చున్నారు. ప్రభుత్వం ఏ అంశంపైన అయినా ప్రకటన చేసేందుకు ముందస్తు నోటీసు ఇవ్వాల్సిన అవసరం లేదు. కానీ... అందుకు సంబంధించిన అనుబంధ/సమాచార పత్రాలను సభ్యులకు అందుబాటులో ఉంచాలి. ఇందుకు అసెంబ్లీ సెక్రటేరియట్ అనుమతి పత్రం జారీ చేస్తుంది. గురువారం కల్తీ నెయ్యిపై ప్రభుత్వం తరపున ప్రకటనకు సంబంధించి ఇలాంటి పత్రమే జారీ అయ్యింది. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి లేచి నిలుచుని ఉండగా... మండలి సిబ్బంది ఆ ప్రకటనకు సంబంధించిన పత్రాలను సభ్యులకు అందించే ప్రక్రియ కూడా ప్రారంభమైంది. అయినప్పటికీ... చైర్మన్ మోషేన్ రాజు వైసీపీ సభ్యుడు చంద్రశేఖర్ రెడ్డికి 'లఘు చర్చ' ప్రారంభించే అవకాశమివ్వడంపై టీడీపీ సభ్యులు విస్మయం వ్యక్తం చేశారు. 'ఇది మీరు ఇచ్చిన సమాచారమే' అని శాసనసభా వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ పదేపదే చెప్పినప్పటికీ... 'అది నా అనుమతి లేకుండా జారీ అయ్యింది' అంటూ చైర్మన్ మోషేన్ రాజు తేల్చి చెప్పారు. దీంతో ఒక దశలో పయ్యావుల కేశవ్, మోషేన్ రాజు మధ్య తీవ్ర వాదనలు జరిగాయి. బుధవారం అసెంబ్లీలో జరిగిన పరిణామాలను కూడా అధికార పక్షం గుర్తు చేసింది. కల్తీ నెయ్యిపై శాసనసభలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రకటన చేశారు. దీనికి ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వలేదు. ఆ అవసరమూ లేదు. నిబంధనల ప్రకారం... సంబంధిత పత్రాలను మాత్రం సభ ముందుంచారు. ఈ విషయాన్నే గురువారం మండలిలో పయ్యావుల గుర్తు చేశారు. అక్కడొక రూల్, ఇక్కడొక రూల్ ఏమిటన్నదే టీడీపీ సభ్యుల ప్రశ్న! కల్తీ నెయ్యిపై తొలుత ప్రభుత్వం తరపున ప్రకటన చేసేందుకు అనుమతించాలని... ఆ తర్వాత దీనిపై ఎన్ని గంటలైనా చర్చకు సిద్ధంగా ఉన్నామని చెప్పినా చైర్మన్ మోషేన్ రాజు పట్టించుకోలేదు. వైసీపీ ఇవ్వని నోటీసును ఇచ్చినట్లుగా భావించి 'లఘు చర్చ'కు అనుమతించడం, ప్రభుత్వం తరపున ప్రకటనకు నిరాకరించడానికే పరిమితమయ్యారు. "స్వల్పకాలిక చర్చలో స్టేట్‌మెంట్ ఇచ్చే అవకాశం మంత్రికి ఉండదు. జవాబు మాత్రమే ఇవ్వాలి. మీరు వేరే ఫార్మాట్‌లో రండి" అని చెప్పారు. అలాంటప్పుడు స్టేట్‌మెంట్ కాపీలు సిద్ధం చేయాలని ఎందుకు లేఖ రాశారని పయ్యావుల ప్రశ్నించగా... 'నా అనుమతి లేకుండా ఆ లేఖ సిద్ధం చేశారు' అని చైర్మన్ పేర్కొన్నారు.

సంప్రదాయానికి భిన్నంగా...: సభావ్యవహారాల కమిటీ(బీఏసీ)లో నిర్ణయించిన ప్రకారమే కల్తీ నెయ్యిపై లఘు చర్చకు అనుమతించానంటూ చైర్మన్ చేస్తున్న వాదననూ టీడీపీ సభ్యులు తప్పు పడుతున్నారు. "లఘు చర్చపై బీఏసీలో నిర్ణయం తీసుకోవడం నిజమే. కానీ... గురువారం దీనిపై ఎవరూ నోటీసు ఇవ్వలేదు. ఒకవేళ ఇచ్చినా... సంబంధిత అంశంపై సభ్యుల అవగాహన కోసం మంత్రి ప్రకటన చేయడం, ఆ పత్రాలు సిద్ధం చేయాలని అసెంబ్లీ సెక్రటేరియట్ కోరడం సంప్రదాయం. శాసనసభలో, మండలిలో ఇది సాధారణంగా జరిగే ప్రక్రియ. దీనికి అనుగుణంగానే మంత్రి రామనారాయణ రెడ్డి స్టేట్‌మెంట్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఆ పత్రాలు సిద్ధం చేయాలని అసెంబ్లీ సెక్రటేరియట్ నుంచి లేఖ కూడా జారీ అయ్యింది. కానీ... అది తనకు తెలియదని చైర్మన్ చెప్పడం సరికాదు. మరోవైపు... గురువారం వైసీపీ సభ్యులు ఎలాంటి నోటీసు ఇవ్వకున్నా లఘు చర్చ ప్రారంభించేందుకు అవకాశమివ్వడం మరీ అన్యాయం" అని టీడీపీ సభ్యులు ఆక్రోశిస్తున్నారు. ఇక... మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అసెంబ్లీ కార్యదర్శిని బెదిరించి స్టేట్‌మెంట్ కాపీలను తయారు చేయించామని ఆరోపించడం సభావ్యవహారాలపై ఆయన అవగాహన లేమిని చాటుతోందని టీడీపీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వాదోపవాదాలు, అధికార-విపక్ష సభ్యుల ఆందోళనలతో మండలిలో గందరగోళం నెలకొంది. దీంతో చర్చ ప్రారంభించకుండానే శుక్రవారానికి వాయిదా పడింది.

స్ట్రాటజీలతో సభను నడపలేం: చైర్మన్

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): స్ట్రాటజీలతో సభను నడపడం కష్టమని మండలి చైర్మన్ మోషేన్‌రాజు వ్యాఖ్యానించారు. గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో ప్రశ్నలు, సమాధానాలు నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయకపోతే.. మిగిలిపోయిన ప్రశ్నలకు మంత్రుల జవాబు ప్రతులను సభ్యులకు అందజేస్తామని స్పష్టం చేశారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌పై ప్రశ్న సందర్భంగా అధికార, ప్రతిపక్ష సభ్యుల వాదనలతో సభను కొద్దిసేపు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభం కాగానే సీమ ఎత్తిపోతల విషయంలో టీ-సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు నిజమో కాదో ప్రభుత్వం సమాధానం చెప్పాలని బొత్స డిమాండ్ చేశారు. దీనిపై మంత్రులు, టీడీపీ సభ్యులు వాకౌట్ ప్లీజ్ అని ఎద్దేవా చేశారు. దీంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల వాదనతో.. స్ట్రాటజీలతో సభను నడపడం కష్టమని చైర్మన్ వ్యాఖ్యానించారు.

'లడ్డూ'పై రచ్చరచ్చ!

దద్దరిల్లిన పెద్దల సభ

- ప్రతిపక్ష, పాలక సభ్యుల అరుపులు, కేకలు
- చైర్మన్ పోడియం వద్దకు దూసుకెళ్లిన సభ్యులు
- గందరగోళ పరిస్థితులతో చర్చ లేకుండానే మండలి వాయిదా



అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): అధికార, విపక్ష సభ్యుల నినాదాలతో శాసనమండలి గురువారం దద్దరిల్లింది. గురువారం ఉదయం ప్రశ్నోత్తరాల సమయంలో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌పైన, మధ్యాహ్నం తిరుపతి లడ్డూ ప్రసాదంపై లఘు చర్చ సందర్భంగా పెద్ద రచ్చే జరిగింది. చైర్మన్ మోషేన్‌రాజు, ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ మధ్య ఆసక్తికర సంవాదం జరిగింది. ప్రశ్నోత్తరాల అనంతరం కొంత సేపు విరామం తర్వాత చైర్మన్ సభను పునఃప్రారంభించారు. తిరుమల లడ్డూ అంశంపై చర్చ జరుగుతుందని ఆయన ప్రకటించిన వెంటనే.. సభ్యులు వేసిన ప్రశ్నలకు సమాధానాలు సమగ్రంగా, పూర్తిగా చెప్పాల్సి ఉందని కేశవ్ అన్నారు. సమాధానాలు ఇచ్చినట్లుగానే భావించాలని తాను ప్రకటన చేశాక.. ప్రశ్నోత్తరాల సమయం ముగిసినట్లేనని చైర్మన్ స్పష్టం చేశారు. లడ్డూపై లఘు చర్చ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించి.. వైసీపీ సభ్యుడు చంద్రశేఖరరెడ్డికి మాట్లాడే అవకాశమిచ్చారు. దీనిపై అధికార పక్ష సభ్యులు అభ్యంతరం చెప్పారు. దేవదాయమంత్రి మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. బీఏసీలో నిర్ణయించిన బిజినెస్ ప్రకారమే చర్చ మొదలుపెట్టానని చైర్మన్ అన్నారు. వైసీపీ సభ్యులు లేచి కేకలు వేయడం ప్రారంభించడంతో కేశవ్ మండిపడ్డారు. 'సభ ఎలా నిర్వహించాలో కూడా ప్రభుత్వానికి నిర్దేశిస్తారా? ఎందుకు లేస్తున్నారు? వినడానికి ఎందుకు సిద్ధంగా లేరు' అని నిలదీశారు. ఇదే సమయంలో టీడీపీ సభ్యులు లేచి వైసీపీ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పయ్యావుల: ప్రభుత్వం ఈ రోజు ఈ అంశం మీద సమాధానం చెప్పడానికి ఎంతసేపైనా సిద్ధంగా ఉంది. వినడానికి ఓపిగ్గా ఉండండి. రోజూ మాదిరిగా వాకౌట్ చేయొద్దు. సభ సంప్రదాయం ప్రకారం మంత్రి మాట్లాడతారు. మీరు ఎంతసేపు మాట్లాడతారో మాట్లాడండి. ప్రభుత్వం నుంచి రిప్లయ్ ఇస్తాం.

చైర్మన్: మీరు చెప్పేది కరెక్టుకాదు. లఘు చర్చలో మంత్రి వివరణ ఇవ్వడానికి రూల్ లేదు. స్టేట్‌మెంట్ ఇవ్వాలనుకుంటే ప్రభుత్వానికి హక్కు ఉంది. వేరే ఫార్మాట్‌లో వస్తే.. కచ్చితంగా అవకాశం ఇస్తాను.

పయ్యావుల: తిరుపతి లడ్డూ ప్రసాదం అంశంపై లఘు చర్చలో ప్రభుత్వం నుంచి స్టేట్‌మెంట్ తెలుగు, ఇంగ్లీష్‌లో ఇవ్వమని మీరే ఒక లేఖ రాశారు. ఇది మీరిచ్చిన కమ్యూనికేషనే! (సంబంధిత పత్రం చూపించారు)

చైర్మన్: నో నో.. దట్ ఈజ్ రాంగ్ కమ్యూనికేషన్. అది రాంగ్ స్టేట్‌మెంట్. దానికి నా పర్మిషన్ లేదు.

పయ్యావుల: నిన్న శాంతిభద్రతలపై తమరు (చైర్మన్) ఇచ్చిన లెటర్ ప్రకారం.. ఇదే సభలో ప్రభుత్వం స్టేట్‌మెంట్ ఇచ్చింది. వ్యవసాయంపై జరగాల్సిన లఘు చర్చ జరగలేదు.

చైర్మన్: అది కేవలం రిప్లయ్.. స్టేట్‌మెంట్ కాదు.

పయ్యావుల: మీరిచ్చిన లెటర్‌ను కూడా కాదంటారేమిటి? తెల్లవారు జామున రెండు గంటల వరకు సభ జరిగినా ఈ ప్రభుత్వం ఇక్కడే ఉంటుంది. లడ్డూ మీద, కల్తీ నెయ్యి మీద సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉంది. వినడానికి మీరు (వైసీపీ ఎమ్మెల్సీలు) ఎందుకు డిఫెన్స్‌లోకి వెళ్తున్నారు? చర్చకు ఎందుకు భయపడుతున్నారు? ఎందుకు పారిపోతున్నారు? మీరు చేసిన అవినీతిని, దుర్మార్గాన్ని, హిందూ సమాజానికి చేసిన ద్రోహాన్ని ఎండగట్టడానికి ఈ రోజు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

బొత్స: ఎవరు పారిపోయారు? వీళ్ల అవసరం కోసం లడ్డూ కల్తీ అంశాన్ని తెచ్చారు. ఆ దేవదేవుడిని తక్కువ చేసేలా సభలో లడ్డూ అంశాన్ని తెచ్చారు.

పయ్యావుల: ప్రభుత్వం స్టేట్‌మెంట్ ఇస్తుందంటే ఎందుకు భయపడుతున్నారు? నిజాలు వెలుగులోకి వస్తాయనా? దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తిరుపతి లడ్డూ ప్రసాదంపై అసెంబ్లీలో మాట్లాడారు. దాని తాలుకు స్టేట్‌మెంట్ మండలిలో చదువుతారు. రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు, పది గంటలైనా చర్చిస్తాం. సంప్రదాయాల ప్రకారం ఈ సభను నడపడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. మీరే భయపడుతున్నారు. ఈ దశలో '100 కోట్ల మనోభావాలు వినాలి. ఓం నమో వేంకటేశాయ..' అంటూ టీడీపీ సభ్యులు నినాదాలు చేశారు. అధికార, ప్రతిపక్ష సభ్యుల కేకలతో ఎవరేం మాట్లాడుతున్నారో తెలియని గందరగోళం ఏర్పడింది. దీంతో లడ్డూపై చర్చ లేకుండానే మండలిని శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు.

విచారణకు హాజరైన మరో ఇద్దరు ఎమ్మెల్సీలు

- చైర్మన్‌తో కల్యాణ్ చక్రవర్తి, మర్రి రాజశేఖర్ భేటీ

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): తమ పదవులకు రాజీనామా చేసిన ఇద్దరు వైసీపీ ఎమ్మెల్సీలు బల్లి కల్యాణ్ చక్రవర్తి, మర్రి రాజశేఖర్ గురువారం మండలి చైర్మన్ మోషేన్ రాజు వద్ద విచారణకు హాజరయ్యారు. రాజీనామా చేసిన ఎమ్మెల్సీలకు నోటీసులు ఇచ్చిన మోషేన్ రాజు వారిని విచారణకు పిలిపిస్తున్నారు. జయమంగళం వెంకటరమణ బుధవారం విచారణకు హాజరు కాగా, గురువారం ఈ ఇద్దరు వచ్చారు. రాజీనామా ఎందుకు చేస్తున్నారు? ఎవరైనా ఒత్తిడి చేశారా.. బెదిరించారా? అని వారిని చైర్మన్‌ప్రశ్నించారు. తాము స్వచ్ఛందంగానే రాజీనామా చేశామని, తమ రాజీనామాలను వెంటనే ఆమోదించాలని ఎమ్మెల్సీలిద్దరూ కోరారు.

విద్యుత్ లైన్‌మెన్ పోస్టులను భర్తీ చేస్తాం: గొట్టిపాటి

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ సరఫరా నాణ్యత మెరుగుపర్చేందుకు మరింత సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. గురువారం మండలిలో విద్యుత్ లైన్‌మెన్ల నియామకంపై టీడీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందించారు. లైన్‌మెన్ల పోస్టుల నియామకానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కొత్త స్తంభాలు, ట్రాన్స్‌ఫారాల ఏర్పాటు నిరంతర ప్రక్రియ, అవసరాన్ని బట్టి జరుగుతుందని తెలిపారు. డిస్కంల వద్ద అందుబాటులో ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫారాల నిల్వల వివరాలు వెల్లడించారు.


లడ్డూపై ఆఖరి రోజు వరకు చర్చకు పట్టు: బొత్స

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): లడ్డూ కల్తీ నెయ్యి, ఇందాపూర్, హెరిటేజ్ సంబంధాలపై ఆఖరి రోజు వరకు చర్చకు పట్టుబడుతూనే ఉంటామని శాసనమండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ చెప్పారు. లడ్డు కల్తీ నెయ్యి వ్యవహారంపై అసెంబ్లీలో చర్చించినప్పుడు మండలిలో ఎందుకు చర్చించడంలేదని ప్రశ్నించారు. గురువారం అసెంబ్లీ గేటు బయట ఆయన మీడియాతో మాట్లాడారు. ఇందాపూర్ ముసుగులో హెరిటేజ్ చేసిన అవినీతి గురించి చర్చజరగడం ఇష్టంలేకనే ప్రభుత్వం వాయిదా వేయించిందని ఆరోపించారు. సభా నియమాలను ఉల్లంఘించారన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్నీ తాను చెబితేనే చంద్రబాబు ఆపారని టీ-సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని.. ఇది వాస్తవమా కాదా? అని అడిగితే సభలో సమాధానం చెప్పలేదన్నారు. సీమ ఎత్తిపోతల పనులన్నీ ఆపేయాలని 2020లో ఎన్‌జీటీ అభ్యంతరం చెప్పడంతోనే జగన్ ప్రభుత్వ హయాంలోనే పనులన్నీ ఆపేశారు కదా అని విలేకరులు ప్రశ్నించగా... బొత్స దాటవేశారు.

రాయలసీమ ద్రోహి జగనే

- వెలిగొండ పూర్తికాకుండానే జాతికి అంకితం
- ఇప్పుడు అదే ప్రాజెక్టుకు నిధులు అడుగుతున్నారు
- శాసనసభలో నిమ్మల రామానాయుడు

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాయలసీమలోని ప్రాజెక్టులకు ఐదేళ్లలో ఒక్క రూపాయీ ఖర్చు చేయని జగనే సీమకు నిజమైన ద్రోహి అని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. ప్రాజెక్టులు కొట్టుకుపోతుంటే పట్టించుకోకుండా తాడేపల్లి ప్యాలెస్‌లో మొద్దు నిద్రపోయిన జగన్ కాకుండా సీమకు ఎవరు ద్రోహి అవుతారని ప్రశ్నించారు. సాగునీటి రంగానికి బడ్జెట్‌లో చేసిన కేటాయింపులపై గురువారం శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు.



'గోదావరి జలాలను కృష్ణాకు తేవాలని అప్పట్లో సీఎం చంద్రబాబు పట్టిసీమ ప్రారంభిస్తే ఇదే సభలో హేళన చేశారు. పట్టిసీమ వల్ల 13.08 లక్షల ఎకరాల స్థిరీకరణ జరిగింది. ఎగువ జలాలను శ్రీశైలం నుంచి రాయలసీమకు వినియోగించాం. ఇప్పుడూ ముందుచూపుతోనే నల్లమలసాగర్ ప్రాజెక్టుకు రూపకల్పన జరుగుతోంది. మధ్యలో ప్రభుత్వం మారకపోతే 2021 నాటికే పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేది. రాయలసీమ ఎత్తిపోతలపై మాట్లాడే నైతికత వైసీపీకి లేదు. గత ప్రభుత్వంలోనే ఈ ప్రాజెక్టుకు ఎన్జీటీ అభ్యంతరం చెప్పింది. అయినా కేవలం మట్టి పనులు చేసి రూ.900 కోట్లు జేబులో వేసుకున్నారు. హంద్రీనీవా సుజల స్రవంతికి ఐదేళ్లలో ఒక్క రూపాయీ ఖర్చు చేయలేదు. చివరికి మోటార్ల విద్యుత్ బిల్లులూ కూటమి ప్రభుత్వమే చెల్లించింది. తుంగభద్ర డ్యామ్ నిర్వహణ లోపం కారణంగా గేటు కొట్టుకుపోయింది. మా ప్రభుత్వం వచ్చాక గేటు బిగించాం. అన్నమయ్య డ్యామ్ మొత్తం కొట్టుకుపోయినా స్పందించకపోతే, ఇప్పుడు గేట్లు పెట్టడానికి నిధులు కేటాయించాం. వెలిగొండ ఫీడర్ కాలువ పనులకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. అసలు ఈ కాలువే లేకుండా గత ప్రభుత్వంలో సీఎం జగన్ ప్రాజెక్టు పూర్తయ్యిందని జాతికి అంకితం ఇచ్చారు. పూర్తికాని ప్రాజెక్టును జాతికి అంకితం ఎలా ఇస్తారో ఆయనకే తెలియాలి. విచిత్రంగా అదే ప్రాజెక్టుకు ఎక్కువ నిధులు కేటాయించాలని వైసీపీ నేతలు ఇప్పుడు డిమాండ్ చేస్తున్నారు' అని అన్నారు. కాగా, విద్యుత్ లైన్‌మెన్ల పోస్టుల నియామకానికి చర్యలు తీసుకుంటామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. డిస్కంల వద్ద ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫారాల నిల్వల వివరాలు వెల్లడించారు.

సాగునీటిపై చర్చలో ఎమ్మెల్యేలు

ఎన్జీటీ అభ్యంతరం చెబుతుందని తెలిసినా.. కావాలనే రాయలసీమ ఎత్తిపోతల పథకం చేపట్టారు. మట్టి పనులు చేసి దోపిడీ చేశారు. సీమకు మరణశాసనం రాసిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులకు పెద్దిరెడ్డి కంపెనీ తెలంగాణలో టెండర్లు దాఖలు చేసింది. వారే దానివల్ల ఏపీకి నష్టం అంటారు. మళ్లీ అదే ప్రాజెక్టుకు టెండర్లు వేశారు అంటే సీమపై ఎంత ప్రేమ ఉందో అర్థంచేసుకోవచ్చు

- భూమా అఖిలప్రియ

వైసీపీ జీవో 365 ద్వారా వందల ప్రాజెక్టులను ప్రీక్లోజ్ చేసింది. నీటిపారుదలలో గత ప్రభుత్వం చేసిన రూ.5వేల కోట్ల అప్పులను ఈ ప్రభుత్వం తీర్చింది. అన్నమయ్య ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోతే జగన్ రెడ్ కార్పెట్‌పై పరిశీలనకు వెళ్లారు.

- కామినేని శ్రీనివాస్

పెన్నా-గోదావరి ప్రాజెక్టును పూర్తిచేయాలి. ఈ ప్రాజెక్టు పూర్తయితే మా పెదకూరపాడు నియోజకవర్గంలో రైతుల ఆదాయం పెరుగుతుంది.

- భాష్యం ప్రవీణ్

కూటమి ప్రభుత్వం కొంతమేర చెరువులు నింపితేనే మా రాయలసీమ పచ్చగా కళకళలాడుతోంది. అదే పూర్తిస్థాయిలో సాగునీరు అందితే రాష్ట్రానికే రాయలసీమ అప్పు ఇస్తుంది. గత ప్రభుత్వంలో వ్యంగ్యంగా పర్సెంటా అర పర్సెంటా అని మాట్లాడారు. చివరికి ప్రాజెక్టులు పూర్తిచేయలేదు.

- జేసీ అస్మిత్‌రెడ్డి

అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోతే ఐదేళ్లపాటు పట్టించుకోని దాన్ని ప్రభుత్వం అనాలా? ప్రాజెక్టుల నిర్వహణకు కూడా నిధులు ఇవ్వలేదు.

- జ్యోతుల నెహ్రూ

వైసీపీ పాలనలో సాగునీరు లేక వ్యవసాయం కుంటుపడింది. 200కు పైగా ప్రాజెక్టులు ముందే మూసివేశారు. వైకుంఠపురం- నకిరేకల్ ప్రాజెక్టును పూర్తిచేయాలి.

- ప్రత్తిపాటి పుల్లారావు





అసెంబ్లీ సందర్శనకు వచ్చిన నర్సీపట్నం రిషీవ్యాలీ స్కూల్ విద్యార్థులు, సిబ్బందితో స్పీకర్ అయ్యన్న గ్రూప్ ఫొటో

యువత రాజకీయాల్లోకి రావాలి: అయ్యన్న

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): యువత చదువు, ఉద్యోగాలే కాకుండా రాజకీయాల్లోకి కూడా రావాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారు. గురువారం అసెంబ్లీ సమావేశాలను వీక్షించేందుకు వచ్చిన విద్యార్థులతో స్పీకర్ మాట్లాడారు. గత 10 రోజులుగా 107 పాఠశాలలకు చెందిన 3,718 మంది విద్యార్థులు అసెంబ్లీ సమావేశాలను వీక్షించారని తెలిపారు.

6,688 గ్రామాల్లో రీసర్వే పూర్తి: మంత్రి అనగాని



అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇప్పటివరకూ 6,688 గ్రామాల్లో 86.44 లక్షల ఎకరాల విస్తీర్ణంలో రీసర్వే పూర్తి చేశామని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. గురువారం అసెంబ్లీలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ.. రాష్ట్రంలో 16,816 గ్రామాలు ఉన్నాయని, భూ విస్తీర్ణం 3.17 కోట్ల ఎకరాలు ఉందన్నారు. ఇప్పటి వరకూ 6,688 గ్రామాల్లోని.. 86,44,781 ఎకరాల విస్తీర్ణంలో సర్వే పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం 4,236 గ్రామాల్లో సర్వే చేస్తున్నామని, 5,892 గ్రామాల్లో సర్వే ప్రారంభించాల్సి ఉందని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటి వరకూ 19.93 లక్షల పట్టాదార్ పాస్‌పుస్తకాలు జారీ చేశామని, మరో 14.43 లక్షల పాస్‌పుస్తకాలు జారీ చేయాల్సి ఉందన్నారు.

బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్‌కు 135 కోట్లు



అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గంలోని బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుకు సాస్కీ నుంచి రూ.135 కోట్లు కేటాయించామని, ఆర్థిక శాఖ వద్ద రూ.445 కోట్లతో రివైజ్డ్ ఎస్టిమేషన్స్ వేశామని మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ పనులు చేపట్టే అవకాశం ఉందా? అని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. చింతపల్లిలో ఫిష్‌ల్యాండ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.చింతపల్లి ప్రాంతంలో జెట్టీ ఏర్పాటుకు కమిటీ భూమిని పరిశీలించిందని, వెంటనే జెట్టి ఏర్పాటు చేయాలని మాధవి కోరారు.

క్రీడాకారులకు 3% రిజర్వేషన్లు: రాంప్రసాద్ రెడ్డి



అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన, ప్రతిభావంతులైన క్రీడాకారులకు మూడు శాతం సమాంతర రిజర్వేషన్ కల్పించేందుకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. గురువారం ప్రశ్నోత్తరాల సందర్భంగా క్రీడా నియామకాల్లో క్రీడాకారులు, ఎన్‌సీసీ అభ్యర్థులకు మినహాయింపు ఇవ్వాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కోరారు. 2024లో సీఎం చంద్రబాబు క్రీడాకారులు, ఎన్‌సీసీ అభ్యర్థులకు 2 శాతం రిజర్వేషన్‌ను 3 శాతం చేశారని తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి ఈ అంశంపై సీఎంతో చర్చిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 3 శాతం క్రీడా కోటాలో 420 టీచర్ల పోస్టులను భర్తీ చేశామన్నారు.

పి.గన్నవరం డ్రైనేజీ వ్యవస్థపై నివేదిక కోరాం: మనోహర్



అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పౌరసరఫరాల మంత్రి మనోహర్ తెలిపారు. గురువారం అసెంబ్లీలో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆడిగిన ప్రశ్నకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తరఫున మనోహర్ బదులిచ్చారు. తన నియోజకవర్గంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంపై నివేదిక కోరామని, మొత్తం 68 గ్రామ పంచాయతీల్లో 21 పంచాయతీల్లో డ్రైనేజీ పాక్షికంగా మూసుకుపోయినట్లు గుర్తించామని మంత్రి తెలిపారు.

వైసీపీ వాకౌట్ టాకౌట్ పార్టీ: పయ్యావుల

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ వాకౌట్, టాకౌట్ పార్టీగా మారిపోయిందని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ శాసన మండలిలో బీజేపీ ఎమ్మెల్సీ మాట్లాడే ప్రయత్నం చేస్తుంటే ఆయనపై మెజార్టీ వైసీపీ సభ్యులు దాడికి యత్నించారని, మంత్రులు సంధ్యారాణి తదితరులు వారికి అడ్డుగా నిలబడ్డారని తెలిపారు. బీఏసీలో తీసుకున్న నిర్ణయం ప్రకారం తిరుపతి లడ్డూపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. శుక్రవారం వ్యవసాయంపై మండలిలో చర్చ జరుగుతుందని తెలిపారు. లడ్డూ అంశంపై గురువారం దేవదాయ మంత్రి ప్రకటన చేసేందుకు ప్రయత్నిస్తే.. చదవడానికి వీల్లేదని, ముందుగా వైసీపీ సభ్యులు మాట్లాడాలని అడ్డుతగిలారన్నారు. కేవలం సభకు రావాలి, అల్లరి చేయాలి, బట్ట కాల్చి ముఖాన వేయాలి అనే ధోరణితోనే వైసీపీ సభ్యులు సభకు వచ్చి వాకౌట్ చేసి పోతున్నారని విమర్శించారు. వాళ్లకు చర్చ మీద అసలు ఆసక్తే లేదనడానికి సభలో జరిగిన సంఘటనే నిదర్శనమన్నారు. 'వారు కోరిన ప్రకారమే వైసీపీ సభ్యులు అడిగిన అన్ని అంశాలను సభలో చర్చకు పెట్టాం. లా అండ్ ఆర్డర్, వ్యవసాయం తదితర అంశాలపై చర్చ పెట్టాం. సభలో తక్కువ, బయట ఎక్కువ మాట్లాడుతున్నారు. నిబంధనలు, సంప్రదాయాల ప్రకారం తిరుపతి లడ్డూపై చర్చకు కనీసం వైసీపీ నోటీసుకూడా ఇవ్వలేదు. సభలో రచ్చ చేయాలన్నదే వాళ్ల ఉద్దేశం. చర్చ జరగాలని కాదు. వచ్చే నెల 4వ తేదీన లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంపై చర్చ జరిపేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. మధ్యాహ్నం 2 గంటల నుంచి అర్ధరాత్రి రెండు గంటల వరకూ అయినా చర్చకు సిద్ధం' అని పయ్యావుల తెలిపారు. వైసీపీ సభలో ఆత్మరక్షణలో పడిందని, రాయలసీమ ఎత్తిపోతల విషయంలో ప్రశ్న వేసి భంగపడిందని ఎద్దేవా చేశారు.

క్లీన్ ఎనర్జీ పరిశ్రమలకు అసైన్డ్ భూములు

- చట్ట సవరణకు శాసనసభ ఆమోదం
- పేదలకు అన్యాయం జరగకుండా చూడాలి: స్పీకర్, ఎమ్మెల్యేలు

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అసైన్డ్ భూముల చట్ట సవరణ బిల్లు గురువారం శాసనసభ ఆమోదం పొందింది. రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఈ బిల్లును సభలో ప్రతిపాదించారు. సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనగాని మాట్లాడుతూ 'విశాఖలో డేటా సెంటర్ల కోసం క్లీన్ ఎనర్జీ పరిశ్రమల ఏర్పాటు చాలా కీలకం. దేశంలోనే తొలిసారిగా అనకాపల్లిలో గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీతో పాటు కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్‌ను కూడా ప్రారంభించాం. పునరుత్పాదక విద్యుత్తు (క్లీన్ ఎనర్జీ) ప్రాజెక్టుల ఏర్పాటుకు రూ.10లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయి. ఇవన్నీ గ్రౌండ్ అయితే 7.5లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టుల కోసం తీసుకునే అసైన్డ్ భూములకు ఎకరానికి రూ.31వేల లీజు చెల్లిస్తాం. ప్రతి రెండేళ్లకు ఒకసారి 5శాతం లీజు పెంచుతాం. రాష్ట్రంలో చాలాచోట్ల అసైన్డ్ భూములు బంజరు భూములుగానే ఉన్నాయి. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. వాటిని లీజుకు ఇవ్వడం ద్వారా లబ్ధిదారులకు నికర ఆదాయం లభిస్తుంది' అని వివరించారు. బిల్లుపై జరిగిన చర్చలో ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్ కుమార్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, డి.పార్థసారథి, కొండ్రు మురళీమోహన్ మాట్లాడారు. పరిశ్రమల కోసం అసైన్డ్ భూములు తీసుకునేటప్పుడు పేదలకు అన్యాయం జరగకుండా మంచి నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వానికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారు.

గ్రామ, వార్డు సచివాలయాల చట్ట సవరణ బిల్లుకు ఆమోదం

గ్రామ, వార్డు సచివాలయాల పేరును 'స్వర్ణ గ్రామం- స్వర్ణ వార్డు'గా పేరు మారుస్తూ ఆ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ప్రతిపాదించిన చట్టసవరణ బిల్లుకు శాసనసభ ఏగ్రీవంగా ఆమోదం తెలిపింది. దీనిపై జరిగిన చర్చలో ఎమ్మెల్యేలు పీజీవీఆర్ నాయుడు(గణబాబు), కాల్వ శ్రీనివాసులు ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు.


ప్రతి ఎకరాకూ సాగునీరు

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీలో జరిగిన ప్రత్యేక చర్చలో ఆయన మాట్లాడారు. 'తెలుగు రాష్ట్రాలకు ప్రయోజనం కలిగించే పోలవరం- నల్లమల సాగర్ లింకు ప్రాజెక్టుకు తెలంగాణ సహా ఎగువ రాష్ట్రాలు అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదు. గోదావరి నదిపై ఎగువ రాష్ట్రం కాళేశ్వరం ప్రాజెక్టు కడుతుంటే మేం అభ్యంతరం చెప్పలేదు. సముద్రంలోకి వృథాగా పోతున్న గోదావరి జలాలు వాడుకుంటే ఎవరికి నష్టం? టీడీపీ ప్రభుత్వాల హయాంలోనే రాయలసీమలో ప్రాజెక్టుల నిర్మాణం జరిగింది. కాంగ్రెస్, వైసీపీ అధికారంలో ఉండగా సీమలో ఒక్క ప్రాజెక్టు కట్టలేదు. జగన్ పాలనలో సాగునీటి ప్రాజెక్టులన్నీ విధ్వంసానికి గురయ్యాయి' అని సీఎం ఆగ్రహం వ్యక్తంచేశారు. మరో నాలుగు నెలల్లో వెలిగొండ తొలిదశ పూర్తిచేసి నీళ్లిస్తామని ప్రకటించారు. గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం తొలిదశ పూర్తిచేస్తామని, ఉత్తరాంధ్రలోని 11 ప్రాజెక్టులనూ ఈ టర్మ్‌లోనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి కృష్ణా, ఏలూరు జిల్లాల్లోని మెట్ట ప్రాంతానికీ నీరందించేలా చర్యలు చేపడతామని చంద్రబాబు పేర్కొన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

నీటి భద్రతపైనే దృష్టి

'విజన్-2047లో భాగంగా నీటి భద్రతపై కూటమి ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించింది. నదీ జలాలను అత్యంత పవిత్రమైనవిగా భావించి పూజించే సంప్రదాయం మనది. గోదావరికి అఖండ హారతి, కృష్ణానదికి పవిత్ర హారతి ఇచ్చాం. గోదావరి, కృష్ణా పుష్కరాలను ఘనంగా నిర్వహించే అపూర్వ అవకాశం మా ప్రభుత్వానికి వచ్చింది. గత 30ఏళ్లుగా గోదావరి నది నుంచి సగటున 3వేల టీఎంసీల జలాలు సముద్రంలో వృథాగా కలిసిపోతున్నాయి. అందుకే వంశధార నుంచి పెన్నా వరకూ నదుల అనుసంధానం చేపట్టాలని నిర్ణయించాం. రాష్ట్రంలో అంతర్గతంగా నదుల అనుసంధానం చేపడితే జాతీయ స్థాయిలో ఈ ప్రక్రియ సులువవుతుందన్న ప్రధాని మోదీ సూచనలు అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ టీడీపీ, ఎన్డీయే ప్రభుత్వాల హయాంలోనే నిర్మించినవే. ప్రధానంగా రాయలసీమలో హంద్రీ నీవా సుజల స్రవంతి, గాలేరు నగరి సుజల స్రవంతి, తెలుగుగంగ వంటి ప్రాజెక్టులను ఎన్టీఆర్, తెలుగుదేశం ప్రభుత్వాల పాలనలోనే చేపట్టాం. హంద్రీ నీవా కాలువను 738 కి.మీ. మేర విస్తరించి కుప్పంలో పరమసముద్రం చెరువు దాకా కృష్ణా జలాలను తీసుకెళ్లాం. మడకశిర వరకూ నీటిని తీసుకువెళ్లి ఆ ప్రాంతవాసుల దాహార్తిని తీర్చాం. ధవళేశ్వరం వద్ద బ్యారేజీ కట్టిన కాటన్ దొరను గోదావరి జిల్లాల రైతాంగం ఇప్పటికీ గుర్తుంచుకున్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు 1996 మార్చి 5న నేనే శంకుస్థాపన చేశా. దాదాపు 30ఏళ్ల తర్వాత మరో నాలుగు నెలల్లో నేనే ఆ ప్రాజెక్టును పూర్తి చేస్తున్నా. ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు రూ.2,500 కోట్లు వ్యయం చేస్తాం. రూ.456 కోట్లతో ఫీడర్ చానల్ పనులకు బుధవారమే శంకుస్థాపన చేశాం. ఈ ప్రాజెక్టు పనులు పూర్తికాకుండానే 2024 ఎన్నికల ముందు జగన్ సిగ్గులేకుండా రిబ్బన్ కట్ చేశారు.



ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో మే 15 నాటికే నారుమళ్లకు సాగునీరందిస్తాం. ఈ మేరకు రైతులను సన్నద్ధం చేయాలి.

- సాగునీటి రంగానికి 2014-19 మధ్యకాలంలో రూ.68వేల కోట్లు వ్యయం చేశాం. గత 20 నెలల్లోనే రూ.20వేల కోట్లు ఖర్చు చేశాం.

- సీఎం చంద్రబాబు

కుప్పంలోనూ ట్యాంకర్లు తీసుకువచ్చి కాలువలో నీళ్లు పోశారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులనూ జగన్ విధ్వంసానికి గురిచేశారు. గత పాలకులు గుండ్లకమ్మ ప్రాజెక్టుకు గేట్లు కూడా పెట్టలేకపోయారు. వారి నిర్లక్ష్యం కారణంగా అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయింది. రాష్ట్రానికి జీవనాడి పోలవరం ప్రాజెక్టు పోలవరం డయాఫ్రమ్‌వాల్ కొట్టుకుపోయినా జగన్ గుర్తించలేకపోయారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని కూడా ఆపేశారు. జగన్ ప్రాజెక్టులను విధ్వంసం చేస్తుంటే నేను అనంతపురం నుంచి వంశధార దాకా పర్యటించా. చేయని నేరానికి గత పాలకులు నన్ను అరెస్టు చేసి 53 రోజుల పాటు జైల్లో పెట్టారు.'

ప్రాజెక్టుల్లో పుష్కలంగా జలాలు

'రాష్ట్రంలోని చిన్నా, పెద్దా రిజర్వాయర్లలో 1,312 టీఎంసీల మేర నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం 793 టీఎంసీల మేర జలాశయాల్లో నిల్వలున్నాయి. రాష్ట్రంలో 16లక్షల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ అమలు చేస్తున్నాం. ఇందులో 3లక్షల హెక్టార్లలో మొక్కజొన్న పంట వేస్తున్నారు. అన్నమయ్య జిల్లాలో నీటి పొదుపు సంరక్షణ విధానాన్ని అమలు చేయయడం ద్వారా విద్యుత్తు ఆదా చేస్తున్నాం ఇదే తరహాలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తే నెలకు రూ.300 కోట్ల మేర విద్యుత్తు బిల్లులు ఆదా అవుతాయి. కొందరు రాజకీయం కోసమే నీటి సమస్యలను తీసుకొస్తున్నారు. రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ సాగునీరు, ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా తాగునీరు, పరిశ్రమలకు నీరందించే సంకల్పంతో పనిచేస్తున్నాం.'

తాగునీరు కలుషితమైతే కమిషనర్లదే బాధ్యత

- మున్సిపల్ శాఖ ఉత్తర్వులు

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో తాగునీరు కలుషితమైతే కమిషనర్లపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ స్పష్టం చేసింది. రాష్ట్రంలో కొన్ని పట్టణ స్థానిక సంస్థల్లో ఇటీవల గ్యాస్ట్రోఎంటరైటిస్, డయేరియా కేసులు చెలరేగిన నేపథ్యంలో సీఎం ఆదేశాలతో మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ, పబ్లిక్‌హెల్త్, ఆరోగ్యశాఖ, జిల్లా యంత్రాంగం పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఫీల్డ్ స్థాయిలో తనిఖీలు పెంచి లోపాలను వెంటనే సరిచేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం తేలితే బాధ్యులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రతి మున్సిపల్ కమిషనర్ పట్టణంలో సరఫరా చేసే తాగునీరు ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడాలని, దీనికి వ్యక్తిగత బాధ్యత వహించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్, బీపీఎస్ నిధుల పంపిణీకి మార్గదర్శకాలు

- మౌలిక సదుపాయాల కల్పన కోసం వినియోగం

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో మౌలిక సదుపాయాల లోటును తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్‌ఆర్‌ఎస్-2020, బీపీఎస్-2025 కింద వసూలైన నిధుల వినియోగంపై సమగ్ర మార్గదర్శకాలు జారీచేస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను సవరణ చేశారు. రాష్ట్రంలో అమృత్ 2.0 కింద నీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, చెరువుల పునరుద్ధరణకు భారీగా నిధులు వెచ్చిస్తున్నప్పటికీ, వరద కాల్వలు, పర్యావరణ మౌలిక వసతుల రంగాల్లో ఇంకా లోటు ఉందని ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో ఎల్‌ఆర్‌ఎస్, బీపీఎస్ నిధులను మౌలిక పనులకు వినియోగించేందుకు ప్రాధాన్యత క్రమాన్ని నిర్దేశించింది. ఎల్ఆర్ఎస్ నిధులను గ్రామీణ ప్రాంతాల్లో యూడీఏ 30 శాతం, గ్రామ పంచాయతీలు 50 శాతం, డీటీసీపీకు 20 శాతం పంపిణీ చేయనున్నారు. పట్టణ ప్రాంతాల్లో యూడీఏలకు 10 శాతం, పట్టణ స్థానిక సంస్థలకు 25 శాతం, డీటీసీపీలకు 65 శాతం కేటాయించనున్నారు. బీపీఎస్ నిధులు గ్రామీణ ప్రాంతాలకు యూడీఏ 15 శాతం, గ్రామ పంచాయతీ 70 శాతం, డీటీసీపీ 15 శాతం పంపిణీ చేస్తారు. పట్టణ స్థానిక సంస్థలకు, గ్రామ పంచాయతీలకు కేటాయించిన నిధులు ఆయా పరిధుల్లోనే వినియోగించాల్సి ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఎమ్మెల్యేలను పోలవరం తీసుకువెళ్లండి

- స్పీకర్‌ను కోరిన సీఎం చంద్రబాబు
- త్వరలోనే సందర్శిస్తాం: అయ్యన్న

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పోలవరం సాగునీటి ప్రాజెక్టు నిర్మాణాన్ని శాసన సభ్యులకు చూపించాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడిని సీఎం చంద్రబాబు కోరారు. జాతీయ స్థాయిలో అత్యంత పెద్ద ప్రాజెక్టు ఇదేనని, సమీప భవిష్యత్తులో ఇలాంటి ప్రాజెక్టు నిర్మాణం జరిగే అవకాశం లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గురువారం సాగునీటి ప్రాజెక్టులపై చర్చలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు దాదాపు పూర్తికావొచ్చాయన్నారు. 2014-19లో 73 శాతం పనులు పూర్తి చేశామన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్.. పోలవరం ప్రాజెక్టునూ విధ్వంసానికి గురిచేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక పోలవరాన్ని గాడిలో పెట్టామని, గోదావరి పుష్కరాలలోపే ప్రాజెక్టు తొలిదశను పూర్తిచేసి, నీరందిస్తామని చంద్రబాబు ప్రకటించారు. ముఖ్యమంత్రి సూచన మేరకు త్వరలోనే పోలవరం ప్రాజెక్టును ఎమ్మెల్యేలతో కలిసి సందర్శిస్తానని అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. జల వనరుల శాఖ మంత్రి రామానాయుడితో మాట్లాడి పర్యటనను ఖరారు చేస్తానన్నారు.

నువ్వేంటి చెప్పేది?

- మండలిలో సోము వీర్రాజును అడ్డుకున్న వైసీపీ సభ్యులు

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): శాసనమండలిలో గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో బీజేపీ సభ్యుడు సోము వీర్రాజు మీదకు వైసీపీ సభ్యులు దూసుకొచ్చారు. సభ్యుల ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు ఇస్తున్నప్పుడు వైసీపీ ఎమ్మెల్సీలు గొడవ చేస్తుండటంతో వీర్రాజు రెండుసార్లు పోడియం వద్దకు వెళ్లి, ఛైర్మన్ మోషేన్‌రాజుకు రెండు చేతులెత్తి దండం పెడుతూ.. 'ప్రభుత్వ వివరణలు వినమనండి. విపక్షాన్ని అదుపు చేయండి. సభను ఆర్డర్‌లో పెట్టండి' అని కోరారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌పై వైసీపీ సభ్యుల ప్రశ్నకు మంత్రి రామానాయుడు సమాధానం చెప్తుండగా.. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ అంశం ప్రస్తావనకు వచ్చింది. దీనిపై అధికార, ప్రతిపక్ష సభ్యులు వాదనకు దిగారు. మంత్రి ప్రసంగ సమయంలో.. వైసీపీ సభ్యులు కూర్చోవాలని ఛైర్మన్ కోరుతుండగా, వీర్రాజు మరోసారి ఛైర్మన్ పోడియం వద్దకు వద్దకు వెళ్లి 'సభను ఆర్డర్‌లో పెట్టండి. చెప్పింది వినమనండి' అన్నారు. దీంతో 'నువ్వేంటి చెప్పేది' అంటూ వైసీపీ సభ్యుడు బొమ్మి ఇజ్రాయెల్ మండిపడుతూ సోము దగ్గరకొచ్చారు. మరికొందరు వైసీపీ సభ్యులు కూడా ఆయన వెనుకే వచ్చారు. దీంతో టీడీపీ సభ్యులు లేచి వెళ్లి.. వీర్రాజుకు మద్దతుగా నిలబడ్డారు. ఇరుపక్షాల వాగ్యుద్ధంతో ఛైర్మన్ సభను కొద్దిసేపు వాయిదా వేశారు.

వైసీపీ సభ్యులు నాపైకి దురుసుగా వచ్చారు: సోము

వైసీపీ సభ్యులు సభలో తనపైకి చాలా దురుసుగా వచ్చారని వీర్రాజు తెలిపారు. మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ ఛైర్మన్ వైసీపీ సభ్యులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే భావన కలుగుతోందని.. గొడవ మొదలు కాగానే సభను వాయిదా వేస్తున్నారని, ప్రశ్నోత్తరాలను వాయిదా వేయొద్దని పోడియం వద్దకు వెళ్లి ఆయన్ను కోరానని చెప్పారు. ఛైర్మన్‌ను అడుగుతుండగానే.. వైసీపీ సభ్యులు తనపైకి చాలా దురుసుగా వచ్చారని.. గతంలో ఎన్నడూ సభలో ఇలాంటి పరిస్థితి చూడలేదన్నారు. చేసిన తప్పులను కప్పి పుచ్చుకోవడానికే ఇలాంటి పన్నాగం పన్నారని, లడ్డూ మీద చర్చ జరిగితే సమాధానం చెప్పాల్సి వస్తుందనే వైసీపీ సభ్యులు ఇలా చేశారని అన్నారు. నెయ్యి కల్తీ అంశాన్ని అంగీకరించాల్సి వస్తుందేమోననే సభను వాయిదా వేశారన్నారు. ప్రశ్నోత్తరాలు సజావుగా జరపాలని అడిగితే మీదకి రావడం, వ్యక్తిగతంగా మాట్లాడడం మంచిపద్ధతి కాదన్నారు. హౌస్‌లోకి విజిల్స్ వేసుకుంటూ వస్తున్నారని, దేవుడి ఫోటోలు తెస్తున్నారని ఇదేం ప్రవర్తన అని ప్రశ్నించారు.

ఆవు నెయ్యి రూ.320కి వస్తుందా: వీర్రాజు

'స్వచ్ఛమైన ఆవు నెయ్యి కిలో రూ.320కి వస్తుందా?.. వీళ్లు(వైసీపీ) 420లు గనుక ఆ ధరకు కొన్నారు' అని సోము వీర్రాజు అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో తిరుమల లడ్డూ తయారీకి స్వచ్ఛమైన ఆవు నెయ్యి వాడారా.. లేదా.. అనే విషయమై అప్పటి సీఎం జగన్ సమాధానం చెప్పి తీరాల్సిందేనన్నారు. తిరుమలలో లడ్డూ తయారీకి నెయ్యి కొనుగోలు చేసిన ధరకే జగన్, ఆయన పార్టీ నేతల ఇళ్లల్లో వాడకానికీ కొంటున్నారా? అని ప్రశ్నించారు. ఈ విషయాలు మాట్లాడితే వైసీపీ సభ్యులు జీర్ణించుకోలేక పోతున్నారని ఎద్దేవా చేశారు.

వైసీపీ తీరుపై పంచుమర్తి ఆగ్రహం

వైసీపీ ఎమ్మెల్సీల తీరుపై చీఫ్‌విప్ పంచుమర్తి అనురాధ మండిపడ్డారు. ప్రశ్నోత్తరాలు జరపాలని ఛైర్మన్‌ను అడిగితే వైసీపీ ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ సహా మరికొందరు సోము వీర్రాజు మీదకు వస్తుంటే మంత్రులు వెళ్లి అడ్డుకున్నారని తెలిపారు. టీడీపీ ఎమ్మెల్సీ ఎంఎస్ రాజు మాట్లాడుతూ.. నందిపల్లిలోని ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాల్లో పాల్గొన్న జగన్.. అక్కడ పూజారి ఇచ్చిన తీర్థాన్ని స్వీకరించకుండా కిందకి వదిలేశారన్నారు. గోత్రనామాలు చెప్పకుండా అవహేళన చేశారని విమర్శించారు.

జగన్‌కు బుద్ధి చెప్పేందుకు హిందువులు సిద్ధం: బీజేపీ నేత వల్లూరు

'అధికార మదంతో హిందూ ఆలయాలపై దాడిచేసి ప్రతిపక్ష హోదా కూడా కోల్పోయారు. అధికారం కోల్పోయాక హిందువుల తరఫున మాట్లాడే బీజేపీ ప్రజాప్రతినిధులపై దాడికి యత్నిస్తున్నారు. వైసీపీ నేతలు తీరు మార్చుకోకుంటే వచ్చే ఎన్నికల్లో చట్ట సభల్లో వారికి జీరో కట్టబెట్టేందుకు హిందువులు సిద్ధంగా ఉన్నారు' అని రాష్ట్ర బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ హెచ్చరించారు. మండలిలో సోము వీర్రాజుపై వైసీపీ ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయెల్ దాడికి ప్రయత్నించడాన్ని తీవ్రంగా ఖండించారు.

ఎస్సీ, ఎస్టీలకు 2 వేలకోట్ల సబ్సిడీలు

- ఎంఎస్ఎంఈలకు రూ.270 కోట్లు
- పరిశ్రమలు, ఎంఎస్ఎంఈల ఏర్పాటులో ఎస్సీ, ఎస్టీలకు అత్యంత ప్రాధాన్యం
- 1274 కోట్ల పెట్టుబడులకు అవకాశం.. 17 వేలమందికి ఉపాధి అవకాశాలు
- ల్యాండ్ రిబేట్ 25 నుంచి 50 లక్షలకు పెంపు
- 100 కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తాం
- గత ప్రభుత్వం కంటే మిన్నగా ప్రోత్సాహకాలు.. అసెంబ్లీలో టీజీ భరత్



అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీ రూపంలో వివిధ కేటగిరిల్లో రూ.2 వేల కోట్లు అందించామని, ఎంఎస్ఎంఈలకు రూ.270 కోట్లు ఇచ్చామని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ వెల్లడించారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో రూ.2 వేలకోట్లు ఇవ్వగా, కూటమి ప్రభుత్వం 20 నెలల్లో ఈ మేరకు ఇచ్చామని, రాబోయే మూడేళ్లలో మరింత సబ్సిడీ ఇస్తామని అన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు మరిన్ని అవకాశాలు కల్పించాలని, నూతన పారిశ్రామిక విధానంలో వారికి కల్పించిన అవకాశాలను తెలియజేయాలని ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, విజయచంద్ర, కొండ్రు మురళి అడిగిన ప్రశ్నలకు మంత్రి బదులిచ్చారు. రాష్ట్రంలో వివిధ స్థాయిల్లో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు రూ.1274 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు అవకాశం కల్పించామని టీజీ భరత్ తెలిపారు. మొత్తం 51 ప్రాంతాల్లో పరిశ్రమలు పెడుతున్నారని, 17 వేలమందికి ఉద్యోగాలు వస్తాయని వెల్లడించారు. వారికి ల్యాండ్ రిబేట్ కింద రూ.37 కోట్లు కేటాయించామన్నారు. గత ప్రభుత్వం 2019-24 మధ్యలో రూ.1005 కోట్లు కేటాయించగా, కూటమి ప్రభుత్వం 20 నెలల్లో రూ.751 కోట్లు అందించిందని తెలిపారు. వైసీపీ సర్కారు ఐదేళ్లలో 470 ఎకరాలు కేటాయిస్తే, కూటమి ప్రభుత్వం 262 ఎకరాలు కేటాయించిందని చెప్పారు. దీంతో పాటు ఎమ్మెల్యేల విన్నపం మేరకు ల్యాండ్ రిబేట్‌ను రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచామన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు, ఎంఎస్ఎంఈల ఏర్పాటులో ఎస్సీ, ఎస్టీలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పెనాల్టీలు లేకుండా ప్రాజెక్టు నిర్మాణానికి సమయాన్ని పొడిగించామన్నారు. "ఎస్సీ, ఎస్టీలను ప్రోత్సహించేందుకు సీఎం చంద్రబాబు ఎస్క్రో అకౌంట్ తీసుకురావాలని చూస్తున్నారు. దీనిపై ప్రత్యేక చట్టం చేసే ఆలోచనలో ఉన్నారు. దీని ద్వారా సబ్సిడీ, ఇతర నిధులు ఎస్సీ, ఎస్టీల ఖాతాల్లో నేరుగా పడేలా ఏర్పాట్లు చేస్తున్నాం. వైసీపీ పాలనలో సబ్సిడీలు పెండింగ్‌లో పెట్టారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఎస్సీ, ఎస్టీలకు మెంటరింగ్ సహకారం అందిస్తున్నాం. పరిశ్రమలకు టెండర్లలో 4 శాతం టెండరింగ్ సంబంధించి వెసులుబాటు కల్పించాం. కేంద్ర ప్రభుత్వ నిధులకు సంబంధించి రూ.100 కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తాం. దీనిద్వారా 5 వేల మంది ఎస్సీ, ఎస్టీలకు మేలు జరుగుతుంది. ఇప్పటికే రాష్ట్రంలో ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ, ఏపీ ఎంఎస్ఎంఈ వ్యవస్థాపక అభివృద్ధి విధానం, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ వంటివి 25 పాలసీలు తీసుకువచ్చాం. గత ప్రభుత్వంలో పాలసీలు ఇచ్చారు కానీ, మార్గదర్శకాలు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వంలో పాలసీలతో పాటు మార్గదర్శకాలను విడుదల చేశాం. సింగిల్ డెస్క్ పోర్టల్‌లో ఎస్సీ, ఎస్టీలకు ఎలాంటి అవకాశాలు ఇచ్చారు, ఎంత శాతం రిజర్వేషన్లు ఇచ్చారన్న వివరాలు ఉంటాయి. క్యాపిటల్ సబ్సిడీలో 45 శాతం, 25 శాతం జనరల్ కేటగిరిలో సబ్సిడీ ఇచ్చాం. టెక్నాలజీ అప్‌డేట్, పరిశ్రమ విస్తరణకు 40 శాతం వరకూ ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీ అందిస్తున్నాం. ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్ జనరల్ కేటగిరికి, ఎస్సీ, ఎస్టీలకు చాలా తేడా ఉంది. ల్యాండ్‌కు సంబంధించి 75 శాతం రిబేట్ ఇస్తున్నాం" అని మంత్రి అన్నారు.



కర్నూలు, నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ పరిధి కూటమి ప్రజాప్రతినిధులు, కుటుంబసభ్యులకు గురువారం ఉండవల్లి నివాసంలో మంత్రి లోకేశ్ విందు ఏర్పాటు చేశారు. నేతల కుటుంబ సభ్యులు పరస్పరం పరిచయం చేసుకున్నారు. సరదా సంభాషణలతో ఆహ్లాదంగా గడిపారు.

అర్బన్‌లో గృహ నిర్మాణానికి 2.5 లక్షలు

- ఇల్లు లేని వారికి 2 సెంట్ల స్థలం.. గ్రామాల్లో 3 సెంట్లు
- అసెంబ్లీలో పార్థసారథి ప్రకటన



అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అర్బన్‌లో పీఎంఏవై కింద ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షలు అందిస్తున్నామని మంత్రి పార్థసారథి తెలిపారు. ఇల్లు లేనివారికి అర్బన్‌లో రెండు సెంట్లు, రూరల్ ప్రాంతంలో మూడు సెంట్లు ఇస్తామని ప్రకటించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) మాట్లాడుతూ.. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో అర్బన్, రూరల్ ప్రాంతాల్లో పీఎం అవాస్ యోజన కింద ఇచ్చే లబ్ధిలో చాలా వ్యత్యాసం ఉందన్నారు. అర్బన్‌లో రూ.2.50 లక్షలు, రూరల్ ప్రాంత ప్రజలకు రూ.1.59 లక్షలు ఇస్తున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, అందరికీ ఒకేలా నిధులు ఇవ్వాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వంలో కాకినాడలో వందల ఎకరాల్లో లేఅవుట్లు వేసి, పట్టాలిచ్చి లబ్ధిదారులకు స్థలం చూపించలేదన్నారు. లబ్ధిదారుల పట్టాలు పట్టుకుని తిరుగుతున్నారని, రూరల్ అయితే మూడు రకాల పట్టాలు ఇచ్చారని అన్నారు.మంత్రి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సభ దృష్టికి తీసుకువచ్చిన అంశాలన్నీ వాస్తవమేనని అన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో పట్టణ ప్రాంతం, రూరల్ ప్రాంతంలోని గృహ నిర్మాణానికి తేడా ఉందన్నారు. యూఎల్‌బీ, యూడీఏలో ఒకే రకమైన మొత్తాన్ని అందించామన్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం యూఎల్‌బీ, యూడీఏలను వేరు చేసిందన్నారు. సీఆర్‌డీఏ, వీఆర్‌డీఏల్లో మాత్రమే యూఎల్‌బీలకు సమానంగా నిధులు ఇస్తున్నారన్నారు. కాకినాడ అర్బన్‌కు సంబంధించి తేడాలు ఉంటే సరి చేస్తామన్నారు. పట్టాల పంపిణీలో గందరగోళం ఉందని, విచారణ చేసి అనర్హులకు రద్దు చేస్తామని అన్నారు. భూములు ఇచ్చిన రైతులకు డబ్బులు ఇవ్వకుండానే పట్టాలు పంపిణీ చేశారని, స్థలం ఇవ్వని వారికి అర్బన్‌లో రెండు సెంట్లు, రూరల్‌లో మూడు సెంట్లు ఇస్తామని అన్నారు.

అవినాశ్ అరెస్ట్

- సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు లొంగుబాటు
- విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపర్చిన సిట్
- నేటి వరకు రిమాండ్.. గుంటూరు జైలుకు తరలింపు

విజయవాడ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో ఏ7గా ఉన్న ముప్పిడి అవినాశ్‌రెడ్డిని సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు గురువారం సిట్ అధికారుల ఎదుట ఆయన లొంగిపోయాడు. వైద్య పరీక్షలు చేయించిన అనంతరం సిట్ అధికారులు విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. ఏసీబీ కోర్టు శుక్రవారం వరకు అవినాశ్‌రెడ్డికి రిమాండ్ విధించింది. ప్రాసిక్యూషన్ తరపున డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మి వాదనలు వినిపించారు. అవినాశ్ రెడ్డి మద్యం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డికి తోడల్లుడని తెలిపారు. ఆయన ప్రస్తుతం విజయవాడ జిల్లా జైల్లో ఉన్నాడని, అందువల్ల అవినాశ్‌రెడ్డిని రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలించాలని విజ్ఞప్తి చేశారు. తోడల్లుళ్లు ఇద్దరూ ఒకే జైలులో ఉంటే దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. మద్యం కుంభకోణంలో అవినాశ్‌రెడ్డి ఒక్క సంతకంతో వేలాది లావాదేవీలు నిర్వహించాడన్నారు. నేరం చేయడంలో తోడల్లుడు రాజశేఖర్‌రెడ్డి కంటే ఆయన తక్కువ కాదని, సమానంగా నేరం చేశాడని కోర్టుకు వివరించారు. అవినాశ్‌రెడ్డి చేసిన కుంభకోణానికి సంబంధించి 39 మంది నుంచి సిట్ అధికారులు వాంగ్మూలం తీసుకున్నారన్నారు. నిందితుడు తరపున న్యాయవాది చంద్రగిరి విష్ణువర్ధన్ వాదనలు వినిపిస్తూ.. డీడీ చేసిన వాదనలను రిమాండ్ రిపోర్టులో ఎక్కడా రాయలేదన్నారు. నిందితుడి కాలికి గాయమైనందున విజయవాడ జిల్లా జైలుకు తరలించాలని అభ్యర్థించారు. రిమాండ్ పొడిగింపునకు రాజమండ్రి నుంచి ఇక్కడ తీసుకురావడం కష్టంగా ఉంటుందన్నారు. రిమాండ్ పొడిగింపు బాధ్యతను పోలీసులు చూసుకుంటారని, నిందితుడిని రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలించాలని విజయలక్ష్మి విజ్ఞప్తి చేశారు. ఇరువురి వాదనలు విన్న తర్వాత అవినాశ్‌రెడ్డికి శుక్రవారం వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి పి.భాస్కరరావు ఆదేశాలు ఇచ్చారు. నిందితుడిని గుంటూరు జిల్లా జైలుకు తరలించాలని ఎస్కార్ట్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కేసులో ఇతర నిందితుల రిమాండ్ పొడిగింపు శుక్రవారం వరకు ఉంది. నిందితులందరి రిమాండ్ పొడిగింపు ఒకే తేదీ ఉండేలా అవినాశ్ రెడ్డికి ఒక రోజు రిమాండ్ విధించారు.

వ్యూహకర్త అతనే

(మొదటి పేజీ తరువాయి)

రిమాండ్ రిపోర్టులో వివరించారు. సాక్షుల వాంగ్మూలాలు, సాంకేతిక ఆధారాలు, ఎఫ్ఎస్ఎల్ నివేదికలు అవినాశ్ రెడ్డి పాత్రను నిర్ధారించినట్లు పేర్కొన్నారు. తోడల్లుడైన ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి(ఏ-1)తో కలిసి రూ.3,500 కోట్ల స్కాంలో కీలక భూమిక పోషించినట్లు వెల్లడించారు. 'లిక్కర్ సిండికేట్‌కు అవినాశ్‌రెడ్డి ప్రధాన వ్యూహకర్తగా ఉంటూ లావాదేవీలు నిర్వహించాడు. మద్యం ముఠాలో కీలకంగా వ్యవహరిస్తూ వ్యాపారుల నుంచి ముడుపులు వసూలు చేశాడు. ఆ సొమ్మును వివిధ మార్గాల్లో మళ్లించి మనీలాండరింగ్‌కు పాల్పడ్డాడు. ముడుపులు చెల్లించే మద్యం బ్రాండ్లకు మాత్రమే ఆర్డర్లు దక్కేలా ఎక్సైజ్ అధికారులను నియంత్రించాడు' అని సిట్ పేర్కొంది. పారదర్శకంగా ఉన్న ఆటోమేటిక్ విధానాన్ని, పాపులర్ బ్రాండ్లను తొలగించి, ఆ స్థానంలో ముడుపుల మద్యం సరఫరా కోసం ఆర్డర్ ఫర్ సేల్ నియంత్రించాడని రిమాండ్ రిపోర్టులో వెల్లడించింది. ప్రభుత్వ ఔట్‌లెట్లతో మద్యం అమ్మకాలను అవినాశ్ రెడ్డి నియంత్రించాడని పేర్కొంది. ముడుపుల రూపంలో సేకరించిన సొమ్మును గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులకు ఎన్నికల ఖర్చుల కోసం, వ్యక్తిగత విలాసాల కోసం వినియోగించినట్లు తెలిపింది. బినామీ పేర్లతో ఆస్తులు కొనుగోలు చేసినట్లు ఆధారాలు లభించాయని, మనీలాండరింగ్‌పై దర్యాప్తు జరుగుతోందని పేర్కొంది. అవినాశ్ రెడ్డి ఐఐటీ గ్రాడ్యుయేట్ యువకుల్ని ఎంపిక చేసుకుని మద్యం ముడుపుల వసూళ్ల బాధ్యత అప్పగించినట్లు వెల్లడించింది. మద్యం ధర, బ్రాండు ఆధారంగా ఒక్కో మద్యం కేసుపై రూ.150 నుంచి రూ.600 వరకూ కమీషన్లు వసూలు చేసినట్లు తెలిపింది. అక్రమ సొమ్ము దారి మళ్లించేందుకు తప్పుడు ఇన్వాయిస్‌లు సృష్టించినట్లు ఆధారాలు ఉన్నాయని పేర్కొంది. హైదరాబాద్, తాడేపల్లి మధ్య ముడుపుల ఆర్థిక వ్యవహారాలను అవినాశ్ రెడ్డి సమన్వయం చేసినట్లు తెలిపింది. ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయగానే 2025 ఫిబ్రవరిలో థాయ్‌లాండ్‌కు పారిపోయి ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు చేశాడని వివరించింది. సుప్రీం కోర్టు ఆదేశాలతో లొంగిపోయిన నిందితుడు స్కామ్‌లో తన పాత్ర గురించి ప్రశ్నిస్తే సహకరించలేదని రిమాండ్ రిపోర్టులో సిట్ పేర్కొంది.


అవినాశ్ రెడ్డి

సుమిత్‌గా చెప్పుకొంటూ...

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మద్యం పాలసీ రూపకల్పనకు సంబంధించిన సమావేశాల నుంచి ముడుపుల వసూలు వరకూ అవినాశ్ రెడ్డి కీలక పాత్ర పోషించాడు. 2019 అక్టోబరు 13న హైదరాబాద్‌లో జరిగిన కీలక సమావేశంలో పాల్గొన్నాడు. మద్యం కొనుగోలు వ్యవస్థలో మార్పులు, ముడుపుల శాతం వసూలు, సరఫరాలో ఏకాధిపత్యంపై జరిగిన చర్చల్లోనూ పాల్గొన్నాడు. ఎలాంటి అధికారిక హోదా లేకపోయినా అప్పటి ఏపీఎస్‌బీసీఎల్ అధికారులు, సహనిందితులు వాసుదేవ రెడ్డి(ఏ-2), సత్యప్రసాద్ (ఏ-3)కు అవినాశ్ రెడ్డి ఆదేశాలు జారీ చేసినట్లు సిట్ తెలిపింది. "లిక్కర్ వ్యాపారులకు ఆర్డర్ కావాలంటే అవినాశ్‌ను కలవాలంటూ సత్యప్రసాద్, వాసుదేవ రెడ్డి చెప్పేవారు. ముడుపులు ఇస్తేనే ఆర్డర్లు ఇప్పిస్తానంటూ అవినాశ్ రెడ్డి కండీషన్ పెట్టేవాడు. అవినాశ్ తన పేరును సుమిత్‌గా చెప్పుకొంటూ ఆర్డర్ ఫర్ సేల్, ముడుపులిచ్చిన బ్రాండ్ల ఆర్డర్ల పెంపు-తగ్గింపులపై తీవ్ర ప్రభావం చూపాడు. రాజ్ కసిరెడ్డి(ఏ-1) ఆదేశాలతో మద్యం ఉత్పత్తిదారులతో సంప్రదింపులు జరిపాడు. మద్యం ఆర్డర్లు, తర్వాత ముడుపుల స్వీకరణకు ఆధారాలున్నాయి" అని సిట్ పేర్కొంది.

221.6 కోట్ల బోగస్ బిల్లులు

ఆదాన్ డిస్టిలరీస్‌పై పూర్తి భాగస్వామ్య నియంత్రణ తో అవినాశ్‌రెడ్డి షెల్ కంపెనీల ద్వారా నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించి ముడుపులు భారీగా దారి మళ్లించినట్లు సిట్ వెల్లడించింది. ఆదాన్ అకౌంటెంట్ సాక్ష్యం ప్రకారం రూ.221.60 కోట్లను ఇలా మళ్లించినట్లు తెలిపింది. ముడుపుల సొమ్ముకు ప్యాకేజింగ్, లాజిస్టిక్స్ సంస్థల పేర్లపై సరుకు లేకుండానే బిల్లులు సృష్టించి... ఆ సొమ్మును పలు దశలు దాటించి తీసుకెళ్లాక రికార్డులు మాయం చేశాడని వివరించింది. కసిరెడ్డితో సమన్వయం చేసుకుని, నగదు రవాణా, కిక్ బ్యాక్స్ వసూళ్ల పర్యవేక్షణకు సంబంధించి ఫోన్ సంభాషణ, లొకేషన్ల డేటా, నగదు హ్యాండ్లర్ల వాంగ్మూలాలు స్పష్టం చేస్తున్నాయని తెలిపింది. 2025 ఫిబ్రవరిలో సిట్ ఏర్పాటు కాగానే విదేశాలకు పారిపోయినట్లు తెలిపింది.

నకిలీ మద్యం కేసులో సింథిల్‌కు 2 రోజుల కస్టడీ

విజయవాడ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో ఏ22గా ఉన్న సింథిల్ కుమార్‌ను రెండు రోజుల పాటు ఎక్సైజ్ కస్టడీకి ఇస్తూ విజయవాడ ఆరో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో సింథిల్ కుమార్ నుంచి మరిన్ని విషయాలు రాబట్టాల్సి ఉందని, ఐదు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని ఎక్సైజ్ అధికారులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై వాదప్రతివాదనలు ముగియడంతో న్యాయాధికారి జి.లెనిన్‌బాబు తీర్పును వెలువరించారు. మార్చి ఒకటి, రెండు తేదీల్లో కస్టడీకి అనుమతిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

దుబాయ్‌లో దొరికిన మోసగాడి అరెస్ట్


- అనిల్‌కుమార్ రెడ్డిని ఏపీ పోలీసులకు అప్పగించిన సీబీఐ

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో మోసాలకు పాల్పడి విదేశాలకు పారిపోయిన ఎద్దుల అనిల్ కుమార్ రెడ్డిని ఇంటర్ పోల్ సాయంతో సీబీఐ భారత్‌కు తీసుకొచ్చింది. మోసం, నమ్మక ద్రోహం, క్రిమినల్ బెదిరింపులకు సంబంధించిన నేరాల్లో నిందితుడైన అనిల్ కుమార్ రెడ్డిపై ఏపీ పోలీసులు 2022 సెప్టెంబరు 5న రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేశారు. అబుదాబిలో ఉన్నట్లు పసిగట్టిన సీబీఐ ఇంటర్ పోల్ ద్వారా అదుపులోకి తీసుకుంది. దుబాయ్ పోలీసులు నిందితుడిని సీబీఐకి అప్పగించారు. సీబీఐ అధికారులు ఎద్దుల అనిల్ కుమార్ రెడ్డిని భారత్‌కు తీసుకొచ్చి, గురువారం హైదరాబాద్ విమానాశ్రయంలో ఏపీ పోలీసులకు అప్పగించారు.

స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిపేలా

ఆదేశించండి

- హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు
- రాష్ట్ర ప్రభుత్వం, ఎస్ఈసీకి నోటీసులు



అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 13,325 గ్రామపంచాయతీలు, 123 పట్టణ స్థానిక సంస్థలకు త్వరలో కాలపరిమితి ముగియనున్న నేపథ్యంలో సకాలంలో ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం, ఎస్ఈసీని ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. దీనిపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఈమేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. న్యాయవాది తాండవ యోగేష్ దాఖలు చేసిన ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యం గురువారం విచారణకు రాగా పార్టీ ఇన్ పర్సన్‌గా ఆయనే స్వయంగా వాదనలు వినిపించారు. 'రాష్ట్రంలోని గ్రామపంచాయతీలకు ఏప్రిల్ 2, పట్టణ స్థానిక సంస్థలకు మార్చి 17తో కాలపరిమితి ముగియనుంది. రాజ్యాంగంలోని అధికరణ 243ఇ(3), 243యు(3) ప్రకారం కాలపరిమితి ముగియడానికి ముందే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది' అని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ... 'సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ముందు బీసీ జనాభా లెక్కింపునకు డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. 2023లో కమిషన్ ఏర్పాటైనప్పటికీ నివేదిక సమర్పించలేదు. దీంతో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కమిషన్‌ను పునర్వ్యవస్థీకరించింది. బీసీ జనాభా లెక్కింపు ప్రక్రియ పూర్తి చేసిన తరువాతే స్థానిక సంస్థలకు ఎన్నికల నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ మరో పిల్ దాఖలైంది' అని వివరించారు. అన్ని వివరాలు జత చేసి కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని కోరారు. అందుకు అంగీకరించిన ధర్మాసనం విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.


వైసీపీ నాయకులు, కార్యకర్తలకు అభివాదం చేస్తున్న జగన్

అధికారంలోకి వస్తే.. రక్తంతో హోలీ!

- జగన్ నెల్లూరు పర్యటనలో 'రప్పా.. రప్పా' నినాదాలతో వైసీపీ కార్యకర్తల వీరంగం

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఓ వివాహ వేడుకలో పాల్గొనేందుకు గురువారం నెల్లూరుకు వచ్చిన వైసీపీ అధ్యక్షుడు జగన్ పర్యటనలో ఆ పార్టీకి చెందిన కొంత మంది కార్యకర్తలు 'రప్పా.. రప్పా' నినాదాలతో వీరంగం చేశారు. 'మీరు అధికారంలోకి వస్తే రక్తంతో హోలీ ఆడాలి' అంటూ నినాదాలు చేశారు. అంతేగాక బారికేడ్లు గోడలను దూకి జగన్ హెలిప్యాడ్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వారందరినీ అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం హెచ్చరించి వదిలేశారు. జగన్ గురువారం ఉదయం హెలికాప్టర్‌లో నెల్లూరు కనుపర్తిపాడుకు చేరుకొన్నారు. అక్కడి నుంచి రోడ్డుమార్గాన వీపీఆర్ కల్యాణమండంలో జరిగిన వివాహ కార్యక్రమంలో పాల్గొని, తిరిగి 11 గంటల ప్రాంతంలో బెంగళూరు వెళ్లిపోయారు.

విశాఖకు క్యాప్‌జెమినీ

- భూముల పరిశీలనకు వచ్చిన కంపెనీ ప్రతినిధులు
- మధురవాడ ఐటీ పార్కు సహా 4 ప్రాంతాల సందర్శన

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఐటీ కంపెనీ క్యాప్‌జెమినీ విశాఖ నుంచి కార్యకలాపాల నిర్వహణకు ఆసక్తి చూపుతోంది. ఈ మేరకు ఇప్పటికే కంపెనీ ప్రతినిధులు ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. భూముల పరిశీలనకు గురువారం నగరానికి వచ్చారు. భీమిలి ఆర్డీవో సంగీత్‌మాధుర్, విశాఖ రూరల్ తహశీల్దారు పాల్‌కిరణ్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ప్రతినిధులు, ఏపీఐఐసీ అధికారులతో కలిసి తొలుత మధురవాడ ఐటీ పార్కులోని హిల్-1పై మిరాకిల్ సొల్యూషన్స్‌కు సమీపానున్న 20 ఎకరాలను చూశారు. అనంతరం అడవివరంలో గూగుల్ డేటా సెంటర్ నిమిత్తం కేటాయించిన భూమికి ఆనుకుని ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఇంకా విశాఖ రూరల్, ఆనందపురం మండలాల్లో మరో రెండు ప్రాంతాలను చూశారు. కంపెనీ కార్యకలాపాలు ప్రారంభించేందుకు వీలుగా ఉన్న భూములపై తమ అభిప్రాయాన్ని ప్రభుత్వ పెద్దలకు నివేదించనున్నారు.

మీరెళ్తారా.. నన్ను వెళ్లమంటారా?

(మొదటి పేజీ తరువాయి)

వస్తాయన్నారు. శ్రీకాకుళం పట్టణంలో నీటి కలుషితం కారణంగా ప్రబలిన డయేరియా, రాజమండ్రిలో కల్తీ పాల కారణంగా పలువురు చనిపోయిన ఘటనలపై సీఎం చంద్రబాబు గురువారం అసెంబ్లీలోని తన చాంబర్ నుంచి శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశారు. కల్తీ పాల ఘటనపై ఉదాసీనత వద్దని సూచించారు. రెండు ఘటనల్లో బాధితులకు అందుతున్న వైద్య సాయంపై వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు అన్నివిధాలా అండగా ఉండాలని, స్పెషలిస్టులతో అత్యుత్తమ వైద్య సేవలందించాలని సూచించారు. ప్రజల ప్రాణాలు పోవడానికి కారణమైన ఘటనల్లో బాధ్యులపై కఠిన చర్యలకు ఆదేశించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

అప్పుడే జవాబుదారీతనం పెరుగుతుంది..

ఘటన జరిగాక స్పందించడం వల్ల పెద్దగా ఉపయోగం ఉండదని, ముందస్తు పర్యవేక్షణ, అప్రమత్తత ద్వారా ఈ తరహా ఘటనలు జరగకుండా చూడాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. కలెక్టర్లు, వివిధ విభాగాల్లోని జిల్లా స్థాయి అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపడితే నివారించవచ్చన్నారు. ప్రతి ప్రభుత్వ విభాగంలో కింది స్థాయి యంత్రాంగాన్ని యాక్టివేట్ చేసేందుకు, ఆయా విభాగాల్లో పరిస్థితులను తెలుసుకునేందుకు ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. కలెక్టర్లు నిత్యం ప్రజల్లో ఉండాలని, అప్పుడే అనుకున్న మార్పును రాష్ట్రస్థాయిలో చూపించగలమన్నారు. శ్రీకాకుళం ఘటనలో ముందస్తు పర్యవేక్షణ, తనిఖీలు జరిగి ఉంటే.. సమస్య వచ్చేది కాదన్నారు. శుక్రవారం మరోసారి సమీక్ష చేస్తానని చెప్పారు.

24 గంటలూ క్యాంపు: శ్రీకాకుళం కలెక్టర్

డయేరియా ఘటనపై శ్రీకాకుళం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ మాట్లాడుతూ... ఇప్పటి వరకు 129 డయేరియా కేసులు నమోదయ్యాయని, ప్రస్తుతం 107 మందికి వివిధ ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నామని, మిగతా వారు డిశ్చార్జి అయ్యారని చెప్పారు. 'డయేరియా పరిస్థితిని ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. పైపుల ద్వారా నీటి సరఫరాను నిలుపుదల చేసి, ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నాం. ఇంజనీరింగ్ బృందాలు వివిధ చోట్ల 40 లీకులను గుర్తించి, మరమ్మతులు చేపట్టారు. సిబ్బంది, యంత్రాలతో పారిశుధ్య నిర్వహణ చేపట్టాం' అని తెలిపారు. విశాఖ నుంచి మొబైల్ టెస్టింగ్ ల్యాబ్‌ను శ్రీకాకుళానికి తరలిస్తున్నామని, ప్రభావిత ప్రాంతాల్లో 24 గంటలు అందుబాటులో ఉండేలా మెడికల్ క్యాంపులను నిర్వహిస్తున్నామని వివరించారు. రిమ్స్, కిమ్స్, శ్రీకాకుళం జెమ్స్‌లో ప్రత్యేక వార్డుల ద్వారా డయేరియా బాధితులకు చికిత్స అందిస్తున్నామని, నెఫ్రాలజీ, ఇతర వైద్య నిపుణులను ఈ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచామన్నారు. డయేరియా వ్యాప్తికి కారణంపై విచారణ చేస్తున్నామని, డోర్ టూ డోర్ సర్వే చేసి, శానిటేషన్ కిట్ అందజేస్తున్నామని చెప్పారు. స్థానికులు వాటర్ ట్యాంకులు క్లీన్ చేయకపోవడం, పైప్ లైన్ల డ్రెయిన్లు క్రాస్ అవ్వడంతోపాటు వాటర్ ప్రెజర్ లేదని మోటార్లు పెట్టి నీటిని తీసుకోవడం వల్ల కలుషిత నీరు ఇళ్లకు చేరిందని అధికారులు తెలిపారు.

రోజూ పర్యవేక్షిస్తున్నాం: తూ.గో కలెక్టర్

రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటన, బాధితులకు వైద్య సాయంపై తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ.. '20 మంది కల్తీ పాల కారణంగా అనారోగ్యం పాలవగా.. ఐదుగురు మృతిచెందారు. 15 మంది చికిత్స పొందుతున్నారు. కల్తీ పాల సరఫరా జరిగిన చౌడేశ్వరీ నగర్, స్వరూప్ నగర్‌లో 9 వైద్య బృందాలను నియమించాం. 110 ఇళ్లను సందర్శించి, 315 మంది రక్త నమూనాలు సేకరించి విశ్లేషిస్తున్నాం. కల్తీ పాలను తాగిన 957 మందిని ప్రతిరోజూ పర్యవేక్షిస్తున్నాం. ఈ ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రూ.10 లక్షల ఆర్థిక సాయం కూడా అందించాం. ఆయా ప్రాంతాల్లో ఎమర్జెన్సీ వైద్య బృందాలను అందుబాటులో ఉంచాం' అని వివరించారు. సీనియర్ నెఫ్రాలజిస్ట్ డా.రవిరాజు సూచనల మేరకు ఇతర ప్రాంతాల నుంచి యాంటీ డోస్ ఇంజక్షన్ రప్పిస్తున్నట్టు చెప్పారు. ఈ ఘటనలో నిందితుడైన పాల సరఫరాదారు అడ్డాల గణేశ్వరరావుపై క్రిమినల్ కేసు నమోదు చేసి, కస్టడీకి తీసుకుని విచారణ చేస్తున్నామని తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో 8 మంది పరిస్థితి క్రిటికల్‌గా ఉందని, ఇతర ప్రాంతాల నుంచి వైద్య పరికరాలతో పాటు నిపుణులైన డాక్టర్లను తీసుకొచ్చి వైద్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు కూడా తనిఖీలు చేస్తున్నారని అధికారులు వివరించారు. సమీక్షలో మంత్రులు నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, నిమ్మల రామానాయుడుతోపాటు మున్సిపల్, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కాగా, కల్తీ పాల బాధితులను మంత్రి కందుల దుర్గేశ్ గురువారం పరామర్శించారు.

సునీల్ నాయక్‌పై అరెస్ట్ వారెంట్

- గుంటూరు మొబైల్ మెజిస్ట్రేట్ కోర్టు జారీ
- రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసులో ఏ-7
- పట్నాలోనే ఉన్న ఐపీఎస్ దామోదర్ బృందం

గుంటూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నాటి నరసాపురం ఎంపీ, ప్రస్తుత అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్‌కు గురిచేసిన కేసులో ఏ-7 నిందితుడిగా ఉన్న బిహార్ కేడర్ ఐపీఎస్ అధికారి ఎం.సునీల్ నాయక్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. గురువారం గుంటూరులోని మొబైల్ మేజిస్ట్రేట్ కోర్టు ఈ వారెంట్ జారీ చేసింది. అధికారిక ఉత్తర్వులు శుక్రవారం ఇవ్వనున్నట్లు వెల్లడించింది. బిహార్‌లో హోంగార్డ్స్ అండ్ ఫైర్ సర్వీసెస్ ఐజీగా విధులు నిర్వహిస్తున్న నాయక్‌ను అరెస్టు చేసేందుకు విజయనగరం ఎస్పీ దామోదర్ నేతృత్వంలో 12 మంది ఏపీ పోలీసుల బృందం పట్నాకు వెళ్లిన సంగతి తెలిసిందే. సోమవారం ఆయనను అరెస్టు చేసి, వైద్య పరీక్షల అనంతరం ఏపీకి తీసుకువచ్చేందుకు ట్రాన్సిట్ వారెంట్ కోసం స్థానిక కోర్టులో హాజరుపరచారు. అయితే మేజిస్ట్రేట్ ట్రాన్సిట్ వారెంట్ రిమాండ్‌ను తిరస్కరించారు. వందలాదిమంది బిహార్ పోలీసులు కోర్టుకు చేరుకొని నాయక్‌ను విడిపించుకుని వెళ్లారు. దీంతో మంగళవారం గుంటూరులోని మొబైల్ మెజిస్ట్రేట్ కోర్టులో పోలీసులు నాన్ బెయిలబుల్ వారెంట్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. అదే రోజు ప్రాసిక్యూషన్స్ జాయింట్ డైరెక్టర్ వీరగంధం రాజేంద్రప్రసాద్ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు మేజిస్ట్రేట్‌కు అందించి వాదనలు వినిపించారు. రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్‌కు గురి చేసిన సమయంలో ఆ గదిలో సునీల్ నాయక్ ఉన్నట్లు పక్కా ఆధారాలు ఉన్నాయని, ఆయనను కస్టడీకి తీసుకొని పూర్తిస్థాయిలో విచారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సునీల్ నాయక్‌కు ప్రొటెక్షన్ కల్పిస్తూ పట్నా సెషన్స్ కోర్టు ఇచ్చిన ఆదేశాలకు ఎటువంటి విలువా లేదని గురువారం విచారణలో తెలిపారు. ఈ కేసు ఆ కోర్టు పరిధిలోకి రాదని, తనకు అధికారం లేకపోయినా అక్కడి న్యాయాధికారి ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఇంతకుముందే సునీల్ నాయక్ గుంటూరు రెండో అదనపు జూనియర్ జడ్జి కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా, కోర్టు పిటిషన్ కొట్టి వేసిందన్నారు. దీనిపై ఆయన ముందస్తు బెయిల్‌కు, లేదంటే ప్రొటెక్షన్‌కు వెళ్లాలనుకుంటే ఏపీ హైకోర్టు లేదా సుప్రీంకోర్టుకు వెళ్లాలని.. ఇతర రాష్ట్రాల్లోని కోర్టులకు ఆయనకు ప్రొటెక్షన్ ఇచ్చే అధికారం ఉండదని అన్నారు. సునీల్ నాయక్ తరపు న్యాయవాదులు మార్చి 2 వరకు ప్రొటెక్షన్ ఉందని మేజిస్ట్రేట్ దృష్టికి తీసుకెళ్లారు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం సునీల్ నాయక్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తున్నట్లు మేజిస్ట్రేట్ స్రవంతి ప్రకటించారు. ఉత్తర్వులు అందిన తర్వాత ఏపీ పోలీసులు చట్ట ప్రకారం సునీల్ నాయక్‌ను అరెస్టు చేసేందుకు ముందడుగు వేయనున్నారు. కస్టోడియల్ టార్చర్ కేసు విచారిస్తున్న ఎస్పీ దామోదర్ బృందం ప్రస్తుతం పట్నాలోనే ఉన్నారు.

ప్రణాళికాబద్ధంగానే టీటీడీపై కుట్ర

- వైసీపీ హయాంలో 200కుపైగా ఆలయాల కూల్చివేత
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ధ్వజం



గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ప్రణాళికాబద్ధంగానే టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కుట్ర జరిగిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ విమర్శించారు. ప్రసాదంలో కల్తీ, పరకామణిలో అక్రమాలు, స్వామి వారి సేవల తగ్గింపు, అన్యమతస్తులకు భూముల కేటాయింపు ఈ కుట్రలో భాగమేనన్నారు. గుంటూరులో గురువారం విలేకరులతో మాట్లాడుతూ 2019-24 కాలంలో 200కుపైగా దేవాలయాల కూల్చివేత, వాటి ఆస్తులు ధ్వంసం చేశారని మండిపడ్డారు. అదృష్టవశాత్తు కూటమి ప్రభుత్వ చర్యలు, చాగంటి, గరికపాటి లాంటి ప్రవచనకర్తలతో రాష్ట్రంలో ఆధ్యాత్మికత, దేవాలయ సంప్రదాయాలు నిలబడ్డాయని పేర్కొన్నారు. ఝార్ఖండ్ మాదిరిగా మన రాష్ట్రంలోనూ దేవాలయాలను పర్యాటక ప్రాంతాలుగా మార్చాలని సూచించారు. లిక్కర్ స్కామ్ పాత్రధారులతో పాటు అసలైన సూత్రధారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

పూర్తి నివేదిక మా ముందు ఎందుకు ఉంచలేదు?

- చిత్తూరు డీఎఫ్‌వో, రేంజ్ అధికారిపై హైకోర్టు ఆగ్రహం

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఓ మైనింగ్ కంపెనీ వివాదంలో బోయకొండ రిజర్వ్ ఫారెస్ట్ సరిహద్దుకు సంబంధించి రెవెన్యూ, అటవీ, మైనింగ్ శాఖ ఉమ్మడిగా సర్వే చేసి సమర్పించిన ఇరవై పేజీల నివేదికలో 4 పేజీలను మాత్రమే అఫిడవిట్‌కు జత చేయడంపై హైకోర్టు అనుమానం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై వివరణ ఇచ్చేందుకు స్వయంగా తమ ముందు హాజరుకావాలని చిత్తూరు జిల్లా డీఎఫ్‌వో, ఫారెస్ట్ రేంజ్ అధికారిని ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి 3కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కుంచం మహేశ్వరరావు బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం చంద్రమాకులపల్లి గ్రామ పరిధిలో 2.880హెక్టార్ల విస్తీర్ణంలో మైనింగ్ కార్యకలాపాలు నిలిపివేయాలని పలమనేరు డివిజనల్ మైన్స్ అండ్ జియాలజీ అధికారి ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ సూర్య రాక్స్ సంస్థ యజమాని హైకోర్టును ఆశ్రయించారు.

రాజంపేట లాడ్జిలో అగ్నిప్రమాదం

- షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు.. ఒకరు మృతి.. నలుగురికి గాయాలు

రాజంపేట, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా రాజంపేటలోని దీప్ లాడ్జిలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. స్థానిక ఆర్ఎస్ రోడ్డులో ఉన్న దీప్ లాడ్జి రిసెప్షన్ కౌంటర్ వద్ద బుధవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో షార్ట్‌సర్క్యూట్ జరగడంతో అక్కడున్న వైర్లు, ఫ్రిజ్ మంటల్లో చిక్కుకున్నాయి. ఫ్రిజ్ సిలిండర్ పేలిపోవడంతో కౌంటర్‌ను అగ్నికీలలు చుట్టుముట్టాయి. ఈ కౌంటర్ వద్ద నుంచే లాడ్జిపైకి మెట్ల మార్గం ఉంది. ఈ దారి గుండా మంటలు, పొగ పైన ఉన్న గదులకు వ్యాపించాయి. లాడ్జిలో బసచేసిన ముత్యాలపాటి వెంకట శ్రీనివాసులు(36) మంటల్లో చిక్కుకొని అక్కడికక్కడే మృతి చెందారు. మంచినీటి క్యాన్ ద్వారా ఆయన మంటలను ఆర్పడానికి ప్రయత్నించినట్లు తెలుస్తోంది. లాడ్జిలో బుధవారం రాత్రి 39 మంది బస చేశారు. వీరిలో కాకినాడకు చెందిన రామాంజనేయులు ప్రమాదం జరిగిన వెంటనే రాజంపేటలోని తన మిత్రుడు వెంకటాద్రినాయుడుకు ఫోన్ చేశారు. అగ్నిప్రమాదం జరిగిందని, తమను కాపాడాలని కోరారు. దీంతో ఆయన ఫైర్ సిబ్బందికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాకప సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదంలో గాయాలపాలైన నలుగురిని 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్పీ రామ్‌నాథ్ హెగ్డే తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal, Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376, RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.